ప్రజాపక్షం
7th ANNIVERSARY
22nd October, 2025

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

సంపుటి 08, సంచిక: 318 | ఆదివారం | 19-10-2025 | మహబూబ్‌నగర్ Published from: **Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar** పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## స్తంభించిన తెలంగాణ

42 శాతం రిజర్వేషన్ల కోసం : బిసి జెఎసి బంద్ సంపూర్ణం

రోడ్డెక్కని బస్సులు : తెరుచుకోని దుకాణాలు

సినిమా హాళ్లు, విద్యాసంస్థలు, మాల్స్, రెస్టారెంట్లు, వాణిజ్య సముదాయాలు స్వచ్ఛందంగా మూసివేత

03












## గుర్తుతెలియని దేశం.. మహిళ మాయం!



ఇటీవల సోషల్ మీడియాలో తెగ హల్‌చల్ చేస్తున్న వార్తల్లో న్యూయార్క్‌లోని జెఎఫ్‌కె విమానాశ్రయంలో మహిళకు సంబంధించి న సమాచారం ప్రముఖంగా ఉంది. ఈ వార్తలను అనుసరించి జెఎఫ్‌కె విమానాశ్రయం లో ఒక మహిళ అక్కడి అధికారులకు ఇచ్చిన పాస్‌పోర్ట్‌పై 'టౌరెన్జా' అనే దేశం పేరు ఉంది. కానీ, అధికారులు ఎంత వెతికినా అలాంటి పేరుగల దేశం లేదు. ఒకవైపు అధికారులు ఆ వివరాలను పరిశీలిస్తుండగా, మరోవైపు ఆమె క్షణాల్లో మాయమైంది. ఈ వీడియోలు, ఫొటోలు ఇంటర్నెట్‌లో వైరల్ అయ్యాయి. 'పారలల్ యూనివర్స్', 'టైమ్ ట్రావెల్' వ్యవహారాల్లా తప్పుడు ఊహలను వైరల్ చేశారు. కానీ, ఈ వార్త పూర్తిగా అవాస్తవం. జెఎఫ్‌కె అధికారులుగానీ, అమెరికా కస్టమ్స్ వర్గాలుగానీ ఇలాంటి సమాచారం ఏదీ విడుదల చేయలేదు. అక్కడి రికార్డుల్లో ఆ దృశ్యాలకు సంబంధించిన వివరాలేవీ నమోదు కాలేదు. సిసిటివి ఫుటేజీల్లోనూ ఎలాంటి ఆధారాలు లేవు. అత్యాధునిక కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లేదా ఎఐ) సాయంతో ఈ వార్తా కథనాన్ని తయారు చేశారని నిపుణులు తేల్చారు. అంతేగాక, 1950 దశకంలో వచ్చిన ఒక డాక్యుమెంటరీని ఈ విధంగా మార్చి చూపించారని పేర్కొన్నారు. జపాన్‌లోని హనేడ్ ఎయిర్‌పోర్ట్‌లో 'మ్యాన్ ఫ్రమ్ టౌరెడ్' అనే కథ ప్రాచుర్యం పొందింది. దాని ఆధారంగా తీసిన ఓ డాక్యుమెంటరీ ఫుటేజీలను తీసుకొచ్చి, డీప్‌ఫేక్ టెక్నాలజీ సాయంతో, కొత్త వీడియోలు, ఫొటోలు రూపొందించారు. జెఎఫ్‌కెలో మాత్రమేకాదు ప్రపంచంలోనే ఎక్కడా జరగని ఘటనను నిజమని నమ్మించే ప్రయత్నం జరిగింది.



## మట్టితో కేక్‌లు!

ఆశ్చర్యం అనిపించినా ఇది అక్షరాలా నిజం. పశ్చిమార్థ గోళంలోని అత్యంత పేద దేశాలలో ఒకటైన హైతీలో కొనసాగుతున్న దారుణం. అక్కడ ఆహారం దొరకక చాలా మంది కుటుంబాలు బతకడానికి 'బోన్‌బోన్' అనే కేక్‌పై ఆధారపడుతున్నారు. మట్టి, ఉప్పు, నూనెను కలిపి, కేక్‌ల ఆకారంలో తయారు చేసి, ఎండలో ఆరబెడతారు. ఇది హైతీ సంస్కృతిలో భాగమని చాలామంది అనుకునేవారు. కానీ, బిబిసి, సిబిఎస్ న్యూస్, రాయిటర్స్ వంటి అంతర్జాతీయ వార్తా సంస్థలు అక్కడి దారుణ పరిస్థితులను వివరించడంతో, మట్టి కేక్‌ల ఉదంతం తెరపైకి వచ్చింది. ఇప్పుడు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నది. ఈ కేక్‌లను తయారు చేయడానికి మట్టిని హెన్చే అనే ప్రాంతం నుంచి తెస్తారు. ఈ మట్టిలో ఆకలిని తగ్గించే ఖనిజాలు ఉన్నాయని స్థానికులు నమ్ముతారు. అయితే వాస్తవానికి ఈ మడ్ కుకీల్లో పోషక విలువలు ఏమీ ఉండవు. వీటిని తరచుగా తినడం ఆరోగ్యానికి హానికరం. ఆహారం ధరలు తీవ్రంగా పెరిగిపోయినప్పుడు లేదా ప్రకృతి వైపరీత్యాలు, రాజకీయ అస్థిరతలు, వర్షాభావం వంటివి ఆహారపు సరఫరాను దెబ్బతీసినప్పుడు, ప్రజలు ఇలాంటి మడ్ కుకీలను చివరి మార్గంగా ఎంచుకుంటారు. హైతీ రాజధాని పరిసరాలలోని 'సిట్ సొలెయిల్' వంటి పేదప్రాంతాల్లో నివసించే కుటుంబాలకు ఇవి ఆకలిని కొంతకాలం అణచివేసే మార్గంగా మారింది. ప్రపంచంలో చాలామంది ప్రజలు ఎలాంటి దుస్థితిలో బతుకుతున్నారో చెప్పడానికి మట్టి కేక్‌లను మించిన ఉదాహరణ ఏముంటుంది?

## కృత్రిమ మొక్కలు!



పచ్చదనం తగ్గిపోవడం అనేకానేక సమస్యలకు కారణమవుతున్న తరుణంలో దక్షిణ కొరియాలోని డెగూ గ్యాంగ్బుక్ ఇన్‌స్టిట్యూ ట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డిజిఐఎస్‌టి) శాస్త్రవేత్తలు చేసిన ప్రయోగాలు ఉత్కంఠగా మారాయి. వారు సోలార్ పవర్ ఆధారిత 'కృత్రిమ మొక్క'ను అభివృద్ధి చేయడమే ఇందుకు కారణం. ఇది భయంకరమైన రేడియోధార్మిక సెషియం కలుషిత మట్టి శీఘ్రంగా శుద్ధి చేయడానికి తయారు చేశారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ 'ఆర్టిఫిషియల్ ప్లాంట్'ను తీర్చిదిద్దారు. ఇది సహజమైన మొక్కల మాదిరిగానే మట్టినుంచి కాలుష్యకర నీటిని శుభ్రం చేయగలుగుతుంది. దీని 'ఆకు'లలో సిసిఎం అయాన్లు ఉంటాయి. ఫలితంగా నీరు ఆవిరై తిరిగి మట్టిలోకి వెళుతుంది. సాంప్రదాయ ఫైటోరెమెడియేషన్ ప్రక్రియతో పోలిస్తే, ఇది వేగంగా పని చేస్తుంది. ప్రయోగాల్లో 20 రోజుల్లో 95 శాతానికిపైగా సెషియాన్ని తొలగించిందని పరిశోధకులు ప్రకటించారు. ఇది పూర్తిగా సౌరశక్తి తో పనిచేస్తుంది కాబట్టి, అదనపు విద్యుత్ లేదా నీరు అవసరం లేదు. విధానం, ఈ పరికరం కొల్హాపూర్ ఒస్మోసిస్, ప్లాంట్ ట్రాన్స్‌పైరేషన్ లాంటి ప్రక్రియను అనుసరిస్తుంది. దీనివలన, సహజ మొక్కల కంటే వేగంగా, ఎంతో సరళంగా కాలుష్యాన్ని తొలగించవచ్చు. 'ఆకులు' పూర్తి గా సెషియంతో నిండిపోయిన తర్వాత, వాటినితీసి, కొత్త ఆకులను అమరుస్తారు. తీసేసిన ఆకులను రసాయనాలతో శుభ్రంచేసి తిరిగివాడచ్చు. ఈ ప్రయోగం మిగిలిన పారిశ్రామిక వ్యర్థాల శుద్ధికీ, అణు ప్రమాద ప్రభావిత ప్రాంతాల్లో కాలుష్య నివారణకు ఉపయోగపడుతుంది.

## రబ్బర్ ఆవిష్కరణకుముందు..



కాగితంపై రాసిన అక్షరాలను తుడపడానికి వాడే రబ్బర్ లేదా ఎరేజర్ కనిపెట్టకముందు పరిస్థితి ఏమిటి? ఆ రోజుల్లో ఏ విధంగా అక్షరాలను తుడిచేవారు? ఈ ప్రశ్నలకు చరిత్ర సమాధానం చెప్తున్నది. దాదాపు 18వ శతాబ్దం చివరి వరకూ రొట్టె ముక్కల ను ఎరేజర్‌గా వాడేవారు. కొంచెం గట్టిపడిన రొట్టె ముక్కను చిన్న బంతిగా చేసి, పెన్సిల్ లేదా చార్కోల్ గుర్తులపై సున్నితంగా రుద్దేవారు. రొట్టె ముక్కల్లోని రంధ్రాలు గ్రాఫైట్ కణాలను ఆకర్షించేవి. అంటే, గ్రాఫైట్‌తో రాసే అక్షరాలు చెరిగిపోయేవి. కాగితానికి ఎలాంటి నష్టం ఉండేది కాదు. పెన్సిల్ గుర్తులను తొలగించే శక్తిగల పదార్థాన్ని 1770లో బ్రిటన్ శాస్త్రవేత్త జోసెఫ్ ప్రీస్ట్‌లీ కనుగొన్నాడు. దానిని 'ఇండియా రబ్బర్' అనేవారు. ఎరేజర్ ఆవిష్కరణకు అదే పునాది. అయితే, మొదట్లో దానితో తుడిపినప్పుడు కాగితానికి తడి అంటునేది. కాగితం త్వరగా పాడయ్యేది. 1830 దశకంలో చార్లెస్ గుడియర్ రబ్బరును సల్ఫర్ సాయంతో వేడిచేసే ప్రక్రియ ను కనుగొన్నాడు. తడి అంటుకునే లక్షణం పోవడమేగాక, ఎరేజర్ ఎక్కువకాలం మన్నేదిగా రూపాంతరం చెందింది. మనం ఇప్పుడిప్పుడు చేసే ప్రతి తప్పును చెరిపివేయడానికి వెనుక, ఒకప్పుడు రొట్టె చేసిన వినూత్న ప్రయోగ చరిత్ర దాగి ఉంది. అలాగే దానిని శాస్త్రీయంగా శాశ్వత సాధనంగా మార్చిన ఎంతోమంది కృషి గుర్తు చేస్తుంది.

**— బిఎస్ఎస్ మైత్రేయి**

## మోదీ హితవు.. కరువుకు నెలవు!

పారిశ్రామిక రంగాన్ని దాదాపుగా కార్పొరేట్ చేతుల్లో పెట్టిన కేంద్ర సర్కారు ఇప్పుడు వ్యవసాయాన్ని లక్ష్యంగా ఎంచుకుంది. ఎగుమతి ఆధారిత వాణిజ్య పంటలు ఎక్కువగా పండించాలని రైతులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నది. ఆహార ధాన్యాలకు కరువు ఏర్పడి, విదేశాల నుంచి దిగుమతులను తప్పనిసరి చేసే ప్రయత్నం స్పష్టమవుతున్నది. 'వ్యవసాయ కార్పొరేటీకరణ'కు కేంద్రం ప్రయత్నించడం కొత్తేమీ కాదు. 2020 సెప్టెంబర్ లో మూడు వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చింది. ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు సుమారు ఏడాదిపాటు కొనసాగించిన ఉద్యమం ఉధృతరూపం దాల్చడంతో, 2021 నవంబర్‌లో ఉపసంహరించుకుంది. కానీ, కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కి చట్టబద్ధత కల్పిస్తామని రైతులకు ఇచ్చిన హామీ ఇప్పటి వరకూ నెరవేరలేదు. ఎంఎస్‌పిపై నియమించిన కమిటీ జాడ లేదు. 800లకు పైగా ప్రాణాలు బలి తీసుకున్న నల్లచట్టాల నుంచి బయటపడిన ఆనందం రైతులకు ఎంతోకాలం నిలవలేదు. రైతుల బతుకు ముఖచిత్రం మారలేదు. ఇవేవీ పట్టని బిజెపి సర్కారు వాణిజ్య పంటలపై పదేపదే ప్రకటనలు చేస్తూనే ఉంది.

తాజాగా ప్రధాని నోట మరోసారి ఇదే మాట వినిపించింది. ప్రపంచ బ్యాంకు వంటి సంస్థలు, సామ్రాజ్యవాద దేశాలు చాలాకాలంగా కోరుతున్న విషయాన్నే మోదీ వల్లించారు. అమెరికా వంటి దేశాలు రైతులకు భారీ సబ్సిడీలు ఇస్తున్నాయి. వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నాయి. ఫలితంగా, పెరిగిన ఆహార ధాన్యాల ఉత్పత్తికి సరిపడా మార్కెట్‌ను అన్వేషిస్తున్నాయి. భారత్ వంటి విస్తారమైన మార్కెట్‌ను కొల్లగొట్టడానికి జరుగుతున్న ప్రయత్నాలను ఫలవంతం చేసే బాధ్యతను భుజాన వేసుకున్న తీరులో ప్రధాని వ్యవహరిస్తున్నారు. రైతులకు సూచనలు చేస్తున్నారు. కానీ, వాటి అమలు ఆచరణీయం కాదు. వాణిజ్య పంటలకు ఎంఎస్‌పి విధానాన్ని తొలగించడం వల్ల రైతులు ప్రపంచ మార్కెట్ ధరలలో విపరీతమైన హెచ్చుతగ్గుల కు గురవుతున్నారు. భారీ నష్టాలు ఎదుర్కొంటున్నారు. వాణిజ్య పంటలకు అధిక రుణాలు అవసరం. సరైన ధర లభించకపోతే నష్టాలు తప్పవు. ఎంఎస్‌పి పరిధి నుంచి వాణిజ్య పంటలను తొలగించడంతో, కనీస ధర పొందే అవకాశాన్ని కూడా రైతులు కోల్పోతున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. గత మూడు దశాబ్దాల్లో నాలుగు లక్షలకుపైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. వారిలో అత్యధిక శాతం వాణిజ్య పంటలు పండించే రైతులే. చట్టబద్ధత లేకపోయినా, ఆహార ధాన్యాలకు కనీసం ఎంఎస్‌పి అమల్లో ఉంది. మోదీ సూచన, ఆ మాత్రం భద్రతను కూడా కొల్లగొట్టే కుట్ర. రైతులు కనీస ఆదాయాన్ని కోల్పోతారు. ఆహార ధాన్యాల కొరత ఏర్పడుతుంది. కరువు తాండవిస్తుంది. ఆహార భద్రత అటకెక్కుతుంది. ప్రపంచీకరణలో భాగంగా, అధిక విస్తీర్ణంలో భూమిని ఆహారం నుంచి వాణిజ్య పంటలకు మార్చిన అనేక ఆఫ్రికన్ దేశాల పరిస్థితే ఇందుకు ఉదాహరణ. ప్రధాని సూచనను రైతులు ఆచరిస్తే, 'ప్రపంచీకరణ కరువు' కోరల్లో భారత్ విలవిల్లాడడం ఖాయం. ఎక్కువ శాతం వాణిజ్య పంటలు పండించి, ఆహార ధాన్యాలు దిగుమతి చేసుకోవడం కూర్చున్న కొమ్మను నరుక్కోవడమే. విదేశీ మారక నిల్వలు కరిగించుకోవడమే. ఆహార ధాన్యాలకు 'మద్దతు' లేక, రైతులు వీధినపడే ప్రమాదం పొంచి ఉంది. ఆహార ధాన్యాల అధిక ధరలు ప్రజల కొనుగోలు శక్తిని, జీవన ప్రమాణాలను తగ్గిస్తాయి. కరువు పరిస్థితులు తాండవిస్తాయి. సబ్సిడీపై ఆహారాన్ని ఇవ్వాల్సిన బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పుకుంటే, ఆకలి చావులు తప్పవు. ఆహార లభ్యత క్షీణించడం ఆర్థిక వ్యవస్థకు ప్రమాదకరం. వాణిజ్య పంటల పేరుతో వ్యవసాయరంగం నిర్వీర్యమవుతుంది. దేశం అప్పులపాలవుతుంది. పెట్టుబడిదారీ వర్గాల చేతిలో బందీగా మారుతుంది. సార్వభౌమాధికారం ఆవిరవుతుంది. ఇవేవీ పట్టనట్టు వాణిజ్య పంటలకు మారాలని రైతులకు ప్రధాని సూచించడం విచిత్రం.

టారిఫ్ రేట్లను పదేపదే పెంచుతూ భారత్‌పై విరుచుకుపడుతున్న అమెరికాకు అనుకూలంగా మాట్లాడడం బాధ్యతారాహిత్యం. 'ప్రపంచీకరణ కరువు' కోరల్లోకి దేశాన్ని నెట్టే కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలను ప్రజలే తిప్పికొట్టాలి. వాణిజ్య పంటలతో అద్భుతాలు ఏవీ జరగవు. జీవితాలు మరింత దుర్భరంగా మారతాయి. ఈ వాస్తవాన్ని రైతులు గ్రహించాలి. మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏవీ అమలు కాలేదు. రైతుల ఆదాయం రెట్టింపు కాలేదు.కనీస మద్దతు ధరకు చట్టబద్ధత దక్కలేదు. యూరియా నుంచి ఎంఎస్‌పి వరకూ అడుగడుగునా అన్యాయానికి గురవుతున్న రైతులను ఏమార్చడానికి ప్రధాని చేస్తున్న మరో ప్రయత్నమే పంట మార్పిడి ప్రతిపాదన. ప్రపంచ బ్యాంకుల డిమాండ్లను అమలు చేయడమే దీని ఆంతర్యం. రైతుల మీద బిజెపి ప్రభుత్వానికి కనీస సానుభూతి లేదని పలుమార్లు స్పష్టమైంది. ప్రధాని సలహా పాటిస్తే షరా మామూలే.

ప్రజాపక్షం
19-10-2025, ఆదివారం

### అరవైఎనిమిదియేండ్ల పోరాట అనుభవాల ప్రతిరూపం

# గీత జన జీవన ప్రగతి కేతనం గీత పనివారల సంఘం



కె.వి.ఎల్
రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ,
అభ్యుదయ రచయితల సంఘం
9490952649

'పోరాడితే పోయేదేమీ లేదు–బానిస సంకెళ్లు తప్ప' అని చాటి చెప్పుతూ కారల్ మార్క్స్ ఇచ్చిన పిలుపు అంతర్జాతీయ స్థాయిలో మానవులందరినీ మేల్కొల్పింది. పిడికిళ్ళు బిగించి రణ నినాదంతో ప్రజలందరినీ పోరాట మార్గం వైపు పయనింపజేసింది. ఈ సంవత్సరానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. అదేమిటంటే మార్క్సిజం–లెనినిజం సిద్ధాంతం పునాదిమీద భారతదేశంలో స్థాపించబడిన భారత కమ్యూనిస్టు పార్టీకి డిసెంబర్ 26 నాటికి 100 ఏండ్లు నిండుతున్నాయి. కష్టజీవుల కంటిపాపగా బడుగు జీవుల గుండె శ్వాసగా భారత కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం అన్ని ప్రాంతాల్లో బడుగు జీవుల బతుకు బాగుకోరే వారిలో చైతన్యాన్ని నింపింది. సంఘాలను పెట్టింది. ఎన్నో మరెన్నో విజయాలను సాధించి పెట్టింది. అటువంటి త్యాగాల పోరాటాల చరిత్ర కలిగిన కమ్యూనిస్టు పార్టీకి 100 ఏండ్లు నిండుతు న్న సందర్భంగా శత వసంతాల ముగింపు ఉత్సవాలు ఉద్యమాల గుమ్మం ఖమ్మం పట్టణంలో డిసెంబర్ నెలలో జరగనున్నాయి. మరొక ప్రత్యేకత ఏమిటంటే అదే ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గార్ల లో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మ భిక్షం నేతృత్వంలో 1957 అక్టోబర్19, 20 తేదీలలో ఆంధ్రప్రదేశ్ గీత పనివారల సంఘం స్థాపించబడింది. ఈ గీత పనివారల సంఘానికి అక్టోబర్ 19 నాటికి 68 ఏళ్ల పోరాట చరిత్రను సంతరించుకుంటుంది.

రాష్ట్రస్థాయిలో కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంత చైతన్యంతో నిజాం నవాబు నియంతృత్వ, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడుతూ 'దున్నేవాడికి భూమి', నినాదంతో సమం గా 'గీసే వానికే చెట్టు' అని రాజకీయ నినాదాన్ని ఇచ్చి కల్లుగీత కార్మికులను కూడగట్టింది. కల్లు గీత వృత్తిలో జీవిస్తున్నటువంటి కుటుంబాలలో ఈనాడు ఉన్నటువంటి జీవన పరిస్థితులు స్వాతంత్రానికి పూర్వం లేవు. అటు బ్రిటిష్ ప్రాంతంలోనూ ఇటు నిజాం నవాబు పరిపాలనలోనూ కల్లుగీత కార్మికులకు ఆకలి, దారిద్ర్యం, వ్యక్తి బానిసత్వంతో అయ్యా నీ బాంచన్ కాళ్ళు మొక్కుతా అంటూ వెనుకబాటుతనంతో చీకటి బతుకులను కొనసాగించారు. అటువంటి గీత కార్మికుల జీవితాల్లో నవవసంతం నింపి కొత్త జీవితాన్ని ప్రసాదించటానికి సంఘం నిర్మాత ధర్మభిక్షం పిలుపుమేరకు వేలాదిమంది గీత పనివారలు అన్ని జిల్లాల్లో గీతా పనివారల జెండా చేత పట్టుకుని ముస్తేదారుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుతూ ఇచ్చిన నినాదాల ప్రకంపనలు ఇంకా వినపడుతూనే ఉన్నాయి .

### తీర్మానాలలో ముందుచూపు

1957 అక్టోబర్‌లో గార్లలో జరిగిన ప్రథమ గీత పనివార్ల సంఘం రాష్ట్ర మహాసభలు ప్రవేశపెట్టిన తీర్మానాలు ధర్మభిక్షం ఉద్యమ ముందుచూపుకు ప్రతిబింబాలుగా గీత కార్మికుల భవిష్యత్తుకు, సంఘం ప్రతిష్టతకు పునాదిగా నిలబడ్డాయి. ఆనాటి ప్రధాన డిమాండ్లలో గీత వృత్తిదారులను దోపిడీ చేస్తున్న హర్రాజు కాంట్రాక్టు విధానాన్ని రద్దుచేసి వారికి గీత సహకార సంఘాలు (సొసైటీలు) ఏర్పరచాలని, సహకార సంఘాలతో రాష్ట్ర ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని అత్యంత చరిత్రాత్మకమైన ప్రాముఖ్యత కలిగినది. గ్రూపు పద్ధతులను రద్దుచేసి, దుకాణాలను గ్రామాల వారీగా పొందుబాటు చేయాలని, ఆంధ్ర ప్రాంతంలో అమలులో ఉన్న మద్య నిషేధాన్ని ఎత్తివేయాలని, గీత వృత్తి వారికి తాటి, ఈత వనం పెంపకానికి బంజరు భూములను ప్రభుత్వం ఇవ్వాలి. వారి కుటుంబాలకు విద్య, వైద్యం, గృహం సౌకర్యం కల్పించాలి. ఎక్సైజ్ చట్టాన్ని తెలుగులో వ్రాయాలి లాంటి ఎన్నో తీర్మానాలనుచేసి ఆమోదించింది. ఉద్యమ బాటలో ఒక్కొక్కటిగా విజయం సాధిస్తూ గ్రామగ్రామాన విస్తరిస్తూ ఈ సంఘం ముందుకు సాగింది.

తరతరాల గీత వృత్తి మన జన్మ హక్కు సహోదర... హక్కులపై ప్రభుత్వాల ఉక్కు పాదం ఏలరా... మన బతుకులకు బాగు కొరకు ఒక్కటిగా కదులుదాం. ఇంటి నుండి, వనం నుండి నడుముకు ముస్తాదు కట్టి తీర్మానాల అమలు కొరకు రాజీలేని పోరాటాల బాటలో సైన్యంలా గీత కార్మికులను లక్షలాదిగా కదిలించిన ఘనత గీత కార్మికుల సంఘం నిర్మాత ధర్మ బిక్షంగారి సొంతమైతే, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ అటు తర్వాత తెలంగాణ రాష్ట్రంలోనూ గీత పనివారల సంఘం పార్టీలకతీతంగా గీత కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు ప్రజలను ఉద్యమకారులను ఒక్క తాటిపై నడిపించిన ఘన చరిత్ర గీత పనివారల సంఘందేనని చెప్పవచ్చు.

### గీత కార్మికులకు అనేక విజయాలను సాధించిపెట్టిన సంఘం

హర్రాజు విధానానికి కాంట్రాక్టర్ల దోపిడీకి వ్యతిరేకంగా, త్రివిధ పన్నుల విధానాన్ని వ్యతిరేకంగా, కల్లుపై నిషేధానికి, సహకార సంఘాల రద్దు యోజనను, గ్రామ సొసైటీలపై ప్రతి సంవత్సరం పెంచుతున్న రెంటల్ విధానానికి వ్యతిరేకంగా గీత పనివారల సంఘం వీరోచితమైన పోరాటాలను నిర్వహించింది. ప్రభుత్వాల






గీత కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టగలిగింది. యాభై సంవత్సరాలు నిండిన కల్లుగీత కార్మికులకు వృద్ధాప్య పెన్షన్ ఇవ్వాలని చేసిన పోరాటంలో విజయాన్ని సాధించింది మన సంఘం అని గర్వంగా చెప్పుకోవచ్చు.

1975 డిసెంబర్ 1,2 తేదీల్లో సూర్యాపేటలో ఆంధ్రప్రదేశ్ గీత పనివారల సంఘం ద్వితీయ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఆనాటి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి గారి ద్వారా మహాసభ వేదికగా ఎక్స్‌గ్రేషియా విధానాన్ని సాధించడం జరిగింది. ఆనాడు చెట్టు పైనుండి ప్రమాదవశాత్తు క్రిందపడి చనిపోయిన గీత కార్మికుడి కుటుంబానికి రూ.1,500, వికలాంగుడైతే రూ.1000 రూపాయలను ప్రకటించడం జరిగింది. ఆ రోజున ఈ సంఘం సాధించిన ఎక్స్‌గ్రేషియా ఫలితంగా చెట్టుపై నుండి పడి మరణించిన వారి కుటుంబాలకు, గాయపడ్డ వారి కుటుంబాలకు ఈ సంఘం అండగా నిలబడ్డది. ఇప్పుడు మృతుల కుటుంబాలకు, గాయపడ్డ వారి కుటుంబాలకు ఇచ్చే నష్టపరిహారం 5 లక్షల వరకు పెంచడం జరిగింది. ఇక్కడ విస్మరించరాని విషయం ఏమిటంటే ఆనాడు ఉన్న ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు పురుషోత్వంరెడ్డి గారు ధర్మ బిక్షం గారు నడిపిన విద్యార్థి హాస్టల్లో చదువుకోవడం వారు చేస్తున్న ఉద్యమాల స్ఫూర్తితో ఎదగటం వలన కల్లుగీత కార్మికులకు కల్లు సొసైటీలు, ఎక్స్‌గ్రేషియా విధానాన్ని సాధించడం జరిగింది. ఒకరికొరకు అందరూ అందరికీ ఒకరు అనే సంఘ సంబంధంతో గీత పనివారల సంఘం గ్రామగ్రామాన ఈ సహకార సంఘాల సొసైటీలను సాధించడంలో విజయం సాధించింది. సహకార సంఘాల ఉద్యమ శత వార్షికోత్సవాల వేడుకలు రవీంద్ర భారతిలో జరుగుతున్నప్పుడు కల్లుగీత సహకార సంఘాల(సొసైటీలు )స్థాపనకొరకు ఒక్క ఉద్యమంగా నిర్వహించిన అఖిల భారత గీత పనివారల కార్మిక సమాఖ్య జాతీయ అధ్యక్షుడు ధర్మ బిక్షం ను ఆనాటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి సన్మానించడం విశేషం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ తెలంగాణ ఆంధ్ర రాష్ట్రాల్లో కల్లు సొసైటీలకు ఐదు ఎకరాల భూమి, తాటి, ఈత వనం పెంపకానికి ఇవ్వాలని పోరాడి సాధించిన ఘనత ఈ సంఘానికి దక్కింది.

### జాతీయ స్థాయిలో సంఘం

ప్రజల మనిషి ధర్మ బిక్షం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే కాక జాతీయ స్థాయిలో కూడా అఖిలభారత గీత పనివారల కార్మిక సమాఖ్య స్థాపించడం జరిగింది. ఈ సంఘానికి జాతీయ అధ్యక్షులుగా ధర్మభిక్షం, ప్రధాన కార్యదర్శిగా ఎస్.కుమారన్‌ల నేతృత్వం వహించారు. జాతీయస్థాయిలో మద్యనిషేధానికి వ్యతిరేకంగా పిలుపునిచ్చి మద్య నిషేధం జాబితా నుండి కల్లును మినహాయించాలని, కల్లును ప్రకృతి పానీయంగా, ప్రజల ఆహారం పానీయంగా గుర్తించాలని, గీత పనివారల సంఘం బలమైన పోరాటాలను నిర్వహించింది.

అంతేకాదు ఈ దేశ ప్రజలు పాలకులు కల్లును ప్రకృతి పానీయంగా గ్రామీణ ప్రజల ఆహార పానీయంగా, నీరాగా గుర్తించడం అంటే గీత పనివారల సంఘం విజయంగానే భావించాలి.

### శాస్త్రీయ దృక్పథం, సాహిత్యం

ఉమ్మడి రాష్ట్రంలో సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను, 40వ వార్షికోత్సవాలను, స్వర్ణోత్సవాలను, 60వ వార్షికోత్సవాలను నిర్వహించిన సందర్భంగా ఎంతోమంది మేధావులను ఉద్యమకారులను శాస్త్రవేత్తలను వివిధ పార్టీల నాయకత్వాన్ని ప్రభుత్వ ప్రతినిధులను ఆహ్వానించి తాటి, ఈత, ఖర్జూర, కొబ్బరి చెట్ల సంపద, వాటి ఉపయోగంపై వాటినుండి తినదగిన ఆహార పదార్థాల ఉత్పత్తుల గురించి నాన్ ఎడిబుల్ ప్రొడక్ట్స్ గురించి, సుదీర్ఘమైన లోతైన, ఆలోచనలు చేసి రిపోర్ట్స్ ను ప్రభుత్వాలకు అందజేయడం జరిగింది. సమరశీల పోరాటాల అనుభవాల పంచుతూ మిగిలిన ప్రజాసంఘాలకు ఆదర్శంగా నిలిచింది ఈ సంఘం. గీత పని వారల సంఘం నిర్వహించిన పోరాటాల వలన వచ్చిన విజయాల ఫలితంగా గీత కార్మికుల కుటుంబాలలో ఎన్నో మార్పులు వచ్చాయి. ఈ వృత్తికి గౌడ కులానికి, గీత కుటుంబాలకు గౌరవం పెరిగింది. ఈ కుటుంబాల నుండి వచ్చిన అనేక మంది సమాజంలో ఉద్యోగులుగా, నాయకులుగా, కళాకారులుగా, ప్రజా ప్రతినిధులుగా వ్యాపారులుగా, వివిధ రకాల సామాజిక ఉద్యమాల్లో భాగస్వామ్యులుగా ఎదిగి గుర్తింపు పొందుతున్నారు, రాజకీయాలను ప్రభావితం చేయగలుగుతున్నారు. ఈ ప్రగతికరమైన మార్పునకు పునాది నాడు ధర్మ బిక్షంగారు వేసిన పోరాట బీజం. గీత పనివారల సంఘం నిర్మాణం, అని ఆరు దశాబ్దాల సంఘ చరిత్ర రుజువు చేసింది. కుల చైతన్యంతో వచ్చే సాహిత్యమునకు సమాంతరంగా ధర్మ బిక్షం గారి వర్గ దృష్టితో ఈ సంఘం రాష్ట్రంలోనే మొదటగా 'వృత్తి' పునాదుల మీద గీత ఉద్యమ సాహిత్యాన్ని ట్యాపర్, కంజరనాదం కల్లు మండువ, గీత పనివారాల ఉద్యమ చరిత్ర, గీత వృత్తిని రక్షించుకుందాం, పుస్తకాల నెన్నింటినో వెలువరించి, వృత్తి సాహిత్యాన్ని అందించి, ఈ తరం మేధావులను, రచయితలను, కవులను, యువకులను ఆలోచింప చేయటంలో విజయం సాధించింది. గీత పనివారల సంఘం 68వ వార్షికోత్సవం జరుగుతున్న సందర్భంగా ధర్మ బిక్షంగారితో పాటు పోరాట దారిలో నడిచి అసువులు బాసిన వీరులకు జోహార్లు అర్పిద్దాం. త్యాగాలను గుర్తు చేసుకుందాం. గీత పనివారల సంఘంను నిర్మాణాత్మకంగా బలంగా విస్తరింప చేద్దాం.

*(గీత పని వారల సంఘం అక్టోబర్ 19,20 తేదీలలో 68వ వార్షికోత్సవాల సందర్భంగా)*

## రాజధాని సందడి

**– బొమ్మగాని కిరణ్‌కుమార్**

## బంద్ తరువాత ఏమిటి?

చాలాకాలం తరువాత తెలంగాణ సబ్బండ వర్గాలలో సంపూర్ణ ఏకాభిప్రాయ వ్యక్తీకరణ వ్యక్తమైంది. వెనుబడిన తరగతులకు రిజర్వేషన్‌లను 42 శాతానికి పెంచాలనే డిమాండ్‌పై 136 బిసి సంఘాలతో ఏర్పడిన బిసి జెఎసి పిలుపు మేరకు శనివారం రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌కు ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు ఇవ్వడం విశేషం. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల బంద్‌కు ముందే మద్దతు ప్రకటించాయి. దీంతో ముందుగానే బంద్ దిగ్విజయమవతుందనే వాతావరణం ఏర్పడింది. పాఠశాలలు ముందే సెలవు ప్రకటించడంతో పాటు, హోటళ్ళు, షాపులు, వ్యాపార, వాణిజ్య సంస్థలన్నీ ఎవరో వచ్చి చెప్పకముందే బంద్ పాటించాయి. ప్రతిపక్ష పార్టీలు అటుంచి అధికార పార్టీ కూడా బంద్‌లో చురుకుగా పాల్గొంది. వామపక్షాలు, బిజెపి, బిఆర్‌ఎస్, వేటికవే బంద్ లో పాల్గొనడం, ప్రదర్శనలు నిర్వహించడం, బిసి సంఘాలకు సంఘీభావంగా నిలవడం కనిపించింది. బిసి జెఎసి చైర్మన్ ఆర్.కృష్ణయ్య, వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ(ఎం), టిజెఎస్ రాష్ట్ర రథసారధులు మహేశ్ కుమార్‌గౌడ్, కూనంనేని సాంబశివరావు, జాన్ వెస్లీ కోదండరామ్ తదితరులు ప్రత్యక్షంగా బంద్ లో పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వంలో భాగంగా ఉన్న కేబినెట్ మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, కొండ సురేఖ, సీతక్కలు ప్రత్యక్షంగా బంద్ కార్యక్రమాలలో భాగస్వాములవడం ప్రత్యేకంగా నిలిచింది. అయితే, రాష్ట్రంలో ప్రతిపక్షంగా ఉన్న బిఆర్‌ఎస్ అగ్రనేతలు కె.టి.రామారావు, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు బంద్‌లో కనపడకపోవడంపై కొంత చర్చ జరిగింది. అన్ని పార్టీలకు చెందిన బిసియేతర నాయకులు, అలాగే ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కె.కవిత సైతం బంద్‌లో సంఘీభావంగా పాల్గొన్నారు. మొత్తంగా చూస్తే బంద్‌లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్‌కు కేవలం బిసి సంఘాలే కాకుండా తెలంగాణలోని అన్ని రాజకీయ పార్టీలు, బిసియేతర కులసంఘాల ఆమోద యోగ్యత దక్కింది. ఒక విధంగా గతంలో తెలంగాణ ఉద్యమం సందర్భంగా సకలజనుల సమ్మెను జ్ఞప్తికి తెచ్చిందీ బంద్. అసలు ఈ బంద్ జరగడానికి కారణం స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ జారీ చేసిన జిఒ 9పై హైకోర్టు స్టే విధించడం. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉండగా బిసిలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్‌లు పెంచుతామని వాగ్దానం చేసింది. అందుకు అనుగుణంగా చిక్కులు రాకుండా, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రాష్ట్ర ప్రభుత్వం కేవలం బిసిలే కాకుండా అన్ని కులాల లెక్కలు, సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ వివరాలపై (సీపెక్) సర్వే చేయించింది. ఆ వివరాలను శాసనసభలో ఉంచింది. డెడికేటెడ్ కమిషన్ శాస్త్రీయ నివేదిక ఆధారంగా బిసిల రిజర్వేషన్‌లను 42 శాతానికి పెంచుతూ రెండు బిల్లులను కూడా ఉభయ సభలు ఆమోదించాయి. ఈ బిల్లులను అధికార, ప్రతిపక్ష పార్టీలే కాకుండా, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సిలు సైతం మార్చిలో అసెంబ్లీలో ఏకగ్రీవ మద్దతు ప్రకటించారు. కానీ, ఆమోదిత బిల్లును చట్టబద్ధత కోసం గవర్నర్ దగ్గరకు పంపగా కేంద్రప్రభుత్వానికి పంపడంతో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో పడింది. స్థానిక సంస్థల ఎన్నికలు తరుముకొస్తుండడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్, చట్ట సవరణ చేసినా, అవి కూడా గవర్నర్ దగ్గరే పెండింగ్‌లో పడ్డాయి. తన వంతుగా చేయాల్సిందంతా చేసినప్పటికీ, రిజర్వేషన్‌లపై 50 శాతం పరిమితి ఉందన్న మిషతో (42 శాతం బిసి రిజర్వేషన్‌లు కలిపితే మొత్తం రిజర్వేషన్‌లు 67శాతానికి చేరుతాయి) ఏడు నెలలుగా దానిని కేంద్రం నాన్చుతోంది.

**పరిమితిని ఎందుకు దాటకూడదు?**

విషయం కోర్టుకెక్కడంతో హైకోర్టు, సుప్రీం కోర్టులో సైతం రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ బలమైన వాదనలే వినిపించారు. బిసిలకు రిజర్వేషన్‌లు పెంచినట్లయితే సుప్రీం కోర్టు, మహారాష్ట్ర హైకోర్టు తీర్పులో పేర్కొన్న 50 శాతం పరిమితిని దాటుతోందని పిటిషనర్‌ల న్యాయవాదులు అభ్యంతరం. అయితే, తాము 50 శాతం పరిమితి ఎందుకు దాటొద్దని ప్రశ్నిస్తున్నామని ప్రభుత్వం తరు పు న్యాయవాది సూటిగానే న్యాయస్థానాన్ని ప్రశ్నించారు. ప్రస్తుతానికైతే హైకోర్టులో కొనసాగుతున్న కేసు ను అక్కడే తేల్చుకోవాలని సుప్రీం కోర్టు సూచించింది. హైకోర్టు జిఒ 9పై కేవలం మధ్యంతర స్టేను మాత్రమే విధించింది. కేసు ఇంకా ముగియలేదు. ఉభయ పక్షాల అఫిడవిట్‌లు, వాటిపై పరస్పర సమాధానాలు, వాదనలు, ఆ తరువాతే హైకోర్టు తీర్పు. ఇందుకు చాలా సమయం కావాలి. ఆ తరువాత దానిపై సమీక్ష దరఖాస్తు, సుప్రీం కోర్టులో అప్పీలు వంటి న్యాయపరమైన అవకాశాలు ఉంటాయి. ఇదంతా జరిగేందుకు ఏళ్ళు పడుతుంది.

ఇప్పటికే దగ్గరకు వచ్చిన అవకాశం కోల్పోయామనే ఆవేదనాక్రందనలో బిసిలు, సంఘాలు అత్యంత సంయమనం పాటించాయి. మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్ తదితర రాష్ట్రాలలో జరిగిన రిజర్వేషన్‌ల ఉద్యమాల తరహాలో హింసాత్మకంగా మారలేదు. హైకోర్టు మధ్యంతర స్టేతో తమకు దక్కాల్సిన అవకాశం ఆగిపోయిందనే ఆవేదనను శాంతియుత పద్ధతిలోనే బంద్ రూపంలో బిసిలు వ్యక్తం చేశారు. ఇప్పటికే అన్ని వేదికలతో పాటు, ప్రజాస్వామ్యంలో అత్యున్నత రాష్ట్ర వేదికకైన శాసనసభలో ప్రాతినిధ్యం కలిగిన రాజకీయ పక్షాలన్నీ ముక్తకంఠంతో 42 శాతం రిజర్వేషన్‌లకు మద్దతుగా నిలిచాయి. బంద్‌కూ సహకరించడంతో దిగ్విజయమైంది.

**ముందడుగు ఎలా?**

బంద్ తరువాత ఏమిటనేది అసలు ప్రశ్న. దీనికి సమాధానం కేంద్రం చేతిలోనే ఉంది. ఇప్పటికే బిసిలకే ముఖ్యమంత్రి పదవి అని శాసనసభ ఎన్నికల్లో ప్రకటించిన బిజెపి, కనీసం శాసనసభా పక్ష నాయకత్వాన్ని ఆ వర్గానికి అప్పగించలేదు. గతంలో బిసి రాష్ట్ర అధ్యక్షుడిని అర్థాంతరంగా మార్చిందనే అపఖ్యాతిని మూటగట్టుకుంది. ఇటీవల చివరి వరకు బిసికే రాష్ట్ర అధ్యక్ష పదవి దక్కుతుందనే ప్రచారం జరిగినా, ఆ పార్టీలోని బిసి నేతలకు భంగపాటు తప్పలేదు. ఇప్పుడు 42 శాతం రిజర్వేషన్‌ల అంశం ఆ పార్టీకి ఒక పరీక్ష పెట్టింది. న్యాయస్థానం తీర్పు పేరుతో శాసనసభ రెండు సార్లు ఆమోదించిన వేర్వేరు బిల్లులు ఏడు నెలలుగా కేంద్ర ప్రభుత్వం తన వద్దనే పెండింగ్‌లో పెట్టుకుంది. ఈ బిల్లులకు తమిళనాడు తరహాలో తొమ్మిదవ షెడ్యూలులో కవచం కల్పించేందుకు పార్లమెంటులో రాజ్యాంగసవరణ బిల్లులు పెట్టడమే పరిష్కారం. అలా చేస్తే న్యాయస్థానాల నుంచి ఎదురయ్యే సమస్య కూడా అధిగమించవచ్చు. ఇదే బిజెపి ప్రభుత్వం 2019లో పది హేను రోజుల వ్యవధిలో ఆర్థికంగా వెనుబడిన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించిన బిల్లును పార్లమెంటులో ఆమోదింపచేసి, చట్టంగా మార్చి అమలు పరిచింది. ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్‌లు కల్పించడంతో రిజర్వేషన్‌లపై 50 శాతం పరిమితి కూడా దాటిపోయింది. ఈ బిల్లును ఆర్‌జెడి,ఎఐడిఎంకె తదితర పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించినా, మరొకొన్ని పార్టీలు సెలెక్ట్ కమిటీకి పంపాలని కోరినప్పటికీ బిల్లు ఆమోదం పొందింది. అన్ని పార్టీలు ఏకగ్రీవంగా శాసనసభలో ఆమోదించిన బిల్లుకు రాజ్యాంగ రక్షణ కల్పించడం సమంజసం. పైగా, ఏ రాష్ట్రంలో లేని విధంగా బిసిల విషయంలో తెలంగాణ రాష్ట్రం శాస్త్రీయంగా లెక్కలు సేకరించడం పనిని సులువు చేస్తుందనడంలో సందేహం లేదు. కాబట్టి, తదుపరి అడుగు వేయాల్సింది బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వమే.

ప్రజాపక్షం
7th ANNIVERSARY
22nd October, 2025

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

లేహ్‌లో శాంతియుత ర్యాలీ భగ్నం

పాకిస్థాన్ భూభాగంలోని ప్రతీ అంగుళం 'బ్రహ్మోస్' పరిధిలోనే' ఉంది

'మౌని బాబా'లా మోదీ ప్రధానిపై కాంగ్రెస్ తీవ్ర మండిపాటు

7లో

సంపుటి 08, సంచిక: 318 | ఆదివారం | 19-10-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# స్తంభించిన తెలంగాణ



## 42 శాతం రిజర్వేషన్ల కోసం బిసి జెఎసి బంద్ సంపూర్ణం

### రోడ్డెక్కని బస్సులు : తెరుచుకోని దుకాణాలు

### సినిమా హాళ్లు, విద్యాసంస్థలు, మాల్స్, రెస్టారెంట్లు

### వాణిజ్య సముదాయాలు స్వచ్ఛందంగా మూసివేత

- బిసి సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నేతల భారీ ర్యాలీ
- ఆబిడ్స్‌లో వామపక్షాలు నిర్వహించిన ర్యాలీలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని, డాక్టర్ కె.నారాయణ, ఇటి నర్సింహ్మ, పశ్య పద్మ, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, టిజెఎస్ అధ్యక్షుడు కోదండరామ్
- ట్యాంక్‌బండ్‌పై మంత్రులు, ఎంజిబిఎస్‌లో టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి, బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ జాజుల, ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ బైఠాయింపు
- బర్కత్‌పురా బస్‌డిపో వద్ద జెఎసి చైర్మన్ ఆర్.కృష్ణయ్య, ఆర్‌టిసి క్రాస్‌రోడ్‌లో బిఆర్‌ఎస్ మాజీ మంత్రులు, దోమలగూడలో టిడిపి నేతలు, జూబ్లీ బస్టాండ్ వద్ద బిజెపి ఎంపి ఈటల రాజేందర్ ఆందోళన
- దిల్‌సుక్‌నగర్‌లో ఉద్రిక్తత : అంబర్‌పేట ర్యాలీలో కిందపడిపోయిన విహెచ్



ప్రజాపక్షం/హైదరాబాద్

'బంద్ ఫర్ జస్టిస్' పేరుతో బిసి జెఎసి పిలుపునిచ్చిన బంద్‌తో యావత్ తెలంగాణ స్తంభించింది. బస్సులు రోడ్డెక్కలేదు. షాపులు తెరుచుకోలేదు. అన్ని రాజకీయ పార్టీలు మద్దతుగా ప్రదర్శనలు నిర్వహించాయి. జనజీ వనం స్తంభించింది. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం 'బంద్ ఫర్ జస్టిస్' పేరుతో బిసి జెఎసి తెలంగాణ రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చిన విషయం తెల్సిందే. మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రత్యక్షంగా ఆందోళనల్లో పాల్గొన్నారు. అన్ని రాజకీయ పక్షాలు రోడ్లపైకి రావడంలో పోటీ పడ్డాయి. హైదరాబాద్‌లో సినిమా థియేటర్లు, మాల్స్,

తరువాయి 6లో









# బిసి ద్రోహి బిజెపి

- ఢిల్లీలో బిసి ఉద్యమ గొంతు వినిపించాలి
- సిఎం చొరవ తీసుకుని అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలి వామపక్షాల డిమాండ్
- నారాయణగూడ కూడలి నుంచి ఆబిడ్స్ చౌరస్తా వరకు వందలాది మందితో భారీ ర్యాలీ

ప్రజాపక్షం/హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు బిసి సంఘాల ఐక్య కార్యాచరణ సమితి (జెఎసి) ఇచ్చిన రాష్ట్ర బంద్‌లో వామపక్షపార్టీలు, ప్రజా సంఘాలు, టిజెఎస్‌లు పాల్గొని విజయవంతం చేశాయి. శనివారం ఉదయం హైదరాబాద్ నారాయణగూడ కూడలి నుంచి ఆబిడ్స్ చౌరస్తా వరకు వామపక్షాలకు చెందిన వందలాది మంది నేతలు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. బిసి రిజర్వేషన్లను అడ్డుకుంటున్న కేంద్ర ప్రభుత్వం, బిజెపికి వ్యతిరేకంగా చేసిన నినాదాలు పెద్దఎత్తున మార్మోగాయి. అనంతరం ఆబిడ్స్ చౌరస్తాలో జరిగిన సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ బిసి, ఎస్‌సి, పేదలకు బిజెపి వ్యతిరేకమని, బిసి బంద్‌కు బిజెపి కూడా మద్దతు పలకడం కపటనాటకమన్నారు. బిజెపి ద్వంద్వ విధానాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. బిసి రిజర్వేషన్లను అడ్డుకుంటున్న కేంద్ర ప్రభుత్వం, బిజెపిపై ఆయన విరుచుకుపడ్డారు. గతంలో ప్రధాని విపి సింగ్ బిసిలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లు తీసువస్తే అద్వానీ దానిని అడ్డుకునేందుకు దేశ వ్యాప్తంగా 'మండల్ కమండల్' నినాదంతో ఉద్యమం చేశారని గుర్తు చేశారు. ఇదే బిజెపి ప్రభుత్వం ఇడబ్ల్యుస్ తరగతులకు 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లు పాస్ చేసిందని, ఇప్పుడు బిసిలకు స్థానిక సంస్థల్లో 42 శాతం కల్పించడాన్ని అడ్డుకోవడం వింతగా ఉందన్నారు. బిజెపి ధ్వంద్వ విధానాలతో బిసి ఉద్యమాన్ని తప్పుదారి

తరువాయి 6లో



విద్యార్థి, నిరుద్యోగ యువత ఆత్మబలిదానాలతో

# తెలంగాణ రాష్ట్రం సాకారం


ప్రజాపక్షం/ హైదరాబాద్

విద్యార్థి, నిరుద్యోగ యువత ఆత్మబలిదానాలతో తెలంగాణ రాష్ట్రం సాకారమైందని, అమరుల త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణలో పదేళ్లు అధికారం చెలాయించిన వారు ఒక్క క్షణం కూడా నిరుద్యోగుల గురించి ఆలోచన చేయలేదని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విమర్శించారు. అమరుల ఆశయ సాధనపై గత పాలకులు ఆలోచన చేసి ఉంటే నిరుద్యోగులకు ఎనిమిదేళ్ల కిందనే ఉద్యోగాలు వచ్చేవన్నారు. గత పాలకుల కుటుంబంలో పదవులు భర్తీ చేసుకున్నారు తప్ప గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ మాత్రం ఇవ్వలేదన్నారు. పదిహేనేళ్లుగా గ్రూప్–1 ఉద్యోగాల భర్తీ జరగలేదంటే అంతకంటే దౌర్భాగ్యం మరొకటి ఉంటుందా అన్నారు. మదాపూర్ శిల్పకలా వేదికలో శనివారం సాయంత్రం జరిగిన గ్రూప్–2 ఉద్యోగ నియామక పత్రాల అందజేత కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి

తరువాయి 6లో

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

783 మందికి గ్రూప్ – 2 నియామక పత్రాల అందజేత



# ఒప్పందం ఉల్లంఘన

## ఇజ్రాయెల్ దాడిలో 11మంది మృతి



**గాజా :** గాజాలో శాంతి ఒప్పందాన్ని ఇజ్రాయెల్ మరోసారి ఉల్లంఘించింది. ఈనెల 11న గాజాలో శాంతి ఒప్పందం అమలులోకి రాగా మరునాడే మొదటిసారి ఉల్లంఘనకు పాల్పడింది. ఎనిమిది రోజుల తర్వాత శనివారం మరోసారి ఇజ్రాయెల్ ఒప్పందాన్ని ఉల్లంఘించి దారుణ రక్తపాతానికి ఒడిగట్టింది. ఒకే కుటుంబానికి చెందిన 11 మందిని హతమార్చింది. మృతుల్లో ఏడుగురు పిల్లలు కాగా, మరో ముగ్గురు మహిళలు ఉన్నారు. శుక్రవారం పొద్దుపోయాక ఇజ్రాయెల్ ట్యాంక్ నుండి వచ్చిన షెల్ పౌర వాహనాన్ని ధ్వంసం చేసింది. ఈ వాహనంలో ఒకే కుటుంబానికి చెందిన సభ్యులు ప్రయాణం చేస్తున్నారు. ఈ కుటుంబీకులంతా గాజాసిటీ పొరుగున జియోటౌన్‌కు చెందినవారని పౌర రక్షణ దళ అధికార ప్రతినిధి మహ్మద్ బాసెల్ చెప్పారు. ఇజ్రాయెల్ రక్తదాహం తీరలేదని, వారు ఇంకా హత్యలకు, ఊచకోతలకు పాల్పడుతూనే ఉన్నారని, వారికి మరో పద్ధతిలో గుణపాఠం నేర్పుతామని ఆయన అన్నారు. ఈ దాడిని హమాస్ సంస్థ తీవ్రంగా ఖండించింది. గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం సక్రమగా అమలుజరిగేలా ట్రంప్‌తో పాటు మధ్యవర్తి దేశాలు ఒత్తిడి చేయాలని హమాస్ కోరింది. ఒప్పందం కుదిరిన తర్వాత గతవారం సుజయె

తరువాయి 6లో

'దండుపాళ్యం' పాలన ఎవరిదో అందరికీ తెలుసు : శ్రీధర్‌బాబు

తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పేరు మార్పు

నిందితుడి దాడిలో కానిస్టేబుల్ మృతి

విఆర్‌ఎస్ తీసుకున్న ఐపిఎస్ రవిగుప్తా

05


ఖమ్మంలో....


ఖమ్మంలో....


వరంగల్‌లో....


నర్సంపేటలో....


హనుమకొండలో....


భద్రాద్రి కొత్తగూడెంలో...

# బిసి బంద్ సంపూర్ణం, ప్రశాంతం

**ప్రజాపక్షం/ఖమ్మం :** బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ బిసి సంఘాల ఐక్యవేదిక ఇచ్చిన తెలంగాణ బంద్ శనివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంపూర్ణంగా, ప్రశాంతంగా జరిగింది. బంద్‌కు రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు, కుల సంఘాలు మద్దతు ప్రకటించగా అన్ని వర్గాల ప్రజలు బంద్‌కు సహకరించడంతో బంద్ సంపూర్ణంగా జరిగింది. ఆర్‌టిసి బస్సులు రోడ్లపైకి రాలేదు. తెల్లవారుజామునే బిసి సంఘాల నాయకులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు బస్‌డిపోల వద్దకు చేరుకుని బస్సులను బయటకు రానివ్వలేదు. ఖమ్మం నగరంలో పెద్ద సంఖ్యలో ఆందోళనకారులు అన్ని ప్రాంతాలలో పర్యటిస్తూ దుకాణాలను మూయించారు. ప్రభుత్వ కార్యాలయాల వద్దకు వెళ్లి గేట్లు వేసి కార్యాలయాలను మూయించారు. బంద్‌తో నగరంలోని ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. ఆటో కార్మిక సంఘాలు కూడా మద్దతు ప్రకటించడంతో ఆటోలు తిరగలేదు. పాత బస్టాండ్ వద్ద జరిగిన సభలో వివిధ రాజకీయ పక్షాలు, బిసి సంఘాల నేతలు మాట్లాడుతూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాల్సిందేనని ఈ విషయంలో రాజీ లేదన్నారు. బిసి రిజర్వేషన్ల విషయాన్ని తొమ్మిదవ షెడ్యూల్ చేర్చి రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు. బిసి రిజర్వేషన్ అమలయ్యేంత వరకు ఆందోళన కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ సమితి సభ్యు లు బాగం హేమంత రావు మాట్లాడుతూ బిజెపి రిజర్వేషన్ల విషయం లో దొంగాట ఆడుతుందన్నారు. రాష్ట్రంలో బిసి సంఘాలు రిజర్వేషన్ గురించి పోరాడుతుంటే బిజెపి ఆ సమస్యను పరిష్కరించకుండా ద్వంద వైఖరిని అవలంభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఎస్‌కె జానిమియా, మహ్మద్ సలాం, కాంగ్రెస్ నాయకులు, గిడ్డంగుల సంస్థ కార్పోరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, బాలసాని లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఎంతకైనా తెగించి పోరాడుదాం : తాటిపాముల

**వరంగల్ :** బిసి రిజర్వేషన్ల సాధనకై ఎంతకైనా తెగించి పోరాడి సాధిద్దామని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. బిసి బంద్ సందర్భంగా వరంగల్ శివనగర్ తమ్మెర భవన్ నుండి సిపిఐ , బిసి హక్కుల సాధన సమితి కార్యకర్తలు ప్రదర్శనగా బయలుదేరి అండర్ బ్రిడ్జ్ రోడ్, స్టేషన్ రోడ్, పోస్టాఫీస్ సెంటర్, వరంగల్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి బంద్‌ను పర్యవేక్షించారు. బంద్ కార్యక్రమంలో సిపిఐ , బిసి హక్కుల సాధన సమితి నాయకులు మేకల రవి, పనాస ప్రసాద్, దండు లక్ష్మ ణ్, గన్నారపు రమేష్, గుండె బద్రి, తోట చంద్రకళ, సంఘీ ఎలేందర్, వలభోజు వెంకన్న, రవి, జాన్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

**నర్సంపేటలో ....**

బిసి 42శాతం రిజర్వేషన్లు తక్షణమే అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్ డిమాండ్ చేశారు. బిసి బంద్‌లో భాగంగా నర్సంపేట పట్టణంలోని సిపిఐ,సిపిఎం ఆధ్వర్యంలో బంద్‌ను విజయవంతం చేశారు. అనంతరం పట్టణంలో ద్విచక్రవాహనాలతో ర్యాలీ నిర్వహించి షాపులను బంద్ చేయించారు. ఈకార్యక్రమంలో సిపిఐ నాయకులు అక్కపెల్లి రమేష్, గుంపెల్లి మునీశ్వర్, సిపిఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**నల్లబెల్లిలో ....**

విద్య, ఉద్యోగాలలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం చేసిన చట్టాన్ని కేంద్రం ఆమోదించకపోవడానికి నిరసనగా బిసి జెఎసి ఇచ్చిన రాష్ట్ర బంద్‌లో భాగంగా నల్లబెల్లి మండల కేంద్రంలో బిసి హక్కుల సాధన సమితి, కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొని బంద్‌ను విజయవంతం చేశారు. ఈకార్యక్రమంలో బిసి హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా ప్రధానకార్యదర్శి,సిపిఐ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు చింతకింది కుమారస్వామి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిట్యాల తిరుపతి రెడి తదితరులు పాల్గొన్నారు.

## హనుమకొండ టౌన్‌లో..

సమాజంలో ఆర్థికంగా, సాంఘికంగా, సా మాజికంగా వెనుకబడిన తరగతులకు 42 శాతం రిజర్వేషన్లు, వి ద్యా ఉద్యోగ స్థానిక సంస్థలలో కల్పించాలని బిసి సంఘాలు ఇచ్చిన రాష్ట్ర బంద్‌లో భాగంగా శనివారం హనుమకొండ వెయ్యి స్తంబా ల గుడి కాజీపేట రైల్వే స్టేషన్ వరకు బంద్ విజయవంతం కోరు తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, సిపిఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి హంసారెడ్డి, కర్ర రాజిరెడ్డి, ఆర్ఎస్పీ జిల్లా కార్యదర్శి కే శివాజీ, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి, జిల్లా కార్యవర్గ సభ్యులు యేష బోయిన శ్రీనివాస్, మునిగాల బిక్షపతి, అశోక స్టాలిన్, వేల్పుల సారంగపాణి, జిల్లా సమితి సభ్యులు పాల్గొన్నారు

## భద్రాద్రి కొత్తగూడెంలో

42 శాతం రిజర్వేషన్లు అమలుతోనే బిసి వర్గాలకు సామాజిక రాజకీయ రంగంలో న్యాయం జరుగుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. రాష్ట్ర బిసి సంఘాల పిలుపులో భాగంగా శనివారం నిర్వహించిన బంద్ విజయవంతమైంది. సిపిఐతో పాటు ఇతర రాజకీయ పక్షాలు, బిసి, సామాజిక, ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘాల విజ్ఞప్తి మేరకు వాణిజ్య, వ్యాపార రంగాలు, విద్యా సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు మూతపడ్డాయి. పార్టీ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్ నుండి ప్రధాన సెంటర్ల మీదుగా పోస్టాఫీస్, అంబేద్కర్ సెంటర్ వరకు మోటార్ సైకిల్ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వాసిరెడ్డి మురళీ, జిల్లా సమితి సభ్యులు వంగా వెంకట్, గెద్దాడు నగేష్, భూక్య శ్రీనివాస్, మునిగడప వెంకటేశ్వర్లు, కె రత్నకుమారి, ధన లక్ష్మి , నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. భద్రాచలం డివిజన్ వ్యాప్తంగా బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు రావులపల్లి రవికుమార్ మాట్లాడుతూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్ సమంజసమే అన్నారు. ఈ బంద్‌లో సిపిఐ నాయకులు మారెడ్డి శివాజీ, ఏపూరి వెంకటేశ్వరరావు, ఎస్‌వి ఎస్ నాయుడు, మీసాల భాస్కర్ రావు, కంభంమెట్టు శ్రీనివాస్, శోభన్, కుమారి, సిపిఎం నాయకులు ఏజే రమేష్, మాస్‌లైన్ నాయకులు కెచ్చల రంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు తమ్మళ్ల వెంకటేశ్వ రావు, బిఆర్ఎస్ నాయకులు ఆకోజ్ సునీల్ కుమార్ మాట్లాడారు. తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ సిటీలో....

బిసి రిజర్వేషన్లపై రాష్ట్రవ్యాప్తంగా బిసి సంఘాల జెఎసి ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ సందర్భంగా కరీంనగర్‌లో సిపిఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించడం జరిగిందని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, కసిరెడ్డి మణికంఠరెడ్డి, నగర కార్యదర్శి కసిరెడడి సురేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, బామండ్లపల్లి యుగేందర్, బీర్ల పద్మ, మచ్చ రమేష్, రామారపు వెంకటేష్ తదితరులున్నారు.

## కరీంనగర్ జిల్లాలో కేంద్రంలో

బిసి సంఘాల జెఎసి ఇచ్చిన బంద్‌లో కాంగ్రెస్, బిఆర్ఎస్, సిపిఐ, సిపిఎం, పార్వర్డ్ బ్లాక్ పార్టీతో పాటు బిసి సంఘాల జెఎసి, తెలంగాణ జాగృతి, కోదండరాం పార్టీ నాయకులు బంద్‌లో పాల్గొన్నారు. బస్టాండ్ ఎదుట వామపక్ష పార్టీల నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్,సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి వాసుదేవారెడ్డి, కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జీ వెలిచాల రాజేందర్ రావు,కాంగ్రెస్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఉట్కూర్ (ఆల్ఫోర్స్) నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జనగామలో

జనగామ జిల్లాలో బిసి బంద్ విజయవంతమైంది. సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్, బిఆర్ఎస్, బిసి జాక్ ఆధ్వర్యంలో వేరువేరుగా ర్యాలీలు నిర్వయించారు. ఆర్‌టిసి చౌరస్తాలో రాస్తారోకో నిర్వయించి నిరసన తెలిపారు.

**సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో ర్యాలీలు :** బిసి రిజర్వేషన్లకు మద్దతుగా చేపట్టిన బిసి బంద్‌లో సిపిఐ, సిపిఎం పార్టీలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, సిపిఐ పట్టణ కార్యదర్శి చొప్పరి సోమయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్వి ఆకుల శ్రీనివాస్, మోటే శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ ఆధ్వర్యంలో** కాంగ్రెస్ ఆధ్వర్యంలోనూ ర్యాలీ జరిగింది. కాంగ్రెస్ నాయకులు, మార్కెట్ కమిటి చైర్మన్ శివరాజ్ యాదవ్, చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, లొక్కుంట ప్రవీణ్, డాక్టర్ సిహెచ్ రాజమౌళి, నాగపురి కిరన్‌కుమార్, కంచె రాములు, మేడ శ్రీనివాస్ తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు. నెహ్రూ పార్కు నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వయించారు. బిఆర్ఎస్ ఆధ్వర్యంలోనూ ర్యాలీ జరిగింది.

## మానుకోటలో....

మానుకోటలో శనివారం జరిగిన బంద్ విజయవంతమైంది, ఉదయం నుంచే పార్టీ కార్యకర్తలు ద్విచక్రవాహనాలపై తిరుగుతూ బంద్‌కు మద్దతు ఇచ్చాయి. డిసిసి అధ్యక్షులు జెన్నారెడ్డ భరత్‌చందర్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు స్థానిక ఎంఎల్‌ఏ క్యాంప్ కార్యాలయం నుంచి 200 వాహనాలతో, వామపక్ష పార్టీలు ర్యాలీగా బిసి రిజర్వేషన్లు అమలు చేయాలని కేంద్రంపై దుమ్మెత్తి పోస్తూ నినాదాలతో ప్రదర్శన చేశారు. వామపక్ష పార్టీల నేతలు బి.విజయసారథి, సాదుల శ్రీనివాస్, అజయ్‌సారథిరెడ్డి, గునిగంటి రాజన్న, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్ గుజ్జుదేవేందర్ తదితరులు ఎర్రజండాలతో బైక్‌ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఎడ్ల రమేష్, బెల్లంకొండ శ్రీనివాస్, పోతురాజు, దేవుడు ప్రభాకర్, అజ్మీర సురేష్, గాడిపెల్లి చరణ్, పింద్రాల రాందాస్, రంజిత్, అల్లిదుర్గేష తేజావత్ శంకర్‌నాయక్, చెన్నూరి విజయ లక్ష్మి , మహిళా నాయకుల స్వర్ణ, మాజీ కౌన్సిలర్ లక్ష్మి , దేవి ,యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

## మహబూబ్ నగర్‌లో....

బిసిలకు జరుగుతున్న అన్యాయానికి బిజెపి పార్టీ నైతిక బాధ్యత వహించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా నిర్మాణ బాధ్యులు కొండపల్లి రాము, (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. నేడు రాష్ట్ర వ్యాప్తంగా బిసి సంఘాలు తలపెట్టిన బంద్‌ను ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తా నుండి బాయ్స్ జూనియర్ ప్రభుత్వ కళాశాల, ప్రైవేట్ కళాశాల, న్యూటన్, కొత్త బస్టాండ్ ప్రాంతాల్లో జెండాలు చేతబూని, వ్యాపారసముదాయాలను కళాశాలలను బంద్ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ బాధ్యులు కొండపల్లి రాము, రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మ ణ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, ఏఐవైఎఫ్ కోకన్వీనర్ మెట్టు మహేష్, విద్యార్థుల,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో

నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో రాష్ట్రబంద్‌కు సిపిఐ జిల్లావ్యాప్తంగా సంపూర్ణమద్దతు పలికిందని సిపిఐ శ్రేణులు జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున బందులో పాల్గొన్నాయని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ తెలిపారు. అంతకుముందు సిపిఐ నేతలు జేఏసి నాయకులతో కలిసి గ్రామంలో బంద్ నిర్వహిచి. మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బిసిహక్కులసాధన సమితిజిల్లా అధ్యక్షులు కపిలవాయిగోపిచారి,సిపిఐ జిల్లా సమితిసభ్యులు శివశంకర్, సూర్యప్రకాష్‌గౌడ్, రవీందర్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయు లు, ఎఐటియూసి భవననిర్మాణ కార్మికసంఘం జిల్లా అధ్యక్షులు చిన్నపాగ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## నారాయణపేటలో...

మద్దూర్ మండల కేంద్రంలో సిపిఐ పార్టీ నాయకులు స్వచ్ఛందంగా సెంటర్లో తిరుగుతూ బంద్ నిర్వహించారని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.సంతోష్ అన్నారు. అనంతరం బైక్‌పై ర్యాలీ నిర్వహిస్తూ బిసి బంద్ జయప్రదం చేయాలని వారు నినాదాలు చేశారు. అనంతరం బిసి సంఘాలతో వివిధ రాజకీయ పార్టీలతో కలిసి సురక్ష బస్టాండు నుండి అంబేద్కర్ సెంటర్‌లో నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు డి.చెన్నయ్య, సిపిఐ మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్, సిపిఐ మండ ల సహాయ కార్యదర్శి వెంకటయ్య, మండల నాయకులు అంజిలప్ప, ఎఐటియుసి మండల అధ్యక్షులు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేట జిల్లాలో

సిద్దిపేటలో బిసి జెఎసి ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ విజయవంతమైంది. శనివారం జెఎసి ఇచ్చిన పిలుపు మేరకు వివిధపార్టీలకు చెందిన జెఎసి నేతలు పట్టణంలో వ్యాపార అన్ని వర్గాలను, వివిధ పార్టీల నేతలను కలసి బంద్ విజయవంతానకి మద్దతుప్రకటించాలని కోరారు. దీంతో శనివారం తెల్లవారు జామున సిద్దిపేట బస్ డిపో బైఠాయించి బస్సులను బయటకు రాకుండ ప్రధాన ద్వారం ముందు బైఠాయించారు. అలాగే బిఆర్ఎస్ నేతలు ర్యాలీగా తరలివచ్చి పాత బస్టాండ్, అంబేద్కర్ వద్ద చౌరస్తాలో బైఠాయించి ఆందోళన కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. అనంతరం సిద్దిపేట నియోజక వర్గం కాంగ్రెస్ ఇంచార్జి పూజల హరికృష్ణ. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తు ఇమామ్, మహేందర్‌లు తదితరులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి మద్దతు ప్రకటించారు.అలాగే జెఎసి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, పట్టణ అధ్యక్షుడు బాసంగారి వెంకట్, వేణుగోపాల్ తదితరులు ఆందోళన కార్యక్రమాలకు మద్దతు ప్రకటించారు. సిద్దిపేట సిపి విజయ్ కుమార్ నేతృత్వంలో పట్టంణంలో ప్రధాన కూడలి ప్రాంతాల్లో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఏసిపి రవీందర్‌రెడ్డి, సిఐ వాసుదేవరావు, ఉపేందర్. విద్యాసాగర్‌లు పరిస్థితులు సమీక్షించారు.

## నల్లగొండ జిల్లాలో

రాష్ట్ర వ్యాప్త బంద్ నల్లగొండ జిల్లాలో వంద శాతం సంపూర్ణగా జరిగింది. పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. బంద్‌లో కాంగ్రెస్, సిపిఐ, బిఆర్ఎస్, సిపిఎం, బిజెపి, టిజెస్‌తోపాటు బిసి సంఘం జెఎసి, ప్రజాసంఘాలు, సంపూర్ణ మద్దతు తెలిపి బంద్‌లో పాల్గొన్నారు. నల్లగొండ పట్టణంలో చర్లపల్లి వద్ద ఉన్న పవన్ మోటార్ షోరూమ్ బంద్ చేయకపోవడంతో ఆందోళన కారులు షోరూమ్ పై రాలు రూవడంతో అద్దాలు పగిలిపోయవి. నల్లగొండ, దేవరకొండ, మిర్యాలగూడ, మునుగోడు, నాగార్జున సాగర్,నకేరేకల్ నియోజకవర్గం లోని అన్ని మండలలు, గ్రామాలలో సైతం స్వచ్ఛందంగా బంద్ పాటించారు.

## నల్లగొండ బంద్‌లో పాల్గొన్న సిపిఐ నాయకులు

నల్లగొండలో జరిగిన బంద్‌లో సిపిఐ శ్రేణులు పెద్ద ఎత్తున ఆందోళన, ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసన బంద్ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడింగి శ్రవణ్ కుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి,గురజా రామచంద్రం,జిల్లా సమితిసభ్యులు సురిగి చలపతి, బొడిగె సైదులు, సిపిఐ పట్టణ కార్యదర్శి కె ఎస్ రెడ్డి, వి.లెనిన్, దోటి పండరి, తదితరులు పాల్గొన్నారు. కాగా బంద్‌కు మద్దతుగా శనివారం నల్లగొండలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన భారీ బైక్ ర్యాలీ ఎమ్మెల్సీ శంకర్ నాయక్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పున్న కైలాస నేత, మాజీ కౌన్సిలర్లు జూలకంటి శ్రీనివాస్, గడిగ శ్రీనివాస్, బొజ్జ శంకర్, దుబ్బ అశోక్ సుందర్,నాయకులు కత్తుల కోటి, అల్లి సుభాష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

## సూర్యాపేట టౌన్‌లో

బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో బిజెపి ప్రభుత్వం ద్వంద్వ వైఖరిని విడనాడాలని అఖిలపక్ష పార్టీల నాయకులు, బిసి సంఘాల, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం బిసిలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బిసి జెఏసి పిలుపులో భాగంగా బంద్ విజయవంతమైంది. అఖిలపక్ష పార్టీ నాయకులు ఉదయం 4 గంటలకే కొత్తబస్టాండ్‌లోని ఆర్‌టిసి బస్ డిపో వద్దకు చేరుకొని బస్సులు బయటికి రాకుండా గేట్ ముందు నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో మోటార్ సైకిల్‌తో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల, బిసి, ప్రజా సంఘాల నాయకులు, సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, మల్లు నాగార్జున్ రెడ్డి, మందారి డేవిడ్ కుమార్, కుంట్ల ధర్మార్జున్, కొత్తపల్లి శివకుమార్, వై వెంకటేశ్వర్లు, ఊర రాంమ్మూర్తి యాదవ్, పెద్దిరెడ్డి రాజా, యాతాకుల రాజయ్య, చింతలపాటి చిన్నశ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## సదాశిపేట పట్టణంలో

సదాశిపేట పట్టణంలో తెలంగాణ బంద్ పర్ బిసి జస్టీస్ కార్యక్రమం సదాశివపేట పురవీథుల్లో ర్యాలీ నిర్వహించి విజయవంతం చేసారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.ఏ రెహమాన్, బిసి సంఘం నాయకులు, జావిద్, అనంతయ్య, రాములు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఆసిఫాబాద్ బస్టాండ్ సెంటర్‌లో

బిసి రిజర్వేషన్ల సాధన కోసం వివిధ బిసి సంఘాలు ఏర్పాటు చేసిన ఐక్య కార్యచరణ కమిటీ బంద్ ఫర్ జస్టిస్‌లో భాగంగా శనివారం సిపిఐ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బద్రి సాయికుమార్ ఆసిఫాబాద్ బస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ధర్నా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి, ఎఐటియుసి అధ్యక్షుడు టి. దివాకర్ తదితరులు పాల్గొన్నారు.


భద్రాచలం డివిజన్ వ్యాప్తంగా....


కరీంనగర్ సిటీలో ...



జనగామలో ...


జనగామలో ...


మానుకోటలో....


మహబూబ్ నగర్‌లో....


నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో....


నారాయణపేటలో....


సిద్దిపేటలో....


నల్లగొండలో సిపిఐ నాయకులు....


నల్లగొండలో కాంగ్రెస్ నాయకులు....


సూర్యాపేటలో....


ఆసిఫాబాద్‌లో....


సదాశివపేటలో....



# జనరల్
STATE & REGIONAL NEWS

## మద్యం షాపులకు దరఖాస్తుల వెల్లువ

**2620 దుకాణాలకోసం 90 వేల దరఖాస్తులు..?**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో మద్యం షాపులకు దరఖాస్తుల వెల్లువెత్తాయి. శనివారం చివరి రోజు కావడంతో రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తు దారులు క్యూ కట్టారు. శనివారం చివరి రోజు కావడంతో సాయంత్రం నుంచి గంట గంటకు దరఖాస్తులు పెరుగుతూ వస్తున్నాయి. శుక్రవారం నాటికి 2620 మద్యం షాపులకు 50 వేల దరఖాస్తులు వచ్చాయి. చివరి రోజు దరఖాస్తులు 30 వేల నుంచి 40 వేల వరకు పెరిగే అవకాశం ఉన్నట్లు ఎక్సైజ్ శాఖ భావిస్తుంది. ఈ రకంగా చూసుకుంటూ రాత్రి గడువు ముగిసే వరకు 90 వేల దరఖాస్తు రావచ్చని అంచనా. గత సంవత్సరంతో పోలిస్తే దరఖాస్తులు తగ్గిన ఆదాయం మాత్రం పెరిగే అవకాశం ఉన్నట్లు ఎక్సైజ్ శాఖ అంచనాలు వేసుకుంటున్నారు. గత 27 నుంచి మొదలైనా దరఖాస్తుల స్వీకరణ తొలుత మందకొడిగా కొనసాగింది. అయితే చివరి మూడు రోజులుగా ముందస్తుగా అనుకున్న రీతిలో దరఖాస్తులు రోజు రోజుకు పెరుగుతూ వచ్చాయి. శనివారం రాత్రి వరకు 80 వేల నుంచి 90 వేలకు పెరిగే అవకాశాలు ఉన్నట్లు అధికారులు అంచనాలు వేస్తున్నారు. సాయంత్రం 5 గంటల లోపు వచ్చిన వారి టోకెన్లు ఇచ్చి దరఖాస్తులను తీసుకుంటారు.

## 'దండుపాళ్యం' పాలన ఎవరిదో అందరికీ తెలుసు



అసహనం, నిరాశతోనే మా 'కేబినేట్'పై బిఆర్ఎస్ నిరాధారమైన ఆరోపణలు

గత 20 నెలల్లో రాష్ట్రానికి రూ.3.2 లక్షల కోట్ల పెట్టుబడులు

రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'దండుపాళ్యం' పాలన అంటే ఎవరిదో అందరికీ, ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు బాగా తెలుసని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. అందుకే గట్టిగా కర్రు కాల్చి వాత పెట్టారని ఎద్దేవా చేశారు. అధికారం లేదన్న అసహనం, నిరాశలో 'కేబినేట్'పై ప్రతిపక్షాలు చేస్తున్న నిరాధారమైన ఆరోపణలను ఆయన శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. మంత్రుల మధ్య కుమ్ములాటలు, కేబినేట్ సమావేశంలో వర్గాలుగా విడిపోయి గొడవలు పడ్డారంటూ బిఆర్ఎస్ కట్టుకథల్ని సృష్టించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వారంతా సినిమాల్లో 'రచయితలు'గా ప్రయత్నించాలని, మంచి భవిష్యత్తు ఉంటుందని హితవు పలికారు. సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కేబినేట్ సమష్టిగా రాష్ట్రాభివృద్ధి కోసం పని చేస్తుందని స్పష్టం చేశారు. భావితరాల భవిష్యత్తు కోసం చిత్తశుద్ధితో అహర్నిశలు శ్రమిస్తున్న మా మంత్రులకు ప్రత్యేకంగా వ్యక్తిగత అజెండా అంటూ ఏదీ లేదన్నారు. మాకు అవకాశమిచ్చిన తెలంగాణ ప్రజల ఆశయాలు, ఆకాంక్షలే మా అందరి అజెండా అని తేల్చి చెప్పారు. మేం వేసే ప్రతి అడుగు రాష్ట్రాభివృద్ధి కోసమేనని, ఈ విషయంలో ఎలాంటి అపోహలకు తావు లేదని స్పష్టం చేశారు. 'విలువ ఆధారిత వృద్ధే' లక్ష్యంగా మా ప్రభుత్వం పారదర్శక పాలన అందిస్తుందన్నారు. మేం పాలనను గాలికొదిలేస్తే గత 20 నెలల్లో రూ.3.2 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చేవా అని ప్రశ్నించారు. మంత్రులంతా వ్యక్తిగత పంచాయతీలు పెట్టుకుంటే 'ఎలీ లిల్లీ' లాంటి అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలు తెలంగాణకు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. మాది మాటల ప్రభుత్వం కాదని... చేతల్లో చేసి చూపించే ప్రజా ప్రభుత్వమని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. మీ అంతర్గత కుమ్ములాటలను కప్పిపుచ్చుకోవడానికి మాపై బురద చల్లడం ఇకనైనా మానుకోవాలని సూచించారు. మీ అహంకారపూరిత వ్యవహారశైలి, పాలనా వైఫల్యాల చరిత్రను దాచుకునేందుకు ఇలాంటి నిరాధారమైన ఆరోపణలతో మైండ్ గేమ్ ఆడుతున్నారని విమర్శించారు. విజ్ఞులైన తెలంగాణ ప్రజలు మీ కుతంత్రాలను నమ్మరని గుర్తు చేశారు. రాజకీయాలను పక్కన పెట్టి రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని లేదంటే రాబోయే రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

**6 నెలల్లోనే రూ.12,864 కోట్ల ఎఫ్‌డీఐలు....**

'పారిశ్రామికాభివృద్ధి విషయంలోనూ మాపై దుష్ప్రచారం చేస్తున్నారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్ డీఐ) ఆకర్షణలో తెలంగాణ ముందంజలో ఉంది. గత ఆర్థిక సంవత్సరం మొదటి 6 నెలల్లోనే రాష్ట్రానికి రూ.12,864 కోట్ల ఎఫ్ డీఐలు వచ్చాయి. 2023–24లో ఇదే కాలంతో పోలిస్తే 33 శాతం ఎక్కువ కావడం గమనార్హం. దేశంలోనే టాప్ – 3 అర్బన్ ఎఫ్‌డీఐ కేంద్రాల్లో హైదరాబాద్ ఒకటిగా నిలిచింద'ని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. '2023–24లో పరిశ్రమల జీఎస్ వీఏ రూ.2.46 లక్షల కోట్లు. అది 2024–25లో 12.6 శాతం పెరిగి రూ.2.77 లక్షల కోట్లకు చేరుకుంది. వృద్ధి రేటు 8.68 శాతం. గతేడాదితో పోలిస్తే 2.1 శాతం అధికంగా నమోదయ్యింది. అదే జాతీయ సగటు వృద్ధి రేటు 6.2 శాతం మాత్రమే' అని పేర్కొన్నారు. ఇకనైనా వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని ప్రతిపక్షాలకు సూచించారు.

## బిసి ఉద్యమ హోరులో ఎంజిబిఎస్

స్తంభించిన బస్సుల రాకపోకలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసి ఉద్యమ నినాదాలతో మహాత్మాగాంధీ బస్ స్టేషన్(ఎంజిబిఎస్) దద్దరిల్లిపోయింది. రాజకీయ పార్టీలు, బిసి సంఘాలు, ప్రజాసంఘాలతో కలిసి బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఎంజిబిఎస్‌లో బైఠాయించారు. బస్సులను బయటకు కదలకుండా 12 గంటల పాటు ఆందోళన నిర్వహించారు. గంగిరెద్దుల విన్యాసాలు, బిసి కళాకారుల ఉద్యమ గీతాలతో ఆటపాటలతో 'ధూం దాం' కార్యక్రమం నిర్వహించారు. దీనితో బస్ స్టేషన్ పరిసర ప్రాంతాలు కళాకారుల ఆటపాటలతో బిసి ఉద్యమకారుల నినాదాలతో మారుమోగిపోయాయి.

**రిజర్వేషన్లు నిర్లక్ష్యం చేస్తే బిసిలు తిరగబడటం ఖాయం : సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**

సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 60 శాతం జనాభా కలిగిన బిసి కులగణ జరిపి, శాసనమండలి, శాసనసభలలో బిల్లును ఆమోదించిన తర్వాత గవర్నర్ వద్ద పెండింగ్‌లో పెట్టడం ద్వారా రిజర్వేషన్‌లకు చట్టబద్ధత రాలేదన్నారు. ఇప్పటికైన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గవర్నర్ ద్వారా బిల్లును ఆమోదించి, రిజర్వేషన్‌లకు చట్టబద్ధత కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బిసి రిజర్వేషన్‌లపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తే బిసిలు తిరగబడటం ఖాయమన్నారు. ఇప్పటికైనా బిసిల్లో ఆగ్రహ జ్వాలలు రగలకముందే కేంద్ర ప్రభుత్వం బిసి రిజర్వేషన్‌లకు రాజ్యాంగబద్ధత కల్పించాలని, లేకపోతే బిసిలతో కలిసి సిపిఐ ఉద్యమిస్తుందని నెల్లకంటి సత్యం హెచ్చరించారు.

**బంద్ చరిత్రాత్మకం విజయవంతం : జాజుల శ్రీనివాస్ గౌడ్**

జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తక్షణమే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నారు. ఈ బంద్ ద్వారానైనా బిసి రిజర్వేషన్‌లకు రాజ్యాంగ రక్షణ కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో జెఎసిలో చర్చించి, బిసి రథయాత్రను అన్ని జిల్లాలో చేపట్టి, హైదరాబాద్‌లో లక్షల మందితో బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు.

**బిసి రిజర్వేషన్‌లలో కాంగ్రెస్ చిత్తశుద్ధిని శంకించొద్దు : మహేశ్ కుమార్ గౌడ్**

టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ బిసి రిజర్వేషన్‌ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధిని ఎవరు శంకించాల్సిన అవసరం లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను ఆపి, బిసి రిజర్వేషన్లు పెంచాలని గత 23 నెలలుగా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పులు గత ప్రభుత్వం చేసిన చట్టం మూలంగా బిసి రిజర్వేషన్‌లకు మోక్షం లభించడం లేదన్నారు. ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా బిసి రిజర్వేషన్‌లకు కేంద్రం చట్టబద్ధత కల్పించేలా చర్యలు తీసుకోవాలని మహేశ్ కుమార్ గౌడ్ కోరారు.

**కేంద్రంపై ఒత్తిడి పెంచాల్సిన బాధ్యత రాష్ట్రానిదే : మంద కృష్ణ మాదిగ**

ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ బిసి రిజర్వేషన్లు పెంచడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటి వరకు చిత్తశుద్ధితో వ్యవహరించినప్పటికీ, కేంద్ర ప్రభుత్వంపై ఇంకా ఒత్తిడి పెంచాల్సినా బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే ఉందన్నారు. బిసి రిజర్వేషన్‌ల బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం తమ భుజాల మీద వేసుకొని బిసి రిజర్వేషన్లు సాధించగలిగితే ఆ క్రెడిట్ రేవంత్‌రెడ్డికి దక్కుతుందన్నారు. తెలంగాణలోని బిజెపి పెద్దలు బిసి రిజర్వేషన్‌ల విషయంపై ఢిల్లీ పెద్దలతో చర్చించి, సానుకూల నిర్ణయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అగ్ర వర్ణాలకు ఈడబ్ల్యూఎస్ ద్వారా రిజర్వేషన్లు పెంచినప్పుడు కానరాని 50 శాతం పరిమితి, బిసి రిజర్వేషన్‌లు పెంచినప్పుడే కనపడటం చాలా ఆక్షేపణీయమన్నారు. బిసి ఉద్యమానికి మద్దతుగా ఎంఆర్‌పిఎస్ అండగా నిలబడుతుందని మంద కృష్ణ మాదిగ ప్రకటించారు.

## తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పేరు... టిజిపిహెచ్ఐసిఎస్‌సిఎల్‌గా నామకరణం

కార్పొరేషన్ ఎండి రమేష్ వెల్లడి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ పేరును ''తెలంగాణ పోలీస్ హౌసింగ్ ఇన్ఫ్రాటెక్ అండ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ కార్పొరేషన్ లిమిటెడ్'' (టిజిపిహెచ్ఐసిఎస్‌సిఎల్)గా మారుస్తూ శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయని ఎండి ఎం రమేష్ తెలిపారు. తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ (టిజిపిహెచ్‌సిఎల్) ముఖ్యంగా సాంకేతికత ఆధారిత, వ్యాపార కార్యకలాపాల నిర్వహణ, విస్తరణ, సాంకేతిక సదుపాయాలను అందించడం, ఇంజనీరింగ్, ప్రాజెక్ట్ నిర్వహణ, సాంకేతిక సలహాలతో పాటు డిజైన్లు, నిర్మాణ సేవలు, క్రీడా సంబంధిత మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, లాజిస్టిక్స్ సంబంధిత రంగాలలో కన్సల్టెన్సీ సేవలను అందిస్తుంది. కాగా కార్పొరేషన్ పేరును సవరించడానికి ప్రభుత్వాన్ని అనుమతి కోరిందన్నారు. తదనుగుణంగా ప్రభుత్వం జిఒ 12ను శనివారం విడుదల చేస్తూ కార్పొరేషన్ పేరును తెలంగాణ పోలీస్ హౌసింగ్ ఇన్ఫ్రాటెక్ అండ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ కార్పొరేషన్ లిమిటెడ్‌గా మార్చింది. పేరు మార్పు శనివారం నుండి అమలులోకి వస్తుందని, పేరు మార్పు తర్వాత కార్పొరేషన్ టిజిపిఐసిఎస్‌ఎల్‌గా పిలవబడుతుందని మేనేజింగ్ డైరెక్టర్ ఎం.రమేష్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

## పథకాలు, అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం తగదు

ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, హెచ్ఒడిలకు సిఎం హెచ్చరిక



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులను అమలు చేయటంలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్ని విభాగాల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, విభాగ అధిపతులను హెచ్చరించారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో అలసత్వాన్ని సహించేదిలేదన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినప్పటికీ కొందరు అధికారుల పనితీరులో మార్పులేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అలసత్వం వీడాలని అన్నారు. ఎవరికివారు సొంత నిర్ణయాలు తీసుకొని ప్రభుత్వానికి చెడ్డపేరు తేవద్దని, అన్ని విభాగాల సమన్వయంతో ప్రజలకు మేలు జరిగే నిర్ణయాలు, కార్యక్రమాలకు ముందుగా ప్రాధాన్యమివ్వాలని అన్నారు. సిఎం నివాసంలో శనివారం ఉదయం సిఎంఓ కార్యదర్శులు, సిఎస్ రామకృష్ణారావుతో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే విషయంలో అధికారులు మరింత చురుకుగా పనిచేయాలని చెప్పారు. అన్ని విభాగాల కార్యదర్శుల నుంచి ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుని, పనుల పురోగతిని సమీక్షించాలని సిఎస్‌ను ఆదేశించారు. ప్రభుత్వం తరపున తీసుకోవాల్సిన చర్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని సిఎంఓ అధికారులను ఆదేశించారు. ఎక్కడ కూడా ఫైలు ఆగిపోవడానికి, పనులు ఆగిపోవడానికి వీల్లేదని సిఎం హెచ్చరించారు. కేంద్రం నుంచి రావాల్సిన గ్రాంట్లు, కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రావాల్సిన నిధులను రాబట్టుకునే కార్యాచరణను వెంటనే చేపట్టాలని అన్ని శాఖల కార్యదర్శులను ఆదేశించారు. ఏయే పథకాలలో రాష్ట్ర వాటా చెల్లిస్తే, కేంద్రం నుంచి నిధులు రావాల్సి ఉందో, వాటికి ముందుగా ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఇకపై సిఎస్‌తో పాటు సిఎంఓ అధికారులు తమ పరిధిలోని విభాగాలపై ప్రతి వారం తనకు నివేదికలు అందించాలని, తానే స్వయంగా వాటిపై సమీక్ష నిర్వహిస్తానని ముఖ్యమంత్రి తెలిపారు.

## సబ్ రిజిస్ట్రార్ ఉత్తర్వులు చెల్లవు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్‌గూడలో భూమి రిజిస్ట్రేషన్లకు చెందిన 17 సేల్‌డీడ్స్‌ను 2017లో సబ్ రిజిస్ట్రార్ రద్దు చేయడం చెల్లదని హైకోర్టు తీర్పు చెప్పింది. పిటిషనర్లకు నోటీసులు కూడా ఇవ్వకుండా రద్దు చెల్లదంది. అంతే కాకుండా సేల్‌డీడ్స్ రద్దు చేసిన భూములు నిషేధిత జాబితాలో కూడా లేవని చెప్పింది. ఈ భూములు తమవేనని ప్రభుత్వం భావిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చునని వెల్లడించింది. అందుకు ఈ ఉత్తర్వులు అడ్డంకి కాబోవని చెప్పింది. సేల్‌డీడ్స్ రద్దును సవాలు చేస్తూ పీ ధీరజ్ రంగారెడ్డి మరో ఇద్దరు వేసిన పిటిషన్లపై జస్టిస్ కాజా శరత్ తీర్పు చెప్పారు. సబ్ రిజిస్ట్రార్ ఉత్తర్వులను రద్దు చేస్తున్నామని, చట్టప్రకారమే చర్యలను కలెక్టర్ తీసుకోవచ్చునని చెప్పారు.


తెలంగాణా ప్రభుత్వము
కలెక్టర్ కార్యాలయం, హనుమకొండ
రెవెన్యూ (భూ సేకరణ ) శాఖ

కలెక్టర్ ఫైల్ నెం. జి /1341/2017-7 తేది: 10.10.2025
ఆర్.డి.ఓ. ఫైల్ నెం. జి2/638/2024 తేది: 24.09.2025
గెజిట్ నెం. 58/HNK/2025 తేది: 13.10.2025

ఫారం - VII
రూడీ ప్రకటన (డిక్లరేషన్)
(చూడుము సబ్ రూల్-1, రూల్-25, సెక్షన్-19(1) చట్టం-30/2013)

హనుమకొండ జిల్లా మల్లారం గ్రామము భీమదేవరపల్లి మండల పరిధిలో ఈ దిగువ షెడ్యూల్ నందు చూపబడిన భూమి విస్తీర్ణం (ఎ. 0.21 గుం.ల) భూమి ప్రజా ప్రయోజనార్థమై అనగా **Minor 1L of Distributory-6 on Gouravelly Right Side Main Canal of Gouravelly Canal Project from 0.000 to 0.175km** కొరకు అవసరమున్నదని తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, హనుమకొండ గారు భావిస్తున్నారు. కావున ఇట్టి ప్రకటన జారీ చేయనైనది.

షెడ్యులు

| క్రమ సంఖ్య | సర్వే నెంబరు | భూమి రకం (ఖుష్కి / తరి) | [illegible] | [illegible] | పట్టాదారు(ల) పేరు(లు) తండ్రి/భర్త పేరుతో సహా | అనుభవదారు (ల) పేరు(లు) తండ్రి / భర్త పేరుతో సహా / ప్రస్తుతము మొఖ ఉన్నవారు | [illegible] | ఇతర వివరములు |
|---|---|---|---|---|---|---|---|---|
| గ్రామం: మల్లారం మండలం: భీమదేవరపల్లి జిల్లా: హనుమకొండ | | | | | | | | |
| 1 | 944 | ఖుష్కి | పట్టా | 0-10.5 | మహ్మద్ హజిమియా S/o యాకుబ్ Md సలిమా W/o హజిమియా | Md. హజిమియా S/o యాకుబ్ | 0-10.5 | |
| 2 | 943 | ఖుష్కి | పట్టా | 0-10.5 | బోనగాని మొగిలి S/o వెంకటయ్య బోనగాని మొగిలి S/o వెంకటయ్య బోనగాని వెంకటయ్య S/o కొంరయ్య పాతపెల్లి పెద్దాపురం S/o మల్లయ్య మాడిశెట్టి రవీందర్ S/o వెంకట్ నారాయణ | బోనగాని సమయ్య | 0-08 | |
| | | | | | | రోడ్డు | 0-01.5 | |
| | | | | | | పాతపెల్లి యాదగిరి S/o కనకయ్య | 0-01 | |
| మొత్తం విస్తీర్ణం | | | | 0.21 గుంటలు | | మొత్తం విస్తీర్ణం | 0.21 గుంటలు | |

చట్టం నెం.30 ఆఫ్ 2013 సెక్షన్ 15 (2) క్రింద తెలిపిన విధముగా ఆసక్తి గల వ్యక్తులను సంప్రదించి తగు విచారణ చేపట్టిన తరువాత మరియు భూసేకరణపై నిర్ణీత గడువులో వచ్చిన అభ్యంతరాలు పరిష్కరించిన పిదప ఇట్టి రూఢి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది.

గౌరవెల్లి కాలువ నిర్మాణం కొరకు భీమదేవరపల్లి మండల పరిధిలోని కొత్తకొండ గ్రామము నందు భూమి సేకరించబడుచున్న నిర్మాణ దశలో సదరు భూమి లేదా సదరు భూమి యొక్క ఏదైనా భాగం, ఇతర భాగాలలో ఉండే గనులు, ఖనిజాలను త్రవ్వ సమయంలో బొగ్గు, ఇనుము రాయి, నాపరాయి లేదా ఇతర ఖనిజాల నుండి వచ్చే ఖనిజాల అవసరం లేదు. పైన తెలుపబడిన భూసేకరణ చేయు భూముల యొక్క నమూనా జిల్లా కలెక్టర్ వారి కార్యాలయం, హనుమకొండ లేదా భూసేకరణ అధికారి & రెవెన్యూ డివిజినల్ అధికారి, హనుమకొండ వారి కార్యాలయములో ఏదైనా పని దినమున, పని వేళలో తనిఖీ చేసుకోవచ్చును.

భూసేకరణ చేయు భూమిలో ఎటువంటి నివాస గృహములు లేవు, వ్యవసాయ భూమి భాగములు మాత్రమే సేకరించబడుచున్నవి. ఇట్టి ప్రాజెక్టు భూసేకరణ ద్వారా ఏ యొక్క కుటుంబము కూడా భూనిర్వాసితులు కావడం లేదు. ఏ ఒక్క వృత్తి కళాకారులు కాని, చిరు వ్యాపారులు కాని, వాణిజ్య సముదాయములు కాని, ప్రజల సామూహిక సౌకర్యములు అనగా రోడ్లు, నీటి ట్యాంకులు, పార్కులు సేకరించబడుట లేదు. అందువలన పునరిపాధి మరియు పనరావాస ప్యాకేజ్ ఇట్టి ప్రాజెకటనకు వర్తించదు.

సం/- భూసేకరణ అధికారి మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి హనుమకొండ
సం/- అధనపు కలెక్టర్ హనుమకొండ
సం/- జిల్లా కలెక్టర్ హనుమకొండ

DIPR RO NO. 727/LA/PP/Advt/Pub/2025-26


## కానిస్టేబుల్‌పై నిందితుడి దాడి

కత్తిపోట్లకు గురై మృతి చెందిన ప్రమోద్



**నిజామాబాద్:** ద్విచక్ర వాహనం చోరీ చేసిన నిందితుడిని ఠాణాకు తీసుకొస్తుండగా.. అతడు కత్తితో దాడి చేయడంతో ఓ కానిస్టేబుల్ మృతిచెందిన ఘటన నిజామాబాద్ నగరంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ద్విచక్రవాహనం దొంగిలించిన నిజామాబాద్‌లోని హాస్మీ కాలనీకి చెందిన రియాజ్ (24)ను పట్టుకునేందుకు సిసిఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ (42), అతని మేనల్లుడిని సాయంగా తీసుకుని శుక్రవారం రాత్రి ఆ కాలనీకి వెళ్లారు. రియాజ్‌ను అదుపులోకి తీసుకుని.. బైక్‌పై ఎక్కించుకున్నారు. కానిస్టేబుల్ వాహనాన్ని నడుపుతుండగా.. అతని మేనల్లుడు వెనుక, నిందితుడు మధ్యలో కూర్చున్నారు. వారు సిసిఎస్ ఠాణాకు వస్తుండగా.. వినాయక్ నగర్ వద్ద నిందితుడు కత్తితో కానిస్టేబుల్ ఛాతీలో పొడిచాడు. ఆపేందుకు ప్రయత్నించిన ప్రమోద్ మేనల్లుడిపైనా దాడి చేశాడు. ఈలోగా మరో ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై అక్కడికి వచ్చి రియాజ్‌ను తీసుకెళ్లబోయారు. అప్పుడే అక్కడికి వచ్చిన సిసిఎస్ ఎస్ఐ విఠల్ వారిని అడ్డుకోగా.. ఆయనపైనా కత్తితో దాడి చేసి పరారయ్యారు. స్వల్ప గాయాలైన ఎస్ఐ.. విషయాన్ని సిఐ శ్రీనివాస్‌రాజ్‌కు తెలిపారు. సిఐ, నాలుగో ఠాణా ఎస్ఐ శ్రీకాంత్‌లు వచ్చి ప్రమోద్‌ను జిజిహెచ్‌కు తరలించారు. కానీ అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రమోద్ మేనల్లుడి పరిస్థితి నిలకడగా ఉంది. నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ప్రమోద్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

**కానిస్టేబుల్ ప్రమోద్‌కు కన్నీటి వీడ్కోలు**
**అంత్యక్రియలకు హాజరైన ఐజి చంద్రశేఖర్‌రెడ్డి**
**పాడె మోసిన సిపి, డిసిపి**

రౌడీషీటర్ చేతిలో దారుణహత్యకు గురైన కానిస్టేబుల్ ప్రమోద్ మృతదేహానికి కన్నీటి వీడ్కోలు పలికారు. ప్రమోద్ కుటుంబ సభ్యులతో పాటు పోలీసులు, పోలీసు ఉన్నతాధికారులు, ప్రజలు భారీగా అంత్యక్రియల్లో పాల్గొని అశ్రునివాళులర్పించారు. అధికార లాంఛనాల మధ్య కానిస్టేబుల్ ప్రమోద్ అంత్యక్రియలు శనివారం నగరంలో నిర్వహించారు. ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, సిపి సాయిచైతన్య మృతునికి నివాళులర్పించారు. సిపి సాయిచైతన్య, అదనపు డిసిపి బస్వారెడ్డిలు ప్రమోద్ పాడెను మోశారు. దారి పొడవునా అర్ధనాథాలతో ప్రమోద్ మృతదేహానికి నివాళులర్పిస్తూ అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబ సభ్యుల రోదనలతో ఆ ప్రాంతం శోక సంద్రంగా మారింది. ఈ సందర్భంగా ఐజి చంద్రశేఖర్‌రెడ్డి ప్రమోద్ కుటుంబాన్ని ఓదార్చి వారికి అండగా ఉంటామని హరోసా కల్పించారు. రౌడీషీటర్ రియాజ్‌ను స్టేషన్‌కు తరలిస్తున్న క్రమంలో నగరంలోని వినాయక్‌నగర్‌లో కానిస్టేబుల్‌పై దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో కానిస్టేబుల్ ప్రమోద్ మృతి చెందాడు.

సీపీ సాయిచైతన్య ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందం పోలీసుశాఖ లాంఛనాలతో అంతిమయాత్రను నిర్వహించారు. నగరంలోని కంఠేశ్వర్‌లోని న్యూ బ్యాంకు కాలనీలోని ప్రమోద్ స్వగృహానికి ఇన్‌స్పెక్టర్ జనరల్ చంద్రశేఖర్ రెడ్డి చేరుకుని నివాళులర్పించారు. ఆ కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ అంత్యక్రియలలో పోలీసు ఉన్నతాధికారులతో పాటు నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ ఏసీపీలు, నగర సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, పోలీస్ వెల్ఫేర్ ప్రతినిధులు ప్రజలు హాజరయ్యారు.

### కానిస్టేబుల్ హత్యపై డిజిపి సీరియస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నిజామాబాద్ సిసిఎస్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఇ.ప్రమోద్‌ను హత్య చేసిన సంఘటనపై రాష్ట్ర డిజిపి బి.శివధర్ రెడ్డి సీరియస్ అయ్యారు. సిన్సియర్‌గా విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ప్రమోద్ మరణం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. వాహనాల దొంగతనాలను, చైన్ స్నాచింగ్ నేరాలను చేస్తున్న నిందితుడు షేక్ రియాద్ ఆచూకీ సమాచారం లభించిన వెంటనే పట్టుకుని పోలీస్ స్టేషన్ కు తీసుకొస్తున్న కానిస్టేబుల్ ప్రమోద్‌ను కత్తితో పొడిచి హత్య చేసి పరారైన నిందితున్ని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్‌ను ఆదేశించారు. మల్టీ జోన్ 1 ఐజి చంద్రశేఖర్ రెడ్డిని సంఘటన స్థలానికి వెళ్లి పరిస్థితులను పర్యవేక్షించాలని సూచించారు. మరణించిన కానిస్టేబుల్ కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించాలని, వారికి అవసరమైన సహాయం చేయాలన్నారు. లభించిన ఆధారాలను బట్టి, గాలింపు చేపట్టాలని, నిందితుడిని వెంటనే పట్టుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. దర్యాప్తు కొనసాగుతుందని డిజిపి తెలియజేశారు.

## విఆర్ఎస్ తీసుకున్న ఐపిఎస్ రవిగుప్తా



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రెండేళ్ల పాటు తెలంగాణ డిజిపిగా, రెండేళ్లకుపైగా హోం శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా ప్రస్తుతం సెంటర్ ఫర్ గుడ్ గవర్నర్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సీనియర్ ఐపిఎస్ అధికారి రవిగుప్తా శనివారం స్వచ్ఛంద పదవీ విరమణ పొందారు. తన స్వచ్ఛంద పదవీ విరమణపై పెట్టుకున్న దరఖాస్తును ప్రభుత్వం ఆమోదించింది. ఈ పరిణామం రాష్ట్ర పోలీస్ శాఖలో సంచలనం రేపింది. 1990 బ్యాచ్ ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన రవి గుప్తా డిజి హోదా కలిగిన అధికారి. నిజానికి ఆయన ఈ ఏడాది డిసెంబర్ 31న ఆయన పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే రెండు నెలల ముందే రవి గుప్తా ముందస్తుగా విఆర్ఎస్ తీసు కోవడంతో ఆసక్తి నెలకొంది. అయితే ఇటీవలే జరిగిన ఐపిఎస్ బదిలీలలో హోంశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి నుంచి సెంటర్ ఫర్ గుడ్ గవర్నన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా బదిలీ అయ్యారు. నెల రోజులు తిరగకుండానే విఆర్ఎస్ పెట్టుకోవడం గమనార్హం.

### బిసి రిజర్వేషన్లకు మాల మహానాడు మద్దతు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసిలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించడాన్ని స్వాగతిస్తున్నామని మహానాడు జాతీయ అధ్యక్షుడు గోపోజు రమేష్ బాబు పేర్కొన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీలకు వారి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచాల్సిన అవసరం ఉందని మీర్ పేటలో జరిగిన కార్యక్రమంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మీర్ పేట మాజీ సర్పంచ్ పల్లె పాండు గౌడ్, మాల మహానాడు మీర్ పేట నాయకుడు నాగేందర్ గౌడ్, జాతీయ ఉపాధ్యక్షులు కొండ్ర రాజలింగం, మాల మహానాడుజాతీయ కార్యదర్శి గాదం నర్సింగరావు, మాల మహానాడు సీనియర్ నాయకులు యంగల యాదగిర పెరుమాళ్ళ సత్యనారాయణ ప్రేమ్ దాస్ మల్లికార్జున్ వెంకయ్య సుంకర కుమార్ మల్లేష్ రజక సంఘం నాయకులు పెండ్యాల ఉమేష్ పెండ్యాల సత్యనారాయణ నాయి బ్రాహ్మణ సంఘం చంద్రశేఖర్ నాగరాజు పి సోమయ్య జిటి శ్రీధర్ రావు నర్సింగరావు రత్న రవి రామారావు రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

### ముంబయికి వెళ్లే గంజాయి పట్టివేత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఒడిశా నుంచి హైదరాబాద్ మీదుగా ముంబాయికి వెళ్లే గంజాయి స్మగ్లింగ్‌ను ఎక్సైజ్ ఎస్‌టిఎఫ్ సీ టీమ్ సిఐ వెంకటేశ్వర్ల బృందం రట్టు చేసింది. సికింద్రాబాద్ నుంచి ముంబాయికి తరలించేందుకు సిద్ధంగా ఉన్న 16.054 గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు యువకులను అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఒరిస్సాకు చెందిన మురళీనాయక్, కాల చరణ్‌లు ముంబాయికి గంజాయిని సరఫరా చేసేందుకు పథకం పన్నారు. ముంబాయి వాళ్లతో గంజాయి విక్రయం గురించి మాట్లాడుకున్నారు.


గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
చందానగర్ సర్కిల్-21, ఎస్ఎల్‌పి జోన్

NIT No. 20/EE/GHMC/DIV-21/2025-26 టెండర్ ప్రకటన ('ఇ' ప్రొక్యూర్‌మెంట్ ద్వారా) తేది: 18.10.2025

నం. 20/EE/GHMC/DIV-21/2025-26 (ఐటమ్ నం. 01 నుండి 06 వరకు) తేదీ: 18.10.2025 ప్రకారం (06) పని కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లను పిలవడమైనది. **అంచనా వ్యయం:** రూ.54.75 లక్షలు. 19.10.2025 (క్ర.సం.1 నుండి 6 వరకు) మధ్యాహ్నం 2.00 గంటల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ వెబ్‌సైట్‌లో బిడ్ల అమ్మకం తెరిచి ఉంటుంది. **బిడ్ల సమర్పణకు చివరి తేదీ:** 27.10.2025 మధ్యాహ్నం 2.00 గంటలకు (క్ర.సం.1 నుండి 3 వరకు), **బిడ్ల సమర్పణకు చివరి తేదీ:** 22.10.2025 మధ్యాహ్నం 2.00 గంటలకు (క్ర.సం. 4 నుండి 6 వరకు) మరియు బిడ్ల అమ్మకం సమర్పణ సమయానికి ఒక గంట ముందు ముగుస్తుంది. మరిన్ని వివరాలను https://tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, చందానగర్ సర్కిల్-21, SLP జోన్: GHMC.

DIPR R.O. No. : 9480-PP/CL/ADVT/1/2025-26, Date: 18-10-2025

తెలంగాణ ప్రభుత్వం
నీటిపారుదల మరియు సిఎడి విభాగం
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

| క్ర. సం. | టెండర్ నోటీసు సంఖ్య & తేదీ | పని వివరణ | పని అంచనా కాంట్రాక్ట్ విలువ (రూపాయలలో) |
|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 |
| 1 | 11/2025-26, తేదీ: 17.10.2025 | **పని పేరు:** ములుగు జిల్లా, వాజేడు (M), కృష్ణాపురం (V) సమీపంలోని మోడికుంటవాగు మీడియం ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు పర్యావరణ నిర్వహణ ప్రణాళిక (EMP) నివేదిక తయారు చేయడం పర్యావరణ అనుమతి పొందడానికి వివరాలు సమర్పించి ఒప్పించేందుకు సన్నద్ధం కావడం, పరివేష్ 2.0 ద్వారా పూర్తి రూపంలో పర్యావరణ అనుమతులు పొందడానికి ప్రతిపాదనలు సమర్పించడం, పర్యావరణ, అటవీ-వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఎంఒఇఎఫ్ & సిసిలో ఇఎసి సమావేశానికి హాజరు కావడం. | రూ. 15,50,000/- |

21.10.2025 ఉదయం 11.00 గంటల నుండి టెండర్ పత్రాలు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి దయచేసి www.eprocurement.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.

సం/- (వై. మోహన్ రావు), సూపరింటెండింగ్ ఇంజనీర్, నీటిపారుదల సర్కిల్, ములుగు.

DIPR R.O. No. : 9445-PP/CL/ADVT/1/2025-26, Date: 18-10-2025



# ప్రపంచం
WORLD NEWS

## మళ్ళీ వాణిజ్య చర్చలకు చైనా–అమెరికా అంగీకారం

**బీజింగ్:** ఉద్రిక్తతలను సడలించుకునేందుకు మళ్ళీ వాణిజ్య చర్చలు ప్రారంభించాలని అమెరికా–చైనా అంగీకరించాయి. రాబోయే వారాలలో వాణిజ్య చర్చలు తిరిగి ప్రారంభమవుతాయని రెండు దేశాల నాయకులూ సంకేతాలు ఇచ్చారు. చైనా ఉప ప్రధానిలీ ఫెంగ్, అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెస్సెంట్ మధ్య శనివారం వీడియో కాల్ సమావేశం జరిగింది. ఉద్రిక్తతలను సడలించేందుకు చర్చలను తిరిగి ప్రారంభించాలని నాయకులు ఇద్దరూ అంగీకరించారు. అరుదైన ఖనిజాల ఎగుమతులపై చైనా కొత్త నియంత్రణలు విధించడంతో, ట్రంప్ కూడా చైనాపై 100 శాతం టారిఫ్‌లు విధిస్తామని హెచ్చరించారు.ఈనెలాఖరున దక్షిణకొరియాలో ఎపెక్ సమావేశం సందర్భంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో జరగాల్సిన సమావేశాన్ని కూడా రద్దుచేసుకుంటామని బెదిరించారు. తాజా పరిణామాల నేపథ్యంలో రెండు దేశాలూ వెనక్కు తగ్గి చర్చ ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని నిర్ణయించాయి.

పాక్ సైన్యం దాడి

# 8మంది అఫ్గాన్ క్రికెటర్లు మృతి

## టి–20 మ్యాచ్ రద్దు : ముదిరిన సరిహద్దు వివాదం..దోహాలో శాంతి చర్చలు

**ఇస్లామాబాద్:**పాకిస్థాన్–అఫ్గానిస్థాన్ సరిహద్దుల్లో రెండు దేశాల సైన్యాలమధ్యా ఘర్షణలు చల్లారకపోగా, ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. పాకిస్థాన్ సైన్యం దాడిలో ఎనిమిది మంది అఫ్గానిస్థాన్ క్రికెటర్లు మరణించారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో పరిస్థితులు విషమించి మధ్యర్తులజోక్యంతో పరిష్కరించుకునే స్థాయికి వివాదం చేరుకుంది. ఖతార్ ప్రభుత్వం జోక్యం చేసుకుని దోహాలో శనివారం రెండు దేశాలతో సమావేశం జరిపింది. రెండు దేశాలమధ్యా స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్‌లో పాల్గొనేందుకు అఫ్గానిస్థాన్ క్రికెటర్లు ముందుగా పాక్టికా రాజధాని షరానాకు వెళ్ళారు. మ్యాచ్ పూర్తయ్యాక తిరిగి ఉర్గున్‌కు వెళుతూ మధ్యలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవడానికి ఆగిన సమయంలో పాకిస్థాన్ సైన్యం దాడి చేయడా దాడుల్లో వారు మరణించారు. అఫ్గానిస్థాన్ పత్రికల సమాచారం ప్రకారం మరణించిన ఎనిమిది మంది క్రికెటర్లలో కబీర్, సిబ్ఘతుల్లా, హరూన్ కూడా ఉన్నారు. ఈ అమానవీయమైన దాడిని ఎసిబి తీవ్రంగా ఖండించింది. అఫ్గానిస్థాన్ క్రికెట్ ప్రపంచానికి, ఎసిబి అథ్లెట్లకు తీరని నష్టం వాటిల్లిందని పేర్కొంది. అమరులైన క్రికెట్ క్రీడాకారుల కుటుంబాలకు, పాక్టికా రాష్ట్ర ప్రజలకు ఎసిబి తీవ్ర సంతాపం, సంఘీభావం ప్రకటించింది.శాంతిఒప్పందాన్ని ఉల్లంఘించిన పాకిస్థాన్ సైన్యం దాడులకు పాల్పడటంతో ఆఫ్గానిస్థాన్ క్రికెటర్లు మరణించారు. నిర్ణీత ప్రకారం నవంబరు నెలలో పాకిస్థాన్ కూడా పాల్గొనే మూడు దేశాల టి–20 ఇంటర్నేషనల్ మ్యాచ్ రద్దుచేస్తున్నట్లు ఎసిబి శుక్రవారం రాత్రి పొద్దుపోయాక ప్రకటించింది. ''మరణించిన క్రికెటర్లకు అల్లా స్వర్గలోక



ప్రాప్తినిచ్చుగాక, ఇంత తీరని దుఃఖంలో వారి కుటుంబాలు ఎంతో మనోనిబ్బరంగా వ్యవహరించాలి'' అని ఎసిబి తన ప్రకటనలో పేర్కొంది. అఫ్గానిస్థాన్ స్పోర్ట్స్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఎఎస్‌జెఎఫ్) కూడా ఈ దాడులను తీవ్రంగా ఖండించింది. వారం రోజుల వ్యవధిలో మూడుసార్లు సరిహద్దుల్లో ఘర్షణలు జరిగిన తర్వాత కాల్పుల విరమణ పాటించాలని రెండు దేశాలూ చేసుకున్న ఒప్పందాన్ని పాకిస్థాన్ సైనికులు ఉల్లంఘించి శుక్రవారం మళ్ళీ దాడులకు పాల్పడ్డారు. దీంతో పరిస్థితి విషమించి మూడో దేశం జోక్యం చేసుకునే స్థితికి చేరుకుంది. ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేసేపేరుతో పాకిస్థాన్ విమానాలు ఆఫ్గానిస్థాన్ గగనతలాన్ని ఉల్లంఘించాయి. దీంతో మొదటిసారి తాలిబన్ ప్రభుత్వ సైనికులు పాకిస్థాన్ సరిహద్దుల్లో ప్రతీకార దాడులకు పాల్పడ్డారు. ఇరువైపులా 30 మంది సైనికులు మరణించారు. రెండోసారిజరిగిన దాడుల్లో పాకిస్థాన్ పైచేయి సాధించి 40 మంది ఆఫ్గానిస్థాన్ సైనికులనుకాల్చిచంపింది.తాలిబన్ ప్రభుత్వ సహాయం, భారత్ ప్రోత్సాహంతో తమ భూభాగాలపై ఉగ్రవాదులు దాడులు చేస్తున్నారని ఆరోపించింది. తాలిబన్ ప్రభుత్వ సైనికులతోపాటు అనేకమంది టిటిపి (తెహ్రీక్ ఏ తాలిబన్ పాకిస్థాన్) ఉగ్రవాదులను కూడా హతమార్చినట్లు పాకిస్థాన్ ప్రకటించింది. కానీ తర్వాత రెండు దేశాలమధ్యా కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ ఆ ఒప్పందాన్ని కూడా పాకిస్థాన్ శుక్రవారం ఉల్లంఘించి కాల్పులకు పాల్పడిందని తాలిబన్ప్రభుత్వం ప్రకటించింది. అఫ్గానిస్థాన్‌లోని పక్తికా రాష్ట్రం ఉర్గన్, బర్మాల్ జిల్లాలు, అంగూర్ అడ్డా ప్రాంతంలోని హాఫీజ్ గుల్ బహదూర్ గ్రూపు ఉగ్రవాదుల స్థావరాలపై పాకిస్థాన్ సైన్యం దాడులు చేయగా డజన్ల సంఖ్యలో ఫైటర్ల మరణించినట్లు వార్తలు వెలువడ్డాయి.

### టిటిపి ఆత్మాహుతి దాడి
### ఏడుగురు పాక్ సైనికులు మృతి

తెహ్రీక్–ఎ–తాలిబన్ఉగ్రవాదులు పాకిస్థాన్ ఆర్మీ క్యాంప్ పై ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారు. పాకిస్థాన్–అఫ్గానిస్థాన్ మధ్య 48 గంటలు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన కొద్ది గంటలకే ఉత్తర వజిరిస్థాన్‌లోని ఆర్మీ క్యాంప్‌పై ఉగ్రవాదుల దాడిలో ఏడుగురు పాకిస్థాన్ సైనికులు మరణించారు. దీంతో తమ దేశ సైన్యం కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి ఎదురుదాడులు చేసినట్లు పాకిస్థాన్ పత్రికలు ప్రకటించాయి. టిటిపి ఉగ్రవాదులు తుపాకులతో, బాంబులతో ఆర్మీ శిబిరంపై దాడులు చేశారని పాకిస్థాన్ పత్రికలు శనివాం ప్రకటించాయి. కానీ పాకిస్థాన్ సైన్యం మాత్రం ఎలాంటి ప్రకటనా చేయలేదు. ఐతే టిటిపికి చెందిన హాఫీజ్ గుల్ బహదూర్ గ్రూపు మాత్రం ఉత్తర వజిరిస్థాన్ మిర్ అలీలోని ఖద్ది ఫోర్ట్‌పై దాడికి తామే కారణమని ప్రకటించుకుంది. పాక్టికా రాష్ట్రంలో ఉగ్రవాదుల స్థావరాలపై దాడులు చేసినట్లు పాకిస్థాన్ ఆర్మీ ప్రకటించింది.

### పాక్–అఫ్గాన్ ఘర్షణను
### తేలిగ్గా పరిష్కరిస్తాఃట్రంప్

పాకిస్థాన్–అఫ్గానిస్థాన్ మధ్య తలెత్తిన ఘర్షణను పరిష్కరించేందుకు మధ్యవర్తిత్వం చేయడానికి ఖతార్ నడుంకట్టన తరుణంలో, ఈ సమస్యను తాను చాలా తేలిగ్గా పరిష్కరిస్తానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. రెండు ఇరుగు పొరుగు దేశాలమధ్యా శత్రుత్వం పెచ్చుమీరడంతో, ' పరిష్కరించాలనుకుంటే చాలా సులభంగా పరిష్కరిస్తా'' అన్నారు. ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అమెరికా పర్యటన సందర్భంగా ఆయనతో ద్వైపాక్షిక మధ్యాహ్న విందు సందర్భంగా ట్రంప్ పైవిధంగా వ్యాఖ్యానించారు. పాకిస్థాన్ దాడులను నేను అర్థం చేసుకోగలను, నేను పరిష్కరించాలనుకుంటే అది నాకు చాలా తేలికైన పని, విజయవంతంగా దీనిని పరిష్కరించి లక్షల మంది ప్రజల ప్రాణాలకు భరోసా ఇవ్వగలను అన్నారు. ''ప్రజలను చంపడాన్ని అడ్డుకోవడం నాకు ఇష్టం, ఇప్పటికే నేను లక్షల లక్షలమంది ప్రజల ప్రాణాలకు భరోసా ఇచ్చాను'' అన్నారు. ఇప్పటికే తాము ఎనిమిది యుద్ధాలను ఆపేశామంటూ మళ్ళీ చరిత్ర చెప్పడం ప్రారంభించారు.

## తోమాహక్ క్షిపణులిచ్చేందుకు ట్రంప్ తిరస్కృతి

### వైట్‌హౌస్ నుండి నిరాశతో వెనుదిరిగిన జెలెన్‌స్కీ

**వాషింగ్టన్:** ఉక్రేన్‌కు తోమాహక్‌క్రూయిజ్ క్షిపణులు ఇచ్చే ందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దాదాపు నిరాకరించా రు. ఈ క్షిపణులు ఇవ్వాలని అడిగేందుకు అమెరికా వెళ్ళిన ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి నిరాశే ఎదురైంది. ట్రంప్ అస లు వాటి ఊసే ఎత్తలేదు. ఆ క్షిపణులు ఇస్తామని జెలెన్‌స్కీకి ఎలాంటి హామీ ఇవ్వలేదు. దీంతో ఆయన వట్టి చేతులతో తిరిగి వెళ్ళే పరిస్థితి వచ్చింది. గాజాలో యుద్ధం ఒక కొలిక్కి వచ్చిన తర్వాత ఉక్రేన్‌లో యుద్ధం ఆపేందుకు మధ్యవర్తిత్వం చేయాలంటూ ఒత్తిడి చేస్తున్న ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ శనివారం వైట్‌హౌస్‌లో ట్రంప్‌లో సమావేశమయ్యారు. ట్రంప్ ఆయనకు మధ్యాహ్నం ద్వైపాక్షిక విందు కూడా ఇచ్చారు. తర్వాత ట్రంప్ మాట్లాడుతూ, ''ఎక్కడివాళ్ళు అక్కడే (ఉక్రేన్–రష్యా సైన్యాలు) ఆగిపోండి, యుద్ధం విరమించండి'' అని పిలుపు ఇచ్చారు.

## ఒప్పందం ఉల్లంఘన

(మూడవ పేజీ తరువాయి)

ప్రాంతంలో ఐదుగురిని ఇజ్రాయెల్ సైనికులు చంపారు.

**మరో బందీ మృతదేహం స్వాధీనం**

హమాస్ సంస్థ మరో నిర్జీవ బందీని రెడ్‌క్రాస్ ద్వారా ఇజ్రాయెల్ ప్రభుత్వానికి స్వాధీనం చేసింది. దీంతో గడచిన ఎనిమిది రోజుల్లో ఇజ్రాయెల్‌కు హమాస్ 10 మంది బందీల మృతదేహాలను స్వాధీనం చేసినట్లయింది. ఇంకా హమాస్ వద్ద మరో 18 మంది బందీల మృతదేహాలు ఉన్నాయి. గడచిన సోమవారం (13వ తేదీ) 20 మంది సజీవులైన బందీలను హమాస్ స్వాధీనం చేసింది. ఈ వారం రోజుల్లో తొమ్మిదిమంది నిర్జీవ బందీలను స్వాధీనం చేయగా, తాజాగా మరో మృతదేహాన్ని అప్పగించింది. యుద్ధ నష్టం తీవ్రంగా ఉన్నందువల్ల మృతదేహాలను వెలికితీయడం కష్టంగా ఉందని, వారి జాడ కనిపెట్టాల్సి ఉందని, వెలికితీయడానికి ఆధునిక పరికరాలను తమకు సమకూర్చాలని హమాస్ వాదిస్తుండగా, మృతదేహాలు ఎక్కడున్నాయో హమాస్‌కు తెలుసుననీ, కావాలనే జాప్యం చేస్తోందని ఇజ్రాయెల్ ప్రభుత్వం విమర్శిస్తున్నది. బందీల మృతదేహాలను స్వాధీనం చేయడానికి నిర్దేశించిన సహేతుకమైన గడువు దగ్గరపడిందని ఇజ్రాయెల్ రక్షణమంత్రి కట్జ్ హెచ్చరించారు.

**నిర్జీవ బందీల విడుదల కోసం వేలాదిమంది ప్రదర్శన**

హమాస్ వద్ద ఇంకా మిగిలిన 18 మంది బందీల మృతదేహాలను స్వాధీనం చేయాలని కోరుతూ శనివారం రాత్రి ఇజ్రాయెల్ దేశవ్యాప్తంగా వేలాదిమంది అనేకచోట్ల ప్రదర్శనలు నిర్వహించారు. టెల్‌అవీవ్‌లోని హోస్టేజెస్‌స్క్వేర్ వద్ద వేలాదిమంది భారీ ప్రదర్శన నిర్వహించారు. చివరి బందీ మృతదేహాన్ని స్వాధీనం చేసేవరకూ తాము పోరాటం కొనసాగిస్తామని బందీలు,అపహరణకు గురైనవారి కుటుంబాల వేదిక స్పష్టం చేసింది. తమ పోరాటం ఇంకా ముగిసిపోలేదని ప్రకటించింది. హమాస్ వంకలు పెడుతూ బందీల మృతదేహాలు ఇవ్వకుండా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోందని ఇజ్రాయెల్ ప్రజలు వాదిస్తుండగా, జైళ్ళనుండి విడుదలైన పాలస్తినా ఖైదీలను నానా హింసలూ పెట్టిన విషయం వెలుగులోకి వచ్చిందని, అనేకమంది ఖైదీలను చిత్రహింసలు పెట్టి చంపి వారి మృతదేహాలను తమకు అప్పగించారని పాలస్తినా ప్రజలు విమర్శిస్తున్నారు.

# ఉగ్రవాదులను రెచ్చగొడుతున్న భారత్‌ను సహించం

### పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ హెచ్చరిక

**ఇస్లామాబాద్:** కొద్దిగా రెచ్చగొట్టే చర్యలకు దిగినాగానీ తీవ్రంగా స్పందిస్తామని పాకిస్థాన్ సైనిక దళాల ప్రధానాధిపతి ఆసిఫ్ మునీర్ భారత్‌కు హెచ్చరిక చేశారు. అఫ్గానిస్థాన్ భూభాగాన్ని ఉపయోగించుకుని భారతదేశం ఉగ్రవాదులనుఒకఆయుధంగా తమపై ప్రయోగిస్తోందన్నారు.అంతర్జాతీయనిబంధనలకుఅనుగుణంగారెండు దేశాలు కీలక సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. కశ్మీరు అంశాన్ని బాహాటంగా ఉటంకించారు. పాకిస్థాన్ ఒక శాంతి కాముక దేశమన్నారు. పాకిస్థానీ మిలిటరీ అకాడమీలో శిక్షణ పూర్తిచేసుకుని విధులు స్వీకరించేందుకు వెళుతున్న గ్రాడ్యుయేట్స్ ముగింపు కార్యక్రమంలో ఆసిఫ్ మునీర్ శనివారం ప్రసంగించారు. ఖైబర్ పఖ్తుంఖ్వా రాష్ట్రం కాకుల్‌లోకార్యక్రమం జరిగింది. చిన్నపాటి రెచ్చగొట్టేచర్యలకుదిగినాగానీతమదేశం చాలా నిర్ణయాత్మకంగా ప్రతిస్పందిస్తుందని భారత్‌ను హెచ్చరించారు.''అణ్వాయుధాలున్నప్రపంచంలోయుద్ధానికి తావులేదు అని భారత సైనిక నాయకత్వానికి నేను చాలా స్థిరమైనహెచ్చరిక, సలహాఇస్తున్నా, మేంఎప్పుడూ రెచ్చగొట్టం, కానీ మమ్మల్నికొద్దిపాటిగాకూడా రెచ్చగొట్టినా నిర్ణయాత్మకంగా ప్రతిస్పందిస్తాం'' అన్నారు. భారత్–పాకిస్థాన్ మధ్య ఇటీవల జరిగిన సైనిక ఘర్షణను ఆయన తన ప్రసంగంలోప్రధానంగాప్రస్తావించారు. ఆపరేషన్ సిం దూర్ సందర్భంగా తమదేశం ఎంతో గొప్ప నైపుణ్యాన్ని, ధైర్యసాహసాలను, సైనిక సామర్థ్యాన్ని యుద్ధంలో ప్రపంచానికి చాటి చెప్పిందన్నారు. భారతదేశం ఉగ్రవాదాన్ని ఒకఆయుధంగా ప్రయోగిస్తోందని ఆరోపించారు. ఎవరో కొద్దిమంది ఉగ్రవాదులుతమదేశానికిఎలాంటి నష్టం చేయలేరన్నారు. అఫ్గానిస్థాన్‌భూభాగం ఉపయోగించుకుని ఉగ్రవాదులను భారత్ రెచ్చగొడుతోందన్నారు. పరోక్షంగా అఫ్గానిస్థాన్ భూభాగాన్ని ఉపయోగించుకుని ఉగ్రవాదాన్ని తెహ్రీక్ ఎ తాలిబన్‌ల ద్వారా రెచ్చగొడితే సహించబోమన్నారు.

## స్తంభించిన తెలంగాణ

(మూడవ పేజీ తరువాయి)

బాడా వ్యాపార, వాణిజ్య సముదాయాలు తెరుచుకోలేదు. విద్య సంస్థలు, హోటళ్ళు, దుకాణాలు మూతపడ్డాయి. ఆర్‌టిసి బస్సులు, ఆటోలు సైతం రోడ్డుపైకి రాలేదు. గ్రేటర్ హైదరాబాద్ నగర వ్యాప్తంగా రాజకీయ పార్టీలు, బిసి సంఘాలు, వివిధ ప్రజా సంఘాలు భారీ ఎత్తున ర్యాలీలు నిర్వహించారు. రాష్ట్ర రాజధాని నగరంలో బంద్ సంపూర్ణమైంది. జిల్లా కేంద్రల్లో సైతం జెఎసి నాయకులు బస్సు డిపోల వద్ద బైఠాయించి బస్సులు బయటికి రాకుండా అడ్డుకున్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా జనజీవనం స్తంభించిపోయింది. కేవలం అత్యవసర సేవలు మినహా మిగతా రంగాలన్ని బంద్ పాటించాయి. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల నుంచి తార్నాక చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ప్రొఫెసర్లు, రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ(ఎం), టిజెఎస్, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ, మాలమహానాడు, ఆదివాసీ, మావోయిస్టు పార్టీలతో పాటు ఎంఆర్‌పిఎస్, గిరిజన, మైనార్టీ, విదార్థులు, ప్రజాసంఘాలు సైతం బంద్‌కు మద్దతు ప్రకటించాయి. రాష్ట్రవ్యాప్తంగా బంద్ ప్రశాంతంగా జరిగింది.

**బస్టాండ్‌లలో బిసి సంఘాల నిరసనలు..**

ట్యాంక్‌బండ్‌పై మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, సీతక్క, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, సాట్ చైర్మన్ శివసేన రెడ్డి బైఠాయించి నిరసన తెలిపారు. సికింద్రాబాద్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. మహాత్మాగాంధీ బస్ స్టేషన్‌లో టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ భైటాయించారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నారాయణగూడ వైఎంసిఏ నుంచి అబిడ్స్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి వామపక్ష పార్టీల అగ్రనాయకులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో ఖైరతాబాద్ వరకు తెలంగాణ జాగృతి కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్మించి నిరసన తెలిపారు. బర్కత్ పుర బస్‌డిపో వద్ద జరిగిన ఆందోళనలో బిసి జెఎసి చైర్మన్ ఆర్. కృష్ణయ్య, బిజెఎల్‌పి ఉప నేత పాయల్ శంకర్ పాల్గొన్నారు. ఆర్‌టిసి క్రాస్ రోడ్డులో నిర్వహిం చిన ఆందోళనలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, తలసాని శ్రీనివాస్ యాదవ్, వి.శ్రీనివాస్ గౌడ్, దాస్యం వినయ్ భాస్కర్, బిఆర్‌ఎస్ యవ నేతలు ముఠా జయసింహ, కిషోర్ గౌడ్ పాల్గొన్నారు. దోమల్‌గూడ నగర పార్టీ కార్యాలయం నుంచి ఇందిరా పార్కు చౌరస్తా వరకు తెలుగుదేశం నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇందిరా పార్కు చౌరస్తాలో బైటాయించారు. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు అరవింద్ కుమార్ గౌడ్, నాయకులు సాయిబాబా, నల్లెల్ల కిషోర్, బాల్‌రాజ్ గౌడ్ పాల్గొన్నారు. ఎల్.బి.నగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద బిసి నాయకులు, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి చిరంజీవులు, రిటైర్డ్ జడ్జి, జస్టిస్ ఈశ్వరయ్య నిరసన వ్యక్తం చేశారు.

**దిల్‌సుఖ్‌నగర్‌లో ఉద్రిక్తత..**

బిసి జెఎసి బంద్ నేపథ్యంలో దిల్‌సుఖ్‌నగర్‌లో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇక్కడ ఆర్‌టిసి బస్ డిపోల ఎదుట రోడ్లపై బైఠాయించి బస్సులు నడవకుండా అడ్డుకున్నారు. కాంగ్రెస్ సహా ఇతర పార్టీలు, కుల సంఘాల నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బంద్‌లో పాల్గొన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. పలు ప్రైవేటు బస్సులను అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు వారిని వారించేందుకు ప్రయత్నించారు. పోలీసులు, బిసి సంఘాల నేతలకు మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో స్వల్ప స్థాయిలో ఉద్రిక్తత నెలకొంది.



**చిత్తశుద్ధి ఎవరికి ఉందనేది ముఖ్యం : మంత్రులు..**

ట్యాంకుబండ్‌పై బైఠాయించిన మంత్రులు సీతక్క, వాకిటి శ్రీహరి మా ట్లాడుతూ బిసి జెఎసి చేపట్టిన బంద్‌లో అన్ని పార్టీల నేతలు పాల్గొనడం మంచి పరిమాణమమన్నారు. చిత్తశుద్ధి ఎవరికి ఉందనేది ముఖ్యమన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు రాకుండా అడ్డుకునేది బిజెపియేనని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎన్ని చేయాలో అన్ని చేస్తున్నామని తెలిపారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామన్నారు. ఈ అంశంపై త్వరలోనే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కలుస్తామని అన్నారు.

**ఇది ఆరంభం మాత్రమే : మంత్రి పొన్నం ప్రభాకర్**

బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించడానికి తెలంగాణ ఉద్యమం స్ఫూర్తితో పోరాటం కొనసాగిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని అన్నారు. రాష్ట్రంలో తమ బాధ్యత నిర్వహించామని, ఇక అంతా కేంద్రం చేతుల్లోనే ఉందన్నారు. కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి, బిజెపి ఎంపిలంతా ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. లేకపోతే తెలంగాణ ప్రజల ముందు దోషిగా నిలబడే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఏ న్యాయస్థానంలో అయినా తాము వాదనలు వినిపించడానికి సిద్ధంగా ఉన్నామని మంత్రి పొన్నం స్పష్టంచేశారు. రాజ్యాంగంలో జనాభా ప్రాతిపదికన బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌ల కల్పనకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు.

**బిజెపికి బిసిల పాపం : మంత్రి కొండా సురేఖ**

బిసిలకు అన్యాయం చేసిన బిజెపికి పాపం తప్పకుండా తగులుతుందని మంత్రి కొండా సురేఖ అన్నారు. రాహుల్ గాంధీ ఆలోచన మేరకు బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని అనుకున్నామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక రెడ్డి బిడ్డ అయినప్పటికీ బిసి రిజర్వేషన్‌ల అంశాన్ని ఛాలెంజ్‌గా తీసుకొని బిల్లును తీసుకొచ్చారన్నారు. ఆర్డినెన్స్ తీసుకొచ్చి, అసెంబ్లీలో బిల్లు ఆమోదించామన్నారు. అసెంబ్లీలో బిసి బిల్లుకు మద్దతు తెలిపిన బిజెపి, గవర్నర్ ఆమోదం తెలుపకుండా అక్కడ అడ్డుకుంటూ, దొంగాట ఆట ఆడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర గవర్నర్ ఒక్క సంతకం పెట్టి, బిసి బిల్లు కి ఆమోదం తెలిపి ఉంటే ఎక్కడా సమస్య వచ్చేది కాదన్నారు.

**రిజర్వేషన్‌ల పేరుతో బీసీలను మోసం చేయడం దారుణం : మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్**

రిజర్వేషన్‌ల పేరుతో బిసిలను మోసం చేయడం దారుణమని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బిసి బంద్‌కు మద్దతు తెలుపుతూ బస్ భవన్‌కు బయలుదేరే ముందు తెలంగాణ భవన్ వద్ద మీడియాతో ఆయన మాట్లాడారు. బిసి రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ పెద్ద డ్రామా ఆడుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి కాంగ్రెస్ ప్రభుత్వానికి బిసిలపై ఎలాంటి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. హైకోర్టు ఇచ్చిన స్టేతో బిసిలపై కాంగ్రెస్ పార్టీ వైఖరి బట్టబయలైందన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ పార్టీ ద్రోహం చేసిందని విమర్శించారు. కేవలం కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన మోసపూరిత విధానాలతో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ దక్కకుండా పోయిందన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో బీసీలను మభ్యపెట్టారని చూశారన్నారు. చెల్లని జి.ఓలను, ఆర్డినెన్స్‌లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని ఎద్దేవా చేశారు.

**తెలంగాణ ఉద్యమం మాదిరిగా మరో బిసి ఉద్యమాన్ని చేపడతాం : కవిత**

తెలంగాణ ఉద్యమం మాదిరిగా మరో బిసి ఉద్యమాన్ని చేపడతామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. బిసిల బంద్‌కు మద్దతుగా ఆటోలతో ర్యాలీగా బయల్దేరి ఖైరతాబాద్ చౌరస్తాలో మానవహారం నిర్వహించి మాట్లాడారు. గంటపాటు ఖైరతాబాద్ చౌరస్తాలో మానవహారం నిర్వహించి బిసి రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిసి బిడ్డలు తమకు రిజర్వేషన్లు కావాలని కోరుతున్నారని, రిజర్వేషన్లు ఇచ్చే పార్టీలే బంద్ కు మద్దతు ప్రకటించటం నవ్వులాటగా ఉందని ఎద్దేవా చేశారు. దొంగ జి.ఓలు ఇచ్చిన కాంగ్రెస్, బిసి బిల్లును పాస్ చేయించాల్సిన బిజెపిలు బంద్ కు మద్దతు పేరుతో డ్రామాలు చేస్తున్నాయని మండిపడ్డారు. హంతకులే వచ్చి నివాళులు అర్పించినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బిసి బిడ్డలను పదే పదే మోసం చేస్తున్నారని, స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి బీసీలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**కులగణన బూటకం : ఈటల రాజేందర్**

జూబ్లీ బస్టాండ్ వద్ద జరిగిన ధర్నాలో పాల్గొన్న బిజెపి ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ అమలు కాదని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిండు అసెంబ్లీ చెప్పారన్నారు. అన్ని తెలిసి కూడా బిసిలను మోసం చేస్తున్నారన్నారు. కులగణన బూటకమని విమర్శించారు. బిసిలు 52 శాతం ఉంటే 42 శాతం అని కాకి లెక్కలు చెప్తున్నారన్నారు. తాను చెప్పేది అబద్ధం అయితే రాజకీయాల నుండి తప్పుకుంటా అని సవాల్ విసిరారు.

**రాజ్యాంగపరంగా బిసిలకు రిజర్వేషన్ : ఎమ్మెల్యే పాయల్**

బిసిలకు 42 శాతం రిజర్వేషన్ పార్టీలు కల్పిస్తే తీసుకునేందుకు బిసిలు ఏ పార్టీ నేతల మోచేతి నీళ్లు తాగేవారుకాదని, రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్ కావాలని బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. బర్కత్ పూర బస్సు డిపో వద్ద ఆయన మాట్లాడుతూ చట్టసభల్లో బిసిలకు అన్యాయం జరుగుతోందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమాన్ని ఏవిధంగానైతే కొందరు నీరుగారిచేందుకు యత్నించరో, అదేవిధంగా బిసి రిజర్వేషన్ ఉద్యమాన్ని సైతం వ్యతిరేకించేందుకు చూస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి కుట్రలు ఎవ్వరు చేసినా అడుగడుగున బిసిలు అడ్డుకుంటారని హెచ్చరించారు.

**బిసి బంద్‌లో కిందపడిపోయిన వి.హనుమంతరావు..**

అంబర్‌పేట్‌లో నిర్వహించారు. ఈ ర్యాలీలో వి.హనుమంతరావు ఫ్లెక్సీ పట్టుకుని నడుస్తుండగా, అది అడ్డువచ్చి కిందపడిపోయారు. వెంటనే స్పందించిన కాంగ్రెస్ నేతలు వి.హనుమంతరావును పైకి లేపారు. అనంతరం ర్యాలీ యథావిధిగా కొనసాగింది. వి.హనుమంతరావు కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని అనంతరం ర్యాలీలో పాల్గొన్నారు. బిసి రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి, కేంద్ర ప్రభుత్వం బిసి బిల్లు ఆమోదించాలని ఆయన డిమాండ్ చేశారు.

## తెలంగాణ రాష్ట్రం సాకారం

(మూడవ పేజీ తరువాయి)

మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పాల్గొన్నారు. సభలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మేం గ్రూప్ 1 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి చేశామని, తెలంగాణ పునర్ నిర్మాణంలో నిరుద్యోగులను భాగస్వాములను చేసే బాధ్యత టిజిపిఎస్‌సి తీసుకుందని, గ్రూప్ 2 పరీక్షలు నిర్వహించి నియామక పత్రాలను అందిస్తున్నామన్నారు. 'గత పాలకులు ఉద్యోగాల భర్తీని అడ్డుకునేందుకు కేసులు వేసి అక్రమ సంపాదనతో ఏర్పాటు చేసుకున్న సోషల్ మీడియా వ్యవస్థతో కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేశారు. అలాంటి ఏ వ్యవస్థ మాకు లేదు. మా వ్యవస్థనే మీరు. ఆ వ్యవస్థలో మీరే మా కుటుంబ సభ్యులు. ఇప్పటి వరకు మీరు సామాన్యులు. నేటి నుంచి మీరు ఆఫీసర్స్. మీ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలి' అని సిఎం అన్నారు. గత పాలకుల పాపాల పుట్ట పలుకుతోందని, వారి దోపిడీ గురించి తాము చెప్పడం లేదని, వారి కుటుంబ సభ్యులే చెబుతున్నారని, హాస్టల్స్‌లో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయితే వారు పైశాచిక ఆనందం పొందుతున్నార న్నారని సిఎం విమర్శించారు. సెంటిమెంట్‌తో మళ్లీ అధికారంలోకి రావాలనుకుంటున్నారని, అలాంటి వారి పట్ల ఉద్యోగులు, అధికారులు జాగ్రత్తగా ఉండాలని, ఎలాంటి ప్రమాద ఘటనలు జరగకుండా, ఫుడ్ పాయిజన్‌తో ఎవరూ ప్రాణాలు కోల్పోకుండా చూడాలని, సమర్థవంతంగా పనిచేసి ఆదర్శంగా నిలవాలని సిఎం అన్నారు.

**రాష్ట్రంలో ఎవరు ఖాళీగా ఉండొద్దు**

రాష్ట్రంలో ఏ ఒక్కరు ఖాళీగా ఉండొద్దని, బడికి వెళ్లాలి లేదంటే ఉద్యోగం చేయాలనే ఆలోచనతో ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలోని ప్రతి బిడ్డ బడికి రావాలి వచ్చిన ప్రతి బిడ్డ ఇంగ్లీష్ మీడియంలో చదువుకోవాలి నైపుణ్యాలు పొందాలి ప్రతి బిడ్డ ఉద్యోగం పొందాలనేదే మా ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఒకే రోజు 783 మందికి గ్రూప్ 2 నియామక పత్రాలు అందించడం చరిత్రలో సువర్ణాక్షలతో లిఖించదగిన రోజు అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆ తర్వాత ప్రత్యేక రాష్ట్రంలో వివిధ హోదాల్లో పనిచేసిన తన రాజకీయ అనుభవంలో ఏనాడు ఇంతమందికి ఒకేసారి నియామక పత్రాలు అందించిన దాఖలాలు లేవన్నారు. 'ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే ఆత్మగౌరవంతో మన ఉద్యోగాలు మనమే సాధించవచ్చు అన్న ఆశతో దశాబ్ద కాలం పాటు ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం చేశామన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం త్యాగాలు చేసిన అమరుల ఆశయాలు నెరవేరుతాయి అని కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో పదేళ్లపాటు చూసి చూసిన తల్లిదండ్రుల ఆశలు నెరవేరలేదన్నారు. కూలి చేసి రూపాయి రూపాయి పోగేసి తమ బిడ్డలను హైదరాబాదులోని కోచింగ్ సెంటర్లకు పంపారని, ఆ నిరుద్యోగ బిడ్డలు నోటిఫికేషన్ల కోసం చూసి చూసి అలసిపోయారని, గత పది ఏళ్ల కాలంలో నోటిఫికేషన్లు రాలేదని, ఒకటి, అర వచ్చిన అవి సక్రమంగా జరగలేదు అన్నారు.

## బిసి ద్రోహి బిజెపి

(మూడవ పేజీ తరువాయి)

పట్టిస్తుందని ఆరోపించారు. బిసి రిజర్వేషన్లపై ఎవరి పంథా ఏమిటో ప్రజల్లో చైతన్యం పెరిగిందని, ఇప్పుడు బిసి ఉద్యమాన్ని ఎవరూ ఆపలేరన్నారు. రిజర్వేషన్ల అంశాన్ని బిజెపి వారు ముందుకు తీసుకుపోవాలని సిఎం రేవంత్‌రెడ్డి అనడం సముచితం కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇక్కడ చట్టం చేసామని చేతులు దులుపుకోకుండా సిఎం రేవంత్‌రెడ్డే ఈ అంశాన్ని ప్రతిష్టగా తీసుకుని అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకు వెళ్ళి తెలంగాణ బిసిల గొంతు ఢిల్లీలో వినిపించాలని ఆయన సూచించారు. బిసిలకు 42 శాతం హక్కు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్, జిఒ, రెండు బిల్లుల తెచ్చిందని, అయినా అడ్డంకులు ఏమిటిని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. పార్లమెంట్‌లో బిసి బిల్లు పెట్టి 9వ షెడ్యూల్‌లో చేర్చి బిసి రిజర్వేషన్లు 42 శాతం పెంచాలని, ఇందు కోసం బిసిలు చేస్తున్నది న్యాయమైన పోరాటమన్నారు. సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ పేదలు రాజకీయాల్లోకి రావద్దనే కక్ష బిజెపికి ఉందని స్పష్టమవుతుందన్నారు. ప్రధాని మోదీ నిజంగా బిసి అయితే బిసి రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లోనే కాకుండా రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కూడా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అందుకోసం ఎంతవరకైనా పోరాడుతామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బిసిలకు రిజర్వేషన్లు కల్పించకపోతే బిసి వర్గాల అభివృద్ధికి అడ్డంకులుగా, ద్రోహులుగా మారుతారని ఆయన బిజెపి నేతలను హెచ్చరించారు. జనాభాలో 50 శాతం ఉన్న మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించిన సందర్భంలో 56 శాతం ఉన్న బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం న్యాయబద్ధమేనన్నారు. బిజెపి నాయకులు కిషన్ రెడ్డి, రామచంద్రరావు కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి 42 శాతం అమలు జరిగేలా చూడాలని, వారికి చేతకాకపోతే వారి పదవులకు రాజీనామా చేయాలని నారాయణ డిమాండ్ చేశారు. రిజర్వేషన్లను అడ్డుకుంటున్న కేంద్రం ప్రభుత్వం, బిజెపికి వ్యతిరేకంగా పోరాడాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బిల్లు పాస్ చేసి గవర్నర్ ద్వారా కేంద్రానికి పంపి ఆరు నెలలైనా 9వ షెడ్యూల్‌లో చేర్చకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఆర్డినెన్స్‌ను ఆమోదించి గవర్నర్‌కు పంపి నెల రోజులు గడుస్తున్నా ఉలుకుపలుకు లేదన్నారు. గవర్నర్ బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన వ్యక్తి కాబట్టే తెలంగాణ ప్రభుత్వం ఆమోదించిన ఆర్డినెన్స్‌ను ఆమోదించడం లేదన్నారు. బిజెపి కూడా బిసిలకు మద్దతు తెలుపుతూ ఉద్యమానికి నష్టం చేస్తున్నదన్నారు. బిసిలకు కల్పిస్తున్న 42 శాతం రిజర్వేషన్లలో మైనార్టీలను తొలగించాలని బిజెపి డిమాండ్ చేయడం సముచితం అర్ధరహితమన్నారు. టిజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ మాట్లాడుతూ బిసి సంఘాలు ఇచ్చిన రాష్ట్ర బంద్ సంపూర్ణంగా విజయవంతమైందని, ఇదే స్ఫూర్తితో రిజర్వేషన్లు సాధించే వరకు కొనసాగాలని పిలుపునిచ్చారు. రాజకీయంగా బిసిలకు రిజర్వేషన్లు వస్తే తప్పా ఆర్థికంగా, సామాజికంగా, అన్ని రంగాల్లో బిసిలు ఎదగలేరన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎలాగైతే ఆందోళనలు చేసామో బిసి రిజర్వేషన్లు అమలు అయ్యేవరకు పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ, కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, ఎస్.ఛాయాదేవి, నగర కార్యదర్శి స్టాలిన్, నగర సహాయ సహయ కార్యదర్శి కమతం యాదగిరి, సికింద్రాబాద్ కార్యదర్శి కంపల్లి శ్రీనివాస్, టిజెఎస్ నేత ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వర్ రావు, బైరి రమేష్, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.జ్యోతి, మల్లు లక్ష్మి, నేతలు టి.సాగర్, డి.జి.నర్సింహరావు, ఎం.శ్రీనివాస్, సిపిఐఎంఎల్ కార్యదర్శి హన్మేష్, నాయకులు ఎస్.ఎల్.పద్మ, కె.సూర్యం, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమాక్రసీ రాష్ట్ర సెక్రటరీ కె.గోవర్ధన్, నేతలు జె.వి.చలపతిరావు, అరుణ, సంధ్య, సిపిఐ (ఎంఎల్) ఎఎన్‌డి నాయకులు చంద్రన్న, అరెల్లి కృష్ణ, విజయ్, ఎంసిపిఐయు నేత గాదగోని రవి, అనిల్, అరుణోదయ సాంస్కృతిక సంస్థ నేత విమలక్క, సత్యశోధక్ సమాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీధర్‌తో పాటు విద్యార్థి, యువజన సంఘాలు, ట్రేడ్ యూనియన్, రైతు, మహిళా సంఘాలు తదితర ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## రష్యా చమురు భారత్ కొనదుగాక కొనదు

**ట్రంప్ ఉద్ఘాటన**

**వాషింగ్టన్:** రష్యా నుండి ముడిచమురును భారతదేశం కొనదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి ఉద్ఘాటించారు. ఇప్పటికే భారతదేశం కొంత వెనక్కి తగ్గిందని, కొద్దో గొప్పో రష్యా నుండి చమురు కొనుగోళ్ళు ఆపేసిందని అన్నారు. ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ వాషింగ్టన్ పర్యటన సందర్భంగా ద్వైపాక్షిక విందులో శనివారం ట్రంప్ మాట్లాడుతూ, చమురు కొనుగోలు విషయంలో భారత్ ఇప్పటికే వెనక్కి తగ్గిందన్నారు. 38 శాతం మేరకు చమురును కొనుగోలు చేశారని, ఇక వారు ఎంతమాత్రం ముందుకు వెళ్ళరని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఐతే భారతదేశ వినియోగదారుల ప్రయోజనాలను, మార్కెట్ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని తమ చమురు కొనుగోళ్ళు ఉంటాయని గురువారం భారత ప్రభుత్వం ప్రకటించింది.

### పాకిస్థాన్ భూభాగంలోని..
## ప్రతీ అంగుళం 'బ్రహ్మోస్ పరిధిలోనే' ఉంది

**రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టీకరణ**



**లక్నో :** పాకిస్థాన్ భూభాగంలోని ప్రతీ అంగుళం బ్రహ్మోస్ పరిధిలో ఉందని, ఆపరేషన్ సిందూర్ సమయంలో ఏమి జరిగిందో అది కేవలం ట్రైలర్ మాత్రమేనని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. శనివారం ఆయన ఇక్కడ నుండి పాకిస్థాన్‌కు ఒక గట్టి హెచ్చరిక చేశారు. భారతదేశానికి విజయం ఒక అలవాటుగా మారిందని ఆపరేషన్ సిందూర్ నిరూపించిందని ఆయన తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సరోజినీ నగర్ లోని బ్రహ్మోస్ ఏరోస్పేస్ విభాగంలో తయారుచేసిన బ్రహ్మోస్ క్షిపణుల మొదటి బ్యాచ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. సింగ్ మాట్లాడుతూ బ్రహ్మోస్‌ను భారతదేశ విజయానికి చిహ్నంగా అభివర్ణించారు. బ్రహ్మోస్ కేవలం క్షిపణి మాత్రమే కాదని, ఇది భారతదేశం విశ్వాసానికి సంబంధించి ఒక రుజువు అన్నారు. సైన్యం మొదలు నావికాదళం నుండి వైమానిక దళం వరకూ బ్రహ్మోస్ మన రక్షణ దళాలకు కీలక స్తంభం అన్నారు. భారతదేశం రక్షణ సామర్థ్యాలు ఇప్పుడు శక్తివంతమైన నిరోధకంగా మారాయని ఆయన నొక్కి చెప్పారు.' పాకిస్థాన్ భూభాగంలోని ప్రతీ అంగుళం బ్రహ్మోస్ పరిధిలోనే ఉంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఏమి జరిగిందో అది కేవలం ట్రైలర్ మాత్రమే. భారతదేశం పాకిస్థాన్‌ను సృష్టించగలిగితే, సమయం వస్తే నేను ఎక్కువ చెప్పనవసరం లేదు. మీరందరూ తగినంత తెలివైనవారని పాకిస్థాన్‌కు అర్థం అయ్యేలా చేయగలిగారు' అని రక్షణ మంత్రి తెలిపారు. విజయం మనకు ఒక సంఘటన మాత్రమే కాదని, అది మనకు ఒక అలవాటుగా మారిందని ఆపరేషన్ సిందూర్ నిరూపించిందని ఆయన అన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను ప్రశంసిస్తూ రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ ఇది భారతీయులలోవిశ్వాసాన్ని నింపిందని, బ్రహ్మోస్ ప్రభావాన్ని నిరూపించిందని పేర్కొన్నారు. ఈ విశ్వాసాన్ని కాపాడుకోవడం ఇప్పుడు మన సమష్టి బాధ్యత అని ఆయన ఉద్బోధించారు. భారతదేశం సామర్థ్యాన్ని ఇప్పుడు ప్రపంచం మొత్తం గుర్తించిందని, భారతదేశం తన కలలను చెప్పినట్లుగా మార్చగలదనే మా నమ్మకాన్ని బలోపేతం చేసిందని సంతోషం వ్యక్తం చేశారు. ఏప్రిల్ 22న జమ్ముకశ్మీర్‌లోనిపహల్గామ్‌లో26మంది ప్రాణాలు కోల్పోయిన దాడి తర్వాత, మే నెలలో ఆపరేషన్ సిందూర్ కింద భారత రక్షణ దళాలు పాకిస్థాన్‌లోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలు, స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నాయి. స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేయబడిన బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణులను భారతదేశం ఆపరేషన్ సమయంలో పాకిస్థాన్ వైమానిక స్థావరాలను నాశనం చేయడానికి ఉపయోగించింది. లక్నోలో బ్రహ్మోస్ తయారీపై మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ భారతదేశం యొక్క పెరుగుతున్న విశ్వాసం, సామర్థ్యం రక్షణ తయారీలో ఒక ప్రతీక అని వ్యాఖ్యానించారు. 'లక్నో కేవలం నా పార్లమెంట్ నియోజకవర్గం మాత్రమే కాదు. అది నా ఆత్మ. నేడు అది టెక్నాలజీ, పరిశ్రమ, సంస్కృతి, సంప్రదాయాల నగరంగా రూపాంతరం చెందింది' అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. బ్రహ్మోస్ క్షిపణులను విజయవంతంగా ఇక్కడ తయారుచేయడం అనేది ఒకప్పుడు కలగా ఉండేదని, కానీ ఇప్పుడది వాస్తవమైందని అన్నారు. ఈ ప్రాజెక్ట్ సహనం, కృషి, దృఢ సంకల్పాన్ని ప్రతిబింబిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌కు ఇది ఒక గర్వించదగిన క్షణం అని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ 'మేక్ ఇన్ ఇండియా' విజన్‌కు ప్రతిబింబం అని పేర్కొన్నారు. మే 11న ప్రారంభించబడిన ఈ అత్యాధునిక బ్రహ్మోస్ యూనిట్‌లో క్షిపణి అనుసంధానం కోసం అన్ని ఆధునిక సౌకర్యాలు ఉన్నాయి. నాణ్యత తనిఖీలను పరీక్షిస్తారు. విజయవంతమైన పరీక్ష తర్వాత, క్షిపణులను భారత సాయుధ దళాలు మోహరించడానికి సిద్ధం చేస్తాయి. ఈ కార్యక్రమంలో ఉత్తర్‌ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి బ్రజేష్ పాఠక్, మంత్రి నందగోపాల్ గుప్తా నంది, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## లేహ్‌లో శాంతియుత ర్యాలీ భగ్నం

**కార్గిల్‌లో సాఫీగా నిర్వహణ**
**సెప్టెంబరు 24న ఘటనపై న్యాయ విచారణను స్వాగతించిన నాయకులు**



**లేహ్:**రాష్ట్రహోదా, రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్ కింద రక్షణ కోసం ఉద్యమం తీవ్రతరం దాల్చింది. అందులో భాగంగా లేహ్ అపెక్స్ బాడీ (ఎల్ఎబి), కార్గిల్ డెమోక్రటిక్ అలయన్స్ (కెడిఎ) సంయుక్తంగా శనివారం లేహ్‌లో శాంతియత ర్యాలీని చేపట్టగా భద్రతా దళాలు అడ్డుకున్నాయి. కఠినమైనభద్రతా చర్యలు విధించడంతో పాటు మొబైల్ ఇంటర్నెట్‌ను నిలివేశారు. అయితే, లేహ్‌లో ఆంక్షలను ఖండిస్తూ కెడిఎ నాయకులు కార్గిల్‌లో శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. సెప్టెంబర్ 24న జరిగిన కాల్పుల ఘటనలో అనేక మంది మరణించగా పలువురు గాయపడ్డారు. ఈ ఘటనపై న్యాయ విచారణ జరుపుతామని ప్రకటించడాన్ని నాయకులు స్వాగతించారు. సెప్టెంబర్ 24న చోటు చేసుకున్న హింసలో ప్రాణాలు కోల్పోయిన, గాయపడిన లేదా చట్టవిరుద్ధంగా నిర్బంధించబడిన వారికి సంఘీభావం ప్రకటించడానికి రెండు ఆందోళన గ్రూపులు ఉదయం 10 గంటల నుండి రెండు గంటల పాటు శాంతియుత ర్యాలీ, సాయంత్రం 6 గంటల నుండి లద్దాఖ్ అంతటా మూడుగంటలబ్లాక్‌అవుట్‌కు పిలుపునిచ్చిచ్చాయి. ఈ నేపథ్యంలో లేహ్, పరిసర ప్రాంతాలలో పోలీసులు, పారామిలిటరీ దళాలను మోహరించినట్లు అధికారులు తెలిపారు. శాంతిభద్రతల దృష్ట్యా లేహ్‌లో బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు విధించారు. మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. విద్యా సంస్థలను కూడా మూసివేయాలని ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. తమ డిమాండ్లను శాంతియుతంగా లేవనెత్తడానికి, శాంతియుత ర్యాలీకి పిలుపునిచ్చామని, కానీ అధికార యంత్రాంగం తమ బలాన్ని ఉపయోగించి దాని వైఫల్యాన్ని ప్రదర్శించిందని అంజుమన్ ఇమామియా అధ్యక్షుడు, ఎల్ఎబి సభ్యుడు అష్రఫ్ అలీ బర్చా విలేకరులతో వెల్లడించారు. పెద్ద ఎత్తునబలగాలను మోహరించగా, ప్రజలను ర్యాలీ చేసేందుకు గుమిగూడనివ్వలేదన్నారు. ప్రజలను ఇబ్బందులు పెట్టేలా ఇటువంటి అడ్డంకులను ఉపయోగించడం కంటే ప్రభుత్వం వారితో చర్చలు జరపాలని ఆయన అన్నారు. ఎల్ఎబి సహచైర్మన్ చెరింగ్ దోర్జాయ్‌ను కూడా గృహ నిర్బంధంలో ఉంచారని,కఠినమైనభద్రతా చర్యల దృష్ట్యా మార్చ్ జరిగే ప్రదేశానికి చేరుకోవడానికి ఎటువంటి ప్రయత్నం చేయవద్దని ప్రజలను విజ్ఞప్తి చేశారని అంజుమన్ మోయిన్ ఉల్ ఇస్లాం చీఫ్ అబ్దుల్ ఖయూమ్ పేర్కొన్నారు. తాము ఎటువంటి ఘర్షణను కోరుకోవడం లేదని, కేంద్ర ప్రభుత్వంతో చర్చలను విఫలం చేయడానికి ఎవరినీ అనుమతించమన్నారు. తాము మళ్ళీ సమావేశమై భవిష్యత్తు కార్యాచరణను నిర్ణయిస్తామని చెప్పారు. కాగా, కార్గిల్‌లో కోచైర్మన్ అస్గర్ అలీ కర్బలై, సజ్జాద్ కార్గిలితో సహా కెడిఎ నాయకుల నేతృత్వంలో వందలాది మంది ప్రధాన బజార్ గుండా హుస్సేని పార్క్ నుండి ప్రధాన బస్టాండ్ వరకు శాంతియుతంగా మార్చ్ నిర్వహించారు. అయితే లేహ్‌లో సెప్టెంబర్ 24న జరిగిన హింసపై న్యాయ విచారణకు ఆదేశించాలన్న కేంద్రం నిర్ణయాన్ని, స్వాగతిస్తున్నామని, పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌తో సహా నిర్బంధించబడిన వారందరినీ బేషరతుగా విడుదల చేయాలని, నలుగురు మరణించిన వ్యక్తుల కుటుంబాలకు, గాయపడిన వారికి తగిన పరిహారం ఇవ్వాలని ప్రభుత్వం ప్రకటించాలని తాము కోరుకుంటున్నామని సజ్జాద్ కార్గిల్ పేర్కొన్నారు. తరువాత విలేకరులతో మాట్లాడుతూ ఎల్ఎబి నాయకత్వం, లేహ్‌లోని ప్రజలపై విధించిన ఆంక్షలను కర్బలై ఖండించారు. ఇటువంటి అణచివేత చర్యలు లద్దాఖ్‌లోని శాంతిని ప్రేమించే ప్రజలకు ఆమోదయోగ్యం కాదన్నారు. తాము న్యాయ విచారణను స్వాగతిస్తున్నామని, చర్చలను తిరిగి ప్రారంభించడానికి ముందు ప్రభుత్వం మరో రెండు చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నామన్నారు. గతంలో, నేడు, రేపు చర్చలకు తాము ఎల్లప్పుడూ అనుకూలంగా ఉంటామని, ప్రభుత్వం బాధితులకు పరిహారం ప్రకటించాలని, నిర్బంధించబడిన వ్యక్తులను విడుదల చేయాలని ఆదేశించాలన్నారు. రాష్ట్ర హోదా, ఆరవ షెడ్యూల్‌ను లద్దాక్‌కు పొడిగించడంపై ప్రత్యేకంగా చర్చలు జరగాలని ఆయన అన్నారు. లద్దాఖ్ ప్రజలు అలసిపోలేదని, తలవంచడానికి సిద్ధంగా లేరని, ఎలాంటి చర్యలకు భయపడరన్నారు. తమ చట్టబద్ధమైన డిమాండ్ల కోసం ఏ రకమైన త్యాగానికైనా సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

## 'మౌని బాబా'లా మోదీ

**ప్రధానిపై కాంగ్రెస్ తీవ్ర మండిపాటు**

**రష్యా నుంచి చమురు దిగుమతులను భారత్ తగ్గిస్తుందని ట్రంప్ మరోసారి ఉద్ఘాటించినా మౌనమేల? అని ఆగ్రహం**



**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ చమత్కార వ్యాఖ్యలు చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆపరేషన్ సిందూర్‌ను ఆపేసానని లేదా భారతదేశం రష్యా నుండి చమురు దిగుమతులను తగ్గిస్తుందని చెప్పినప్పుడల్లా మోదీ అకస్మాత్తుగా 'మౌని బాబా' అవుతారని ఎద్దేవా చేసింది. భారతదేశం రష్యా నుండి చము రు దిగుమతులను తగ్గిస్తుందని తన మంచి స్నేహితుడు తనకు హామీ ఇచ్చారని అధ్యక్షుడు ట్రంప్ మరోసారి పేర్కొన్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. ఏప్రిల్–సెప్టెంబర్ 2025లో చైనాతో భారతదేశ వాణిజ్య లోటు గత సంవత్సరం ఇదే కాలంలో యుఎస్‌డి 49.6 బిలియన్లతో పోలిస్తే యుఎస్‌డి 54.4 బిలియన్లకు పెరిగిందని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయబోదని అమెరికా అధ్యక్షుడు మరోసారి చేసిన ప్రకటనల తర్వాత ఆయన జైరామ్ రమేష్ ఈ వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఇది రెండవ సారి. రష్యా ముడి చమురు సేకరణను న్యూఢిల్లీ నిలిపివేస్తుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తనకు హామీ ఇచ్చారని ట్రంప్ పేర్కొన్న కొన్ని గంటల తర్వాత, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా తన ఇంధన వనరులను విస్తృతంగా ఉపయోగిస్తున్నట్లు భారతదేశం గురువారం తెలిపింది. అస్థిర ఇంధన పరిస్థితుల్లో భారత వినియోగదారుల ప్రయోజనాలను కాపాడటం న్యూఢిల్లీ స్థిరమైన ప్రాధాన్యత అని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ట్రంప్ వ్యాఖ్యలకు ప్రతిస్పందిస్తూ అన్నారు. భారత దిగుమతి విధానాలు పూర్తిగా జాతీయ ప్రయోజనాల ద్వారా మార్గనిర్దేశం చేయబడతాయని, అమెరికాతో ఇంధన సంబంధాలను విస్తరించాలని భారతదేశం చూస్తోందని ఆయన అన్నారు. మోదీ ట్రంప్ పట్ల భయపడుతున్నారని, కీలక నిర్ణయాలను అమెరికాకు అవుట్‌సోర్స్ చేసినట్లు కనిపిస్తోందని కాంగ్రెస్ గురువారం ఆరోపించింది. మోదీ ప్రభుత్వ విదేశాంగ విధానం 'పూర్తిగా కుప్పకూలిందని' ప్రతిపక్ష పార్టీ పేర్కొంది. కేంద్రం ప్రతిపక్ష నాయకులను విశ్వాసంలోకి తీసుకోవాలని, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయడం ద్వారా లేదా వారితో వ్యక్తిగతంగా మాట్లాడటం ద్వారా వారిని విశ్వాసంలోకి తీసుకోవాలని పేర్కొంది.

## 20 మందితో సిపిఐ(ఎంఎల్) లిబిరేషన్ జాబితా విడుదల

**పాట్నా :** బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు గానూ ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్న సిపిఐ(ఎంఎల్) లిబిరేషన్ శనివారం 20 మంది అభ్యర్థులతో జాబితా విడుదల చేసింది. అందులో 12 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మరోసారి అవకాశం కల్పించింది. 2020లో విజయం సాధించలేకపోయిన అసెంబ్లీ స్థానాల్లో కొత్త వారిని బరిలోకి దింపింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ 19 స్థానాల్లో పోటీ చేసి 12 నియోజకవర్గాల్లో విజయం సాధించింది. తాము సంకీర్ణ స్ఫూర్తిని కొనసాగించాని, ఈ సారి మరిన్ని సీట్లకు అర్హులమైనప్పటికీ, చివరకు 20 అసెంబ్లీ సెగ్మెంట్లలో మాత్రమే పోటీ చేయాలని నిర్ణయించుకున్నామని పార్టీ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య అభ్యర్థుల జాబితా విడుదల చేసిన అనంతరం పిటిఐకి తెలిపారు. ఈ ఎన్నికల్లో కనీసం 24 సీట్లలో పోటీ చేయాలని అనుకున్నామని, కానీ అది కార్యరూపం దాల్చలేదని చెప్పారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో మహాఘట్‌బంధన్ భారీ మెజారిటీతో గెలుస్తుందని తనకు నమ్మకం ఉందని, ప్రస్తుత ఎన్‌డిఎ ప్రభుత్వంతో ప్రజలు విసిగిపోయారన్నారు. రెండవసారి అవకాశం దక్కిన పార్టీ ప్రముఖ ఎమ్మెల్యేలలో అమర్జీత్ కుష్వా, సత్యదేవ్ రామ్, గోపాల్ రవి దాస్, సందీప్ సౌరవ్, శివ ప్రకాష్ రనాజ్, అజీత్ కుమార్ సింగ్, బీరేంద్ర ప్రసాద్, మహబూబ్ ఆలం, దియా గౌతమ్, అనిల్ కుమార్, ఫూల్బాబు సింగ్ తదితరులు ఉన్నారు. నవంబర్ 6న మొదటి దశలో ఎన్నికలు జరగనున్న అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులందరూ ఇప్పటికే నామినేషన్లు దాఖలు చేశారని ఆయన అన్నారు. ఈ అభ్యర్థులలో భోరే స్థానం నుండి ధనంజయ్, జిరాదేయి నుండి అమర్జీత్ కుష్వా, దరౌలి నుండి సత్యదేవ్ రామ్, దరౌండా నుండి అమర్నాథ్ యాదవ్, కళ్యాణ్‌పూర్ నుండి రంజీత్ కుమార్ రామ్, వారిస్‌నగర్ నుండి ఫూల్బాబు సింగ్, రాజ్‌గిర్ నుండి బిశ్వనాథ్ చౌదరి పోటీ చేస్తున్నారని చెప్పారు. అదే విధంగా దిఘా నుండి దివ్య గౌతమ్, ఫుల్వారీ నుండి గోపాల్ రవి దాస్, పాలిగంజ్ నుండి సందీప్ సౌరవ్, అరా నుండి ఖయాముద్దీన్ అన్సారీ, అగైన్ నుండి శివ ప్రకాష్ రంజన్, తరారి నుండి మదన్ సింగ్, దుమ్రాన్ నుండి అజిత్ కుమార్ సింగ్ బరిలోకి దిగారు. 243 మంది సభ్యులున్న అసెంబ్లీకి నవంబర్ 6, 11 తేదీల్లో ఎన్నికలు జరగనున్నాయి.

## గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్‌లో అగ్నిప్రమాదం..



**న్యూఢిల్లీ :** అమృత్‌సర్–సహర్సా గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్‌లో శనివారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. పంజాబ్‌లోని అమృతసర్ నగరం నుంచి బయలుదేరిన రైల్లో శిర్హింద్ స్టేషన్ వద్ద ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. జి19 బోగీలో తొలుత పొగలు రావడాన్ని జిఆర్‌పి అధికారి ఒకరు గుర్తించారు. ఈ క్రమంలో ఓ ప్యాసెంజర్ బోగీలోని చెయిన్ లాగి రైలును ఆపేశారు. ఆ తరువాత ప్రయాణికులను సురక్షితంగా కిందకు దించేశారు. ఈ లోపు మంటల్లో చిక్కుకుని బోగీ మొత్తం తగలబడిపోయింది. సమీపంలోని మరో రెండు బోగీలకు కూడా మంటలు వ్యాపించడంతో అవి పాక్షికంగా దెబ్బతిన్నాయి. మూడు కోచ్‌లను రైలు నుంచి వేరు చేసిన సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది సాయంతో మంటలు ఆర్పేశారు. ఈ ఘటనలో ఒక వ్యక్తికి గాయమైందని రైల్వే బోర్డు ప్రకటించింది. కాలిన గాయాలైన మహిళను (32) ఫతేగఢ్ సాహిబ్‌లోని సివిల్ ఆసుపత్రికి తరలించినట్టు శిర్హింద్ జిఆర్‌బి స్టేషన్ హౌస్ ఆఫీసర్ రతన్ లాల్ తెలిపారు. మంటలను గుర్తించిన వెంటనే అధికారులు ప్రభావిత కోచ్‌లల్లోని ప్రయాణికులను ఇతర కోచ్‌లకు తరలించారని తెలిపారు. మరి కాసేపట్లో రైలు యథాతథంగా ప్రయాణాన్ని కొనసాగిస్తుందని తెలిపారు. అయితే, అగ్నిప్రమాదానికి గల కారణ మాత్రం ఇంకా తెలియాల్సి ఉంది.

### జిఎస్‌టి రేటు తగ్గింపు ప్రయోజనాలు...
## వినియోగదారులకు చేరుతున్నాయ్

**కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్**



**న్యూఢిల్లీ :** వస్తువులు, సేవల పన్ను (జిఎస్‌టి) సంస్కరణల ప్రయోజనాలు తగ్గిన ధరల రూపం లో వినియోగదారులకు చేరుతున్నాయని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. 'జిఎస్‌టి బచత్ ఉత్సవ్'పై ఆమె శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సెప్టెంబరు 22 నుండి జిఎస్‌టి అమలులోకి వచ్చిన నాటి నుండి ప్రభుత్వం దేశ వ్యాప్తంగా 54 వస్తువుల ధరల తగ్గింపును పర్యవేక్షిస్తున్నదని తెలిపారు. 'జిఎస్‌టి రేట్ల తగ్గింపు వల్ల కొనుగోళ్లు పెరిగాయి. వినియోగ డ్రైవ్ కొనసాగుతోంది' అని సీతారామన్ చెప్పారు. 'అలాంటి ప్రతీ వస్తువుపై కంపెనీలు బదిలీ చేసే ప్రయోజనాలు ఉంటాయని మేం నమ్ముతున్నాం' అని మంత్రి వివరించారు. కొన్ని వస్తువుల విషయంలో వ్యాపారాలు సగటు జిఎస్‌టి రేటు తగ్గింపు ప్రయోజనాల కంటే ఎక్కువ ప్రయోజనాలు వినియోగదారులకు అందించబడ్డాయన్నారు. జిఎస్‌టి తగ్గింపుతో ధరలు తగ్గించకపోవడంపై వినియోగదారుల వ్యవహారాల శాఖకు 3,169 ఫిర్యాదులు వచ్చాయన్నారు. వీటిలో 3,075 ఫిర్యాదులను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్ (సిబిఐసి)లోని నోడల్ అధికారులకు పంపించినట్లు మంత్రి తెలియజేశారు. ఈ డిపార్ట్‌మెంట్ మొత్తం 94ఫిర్యాదులను పరిష్కరించిందని చెప్పారు. ఫిర్యాదులు వచ్చిన ప్రాంతాల నుండి సంబంధిత జోన్ల చీఫ్ కమిషనర్లకు ఫిర్యాదులను ఫార్వర్డ్ చేయడానికి వీలుగా గ్రీవెన్స్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఈ విభాగం కార్యాచరణను ప్రారంభిస్తుందని మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. కొత్తగా తగ్గిన జిఎస్‌టి రేట్లు సెప్టెంబర్ 22 నుంచి అమలులోకి వచ్చాయని, టూత్‌పేస్ట్, షాంపూ, కార్లు, టెలివిజన్ సెట్ల వరకు 375 వస్తువుల ధరలు తగ్గించబడ్డాయి. 5, 12, 18, 28 శాతం పన్ను రేట్లను 5శాతం, 18శాతం యొక్క రెండు రేట్లుగా కలుపబడ్డాయని, ఫలితంగా రోజువారీ వినియోగ వస్తువులలో 99శాతం ధర తగ్గింది.

**ఈ ఏడాది రూ.20లక్షల కోట్ల అదనపు ఎలక్ట్రానిక్స్ వినియోగం అంచనా : అశ్వినీ వైష్ణవ్**

ప్రభుత్వం గత సంవత్సరం చేపట్టిన జిఎస్‌టి సం స్కరణల కారణంగా ఈ ఏడాది రూ. 20 లక్షల కోట్ల విలువైన అదనపు ఎలక్ట్రానిక్స్ వినియోగం జరుగుతుందని అంచనా వేయబడిందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటి మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఆయన శనివారం ఈ విషయాన్ని వెల్లడించారు. గత నవరాత్రితో పోలిస్తే అన్ని రిటైల్ చైన్ల అమ్మకాలు 20 నుండి 25 శాతం ఎక్కువగా ఉన్నాయని మంత్రి వివరించారు. 85 అంగుళాల టీవీ నిల్వలు అన్నీ పూర్తిగా అమ్ముడుపోయాయని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. జిఎస్‌టి సంస్కరణల వల్ల పొదుపుపై ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్‌తో కలిసి నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో అశ్వినీ వైష్ణవ్ మాట్లాడారు.

## జమ్ముకశ్మీర్‌కు తగిన సమయంలో రాష్ట్ర హోదా

**కేంద్ర హోంమంత్రి అమిత్‌షా**



**పాట్నా :** జమ్ముకశ్మీర్‌కు తగిన సమయంలో రాష్ట్ర హోదా కల్పిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హామీనిచ్చారు. లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతం ప్రజలు లేవనెత్తిన డిమాండ్లకు సముచిత పరిష్కారం లభిస్తుందన్నారు. శనివారం పాట్నాలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత, ఉగ్రవాద ప్రభావిత జమ్ముకశ్మీర్ తిరిగి పుంజుకుందని, గత తొమ్మిది నెలల్లో స్థానికంగా ఉగ్రవాద నియామకాలు లేవని ఆయన పేర్కొన్నారు. 1990ల నుండి వేర్పాటువాదం చెలరేగుతున్న జమ్ముకశ్మీర్ చూసిన గుణాత్మక మార్పును చూసిందని, గతంలో, సరిహద్దు అవతల నుండి ఉగ్రవాదులను పంపాల్సిన అవసరం లేదని పాకిస్తాన్ భావించి మన పిల్లల చేతుల్లో ఆయుధాలు ఉంచేవారన్నారు. ఇప్పుడు పరిస్థితి మారిపోయిందని చెప్పారు. జమ్ముకశ్మీర్ ప్రజలు తాము మొత్తం దేశానికి చెందినవారమని, మొత్తం దేశం తమకు చెందినదని భావిస్తున్నారని అమిత్ షా ఎబిపి న్యూస్, హిందూస్తాన్ నిర్వహించిన సమావేశంలో పేర్కొన్నారు. నేడు జమ్ముకశ్మీర్‌లో ప్రజాస్వామ్యం పునరుద్ధరించబడిందన్నారు. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు, శాసనసభ ఎన్నికలు కూడా జరిగాయని, రాజ్యసభ ఎన్నికలు కూడా కొంతకాలం తర్వాత జరుగుతాయని హోంమంత్రి వివరించారు. ప్రమాణ స్వీకారం చేసి ఏడాది గడిచినా రాష్ట్ర హోదా పునరుద్ధరించబడకపోవడంతో జమ్ముకశ్మీర్, న్యూఢిల్లీ మధ్య 'అంతర్భాగ్యం' మిగిలి ఉందని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా చేసిన ప్రకటన గురించి షాను ప్రశ్నించగా, 'అతను (అబ్దుల్లా) రాజకీయ బలవంతం వల్ల ఇలా చెబుతుండవచ్చు. కానీ రాష్ట్ర హోదా తగిన సమయంలో పునరుద్ధరించబడుతుంది. అది అతనితో చర్చల తర్వాత జరుగుతుంది' అని షా బదులిచ్చారు. లద్దాఖ్‌లో ఇటీవల జరిగిన ఆందోళనల గురించి, కేంద్ర ప్రభుత్వం లేహ్, కార్గిల్ కమిటీలతో చర్చలు జరుపుతోందని అని షా అన్నారు. ప్రజలు ఓపికగా ఉండాలని తాము కోరుతున్నామన్నారు. వారి న్యాయమైన డిమాండ్లన్నింటికీ మంచి పరిష్కారం ఉంటుందని చెప్పారు.

## ఢిల్లీలోని ఎంపిల నివాస సముదాయంలో అగ్ని ప్రమాదం



**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని డాక్టర్ బిషంబర్ దాస్ మార్గ్‌లో ఉన్న బ్రహ్మపుత్ర అపార్ట్‌మెంట్స్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. పార్లమెంట్ భవనం నుంచి కేవలం 200 మీటర్ల దూరంలో ఉన్న ఈ సముదాయంలో లోక్‌సభ, రాజ్యసభ ఎంపిలు నివసిస్తున్నారు. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను చేపట్టాయి. దాదాపు గంటసేపు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చాయి. రామ్‌మనోహర్ లోహియా ఆసుపత్రికి ఎదురుగా ఈ భవనం ఉంది. 2020లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ భవనాన్ని ప్రారంభించారు. 'మధ్యాహ్నం 1.22 గంటలకు, బ్రహ్మపుత్ర అ పార్ట్‌మెంట్స్‌లో అగ్నిప్రమాదం జరిగిందని మాకు కాల్ వచ్చింది. ఇది ఎత్తయిన భవ నం కాబట్టి మేము వెంటనే టిటిఎల్‌తో సహా 14 వాహనాలను పంపించాం. పై అంతస్తులు ఎక్కువగా దెబ్బతిన్నాయి. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకోవడానికి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రస్తుతం మంటలు అదుపులోకి వచ్చాయి. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి.' అని ఢిల్లీ అగ్నిమాపక విభాగం ఎడిఒ భూపేందర్ తెలిపారు.

**భయంతో పరుగులు పెట్టిన స్థానికులు**

అయితే ప్రమాదం జరిగిన కొద్ది క్షణాల్లోనే దట్టమైన పొగలు వ్యాపించాయని స్థానికులు చెబుతున్నారు. కాంప్లెక్స్‌లో మంటలు చెలరేగడంతో భయాందోళనకు గురై పరుగులు పెట్టామన్నారు. అయితే ఈ ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. కాగా, ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని సమాచారం.

**ప్రమాదంలో నా భార్య, బిడ్డలకు గాయాలు..**

''నా ఇల్లు మూడో అంతస్తులో ఉంది. మంటలు ఎలా మొదలయ్యాయో మాకు తెలియదు. నా కూతురి వివాహం కొన్ని నెలల్లో జరగనుంది. పెళ్లి కోసం కొన్న అన్ని నగలు, బంగారం, దుస్తులు లోపల ఉండిపోయాయి. ఈ ప్రమాదంలో నా భార్య, బిడ్డకు గాయాలయ్యాయి. వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు' అని బ్రహ్మపుత్ర అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి చెప్పారు.

**నా జీవితాన్ని ఇప్పుడు సున్నా నుంచి ప్రారంభించాలి!**

రాజ్యసభ ఎంపి నరేష్ బన్సల్ పిఎ కమల్ మాట్లాడుతూ 'ప్రమాదం జరిగిన సమయంలో నేను ఆఫీసులో ఉన్నాను. కాబట్టి ఈ అగ్నిప్రమాదానికి కారణమేమిటో నాకు తెలియదు. ఈ ప్రమాదంలో మేం అన్నింటినీ కోల్పోయాం. నగలు, వస్త్రాలు, వస్తువులు ముఖ్యమైన పత్రాలతో సహా అన్నింటినీ కోల్పోయాం. ఇప్పుడు నా జీవితాన్ని నేను సున్నా నుంచి ప్రారంభించాలి' అని ఆవేదన వ్యక్తం చేశారు. 'నేను పక్కనే ఉన్న ఫ్లాట్‌లో నివసిస్తున్నాను. నాకు ప్రమాదం గురించి తెలియగానే వెంటనే అక్కడికి చేరుకున్నాను. అగ్నిమాపక అధికారులు మమ్మల్ని లోపలికి అనుమతించలేదు. ఇద్దరు నుంచి ముగ్గురు పిల్లలు గాయపడ్డారని చెబుతున్నారు. ఈ ప్రాంతం ఎంపిలు ఉండే నివాస సముదాయం. అయినప్పటికీ, అగ్నిమాపక దళం ఆలస్యంగా చేరుకుంది. పండుగ సమయంలో ఇలా జరగడం చాలా పెద్ద నష్టం. ఈ ప్రాంతాన్ని ముఖ్యమంత్రి రేఖ గుప్తాను సందర్శించాలని నేను కోరుతున్నాను' అని ప్రత్యక్ష సాక్షి పూర్ణిమ తెలిపారు.


**బహిరంగ ప్రకటన**

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా! నా క్లయింటు అయిన **కొర్ర వివిఎస్ హెచ్ కుమార్ నాయిక్, తండ్రి: కొర్ర శివ,** నివాసం: ఇంటి నెం13-6-150, రైల్వే కాలని, కైకొండాయి గూడెం, ఖమ్మం జిల్లా. ఖమ్మం జిల్లా, ఖానాపురం హవేలి, ప్రశాంత్ నగర్ నివాసి అయిన గుడవర్తి రాణి W/O గుడవర్తి నాగేశ్వరావు, సదరు రాణి భర్త గారి అయిన గుడవర్తి నాగేశ్వరావు గారు గతించి యున్నారు.

నా క్లయింట్ అయిన కొర్ర వివిఎస్ హెచ్ కుమార్ నాయిక్ వారి వారసులు అయిన భార్య రాణి, కూతురు వల్లభనేని లావణ్య W/O ప్రసాద్ రావు, కుమారుడు గుడవర్తి మనోహర్‌లతో యకరం// 1.28 కుంటల భూమిని ది: 17-10-2025న ఎగ్రిమెంట్ ద్వారా క్రయం పొంది యున్నారు. నా క్లయింట్ అయిన కొర్ర వివిఎస్ హెచ్ కుమార్ నాయిక్ అట్టి వ్యవసాయ భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకొనుటకు సిద్ధంగా ఉన్నారు. కావున ఎవరికైన ఏవిధమైన అభ్యంతరంలు, ఆక్షేపణలు ఉన్నచో ఈ రోజు నుండి 7 రోజులలో సంబంధిత డాక్యుమెంట్లతో రాత పూర్వకముగా గాని, న్యాయవాది ద్వారా గాని తెలియజేయగలరని మనవి. లేనిచో ఎవరికీ ఏ విధమైన అభ్యంతరంలు లేవని తలచి క్రింది తెలిపిన షెడ్యూల్ ఆస్థిని సంబంధిత రిజిస్ట్రేషన్ వారి కార్యలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోబడును. తదుపరి వచ్చిన అభ్యంతరంలు పరిగణించబడవు.

**షెడ్యూల్ ఆస్థి :** ఖమ్మం జిల్లా, కామేపల్లి మండలం, కొండాయి గూడేం గ్రామ రెవిన్యూ లో గల సర్వే నెంబర్ 41/1 (ఓల్డ్ సర్వే నెం. 41)లో గల వ్యవసాయ భూమి యకరం //1.28 కుంటలు మెట్ట భూమికి

**సరి హద్దులు:**

**తూర్పు** : ఖమ్మం To ఇల్లందు R &B రోడ్డు
**పడమర** : గుడవర్తి సీతయ్య గారి భూమి
**ఉత్తరం** : గుడవర్తి వెంకటేశ్వర్లు గారి భూమి
**దక్షిణం** : గుడవర్తి సీతారామయ్య గారి భూమి

షేక్. లతీఫ్
న్యాయవాది, ఖమ్మం
సెల్: 9848334165



# జనరల్
STATE & REGIONAL NEWS

## సాగర్‌లో ఏపి గవర్నర్ అబ్దుల్ నజీర్ పర్యటన

**ప్రజాపక్షం/నందికొండ:** ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ శని వారం కుటుంబ సమేతంగా నాగార్జునసాగర్ ను సందర్శించారు. వీరి రాక సందర్భంగా స్థానికంగా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ముందుగా వీరు స్థానికంగా ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠ శాల ప్లే గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు చేరుకోగానే వీరికి నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జాయింట్ కలెక్టర్ నారాయణ అమిత్ లు గవర్నర్ దంపతులకు స్వాగతం పలికారు. ఆ తర్వాత వీరు పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం నేరుగా స్థానిక లాంచి స్టేషన్ కు బయలుదేరి నాగార్జున కొండను సందర్శించి అక్కడ పురావస్తు శాఖ మ్యూజియాన్ని సందర్శించి అక్కడి బుద్ధుని విశేషాలు తెలుసుకున్నారు. ఆ తర్వాత సాయంత్రం విజయవిహార్ గెస్ట్ హౌస్‌లో బస చేసి తిరిగి ఆదివారం నాగార్జునసాగర్ ప్రాజెక్టు, బుద్ధవనాన్ని సందర్శించనున్నారు.

## ప్రభుత్వాలు దిగొచ్చి బిసిల వాటా ఇవ్వాలి

**బిసి జెఎసి చైర్మన్, ఎంపి ఆర్.కృష్ణయ్య**

**మిలియన్‌మార్చ్ తరహాలో ఉద్యమం**

**త్వరలోనే భవిష్యత్తు కార్యాచరణ**



**ప్రజాపక్షం/ ఖైరతాబాద్ :** బిసి జెఎసి రాష్ట్ర బంద్ సంపూర్ణంగా, విజయవంతంగా జరిగిందని బిసి జెఎసి చైర్మన్, ఎంపి ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఖమ్మం, వరంగల్, హైదరాబాద్ ప్రాంతాల్లో చెదురుమదురు ఘటనలు తప్ప, రాష్ట్రమంతటా బంద్ ప్రశాంతంగా కొనసాగినట్టు పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్ల సాధన ధ్యేయంగా శనివారం బిసి జెఎసి రాష్ట్ర బంద్ నిర్వహించింది. ఈ బంద్‌కు అన్ని రాజకీయ పార్టీలు, 136 కుల, విద్యార్థి, యువజన సంఘాలు మద్దతిచ్చాయి. బంద్‌లో భాగంగా హైదరాబాద్, జిల్లాల్లో జెఎసి నేతలు, కార్యకర్తలు బైక్ ర్యాలీలు నిర్వహించారు. వ్యాపారసంస్థలు, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా మూసివేశారు. బస్సులు, ఆటోలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. బంద్ విజయవంతానికి కృషిచేసిన ప్రతిఒక్కరికి కృష్ణయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు శనివారం సాయంత్రం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జెఎసి వైస్ చైర్మన్ విజిఆర్ నారగోని, కో– చైర్మన్ దాసు సురేశ్, కో–ఆర్డినేటర్ గుజ్జ కృష్ణ తదితర నేతలతో కలిసి ఆర్.కృష్ణయ్య మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర బంద్ ప్రభావం ఫలితాలు తొందరలోనే వెల్లడవుతాయనిఆశాభావంవ్యక్తంచేశారు. ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగొచ్చి బిసిల న్యాయమైన కోటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. 76 ఏళ్లుగా బిసిలు అన్యాయానికి గురవుతున్నారన్నారు. బిసిలు ఎంపిటిసిలు, సర్పంచ్‌లు అవ్వడానికి కూడా రెడ్డిలకు ఇష్టంలేదన్నారు. హైకోర్టులో, సుప్రీంకోర్టులో పిటిషన్లు వేసి రిజర్వేషన్లు అడ్డుకోవడానికి కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. బిసి ఉద్యమం మరింత బలంగా మారుస్తామని తెలిపారు. త్వరలోనే బిసిలు డాక్టర్లు, న్యాయవాదుల కమిటీలు వేస్తామని, భవిష్యత్తు ఉద్యమకార్యాచరణ వెల్లడిస్తామని తెలిపారు. మిలియన్ మార్చ్ తరహాలో బిసి జెఎసి ఉద్యమం ఉంటుందని తెలిపారు. బిసిలు చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు సాధించేవరకు బిసిలు ఉద్యమిస్తారని కృష్ణయ్య తెలిపారు.

ఈ సమావేశంలో బిసి సంఘం నేతలు నీలం వెంకటేశ్, గవ్వల భరత్, బాలయ్య, రాంకోటి, రామ్మూర్తిగౌడ్, రాందేవ్ మోదీ, సి. రాజేందర్, బడే సాబ్, మణికంఠ, లలిత, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సురక్షితంగా దీపావళి జరుపుకోండి

**ఫైర్ డిజి విక్రమ్‌సింగ్ మాన్**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రజలు బాణాసంచా పేల్చే సమయంలో హానికర సంఘటనలకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకుని దీపావళి పండుగను ఆనందంగా జరుపుకోవాలని అగ్నిమాపక శాఖ డిజి విక్రమ్‌సింగ్ మాన్ కోరారు.దీపావళి సందర్భంగా టపాసులు పేల్చడం వల్ల 2023లో 164 ప్రమాదాలు చోటుచేసుకోగా గత ఏడాది 95 జరిగాయన్నారు. ఇక వంద కిలోలకుపైగా టపాసులు విక్రయించే దుకాణాలు ఈ ఏడాది 8019 నెలకొన్నాయన్నారు. దీపావళి ఉత్సవాలకు సిద్ధమౌతున్నప్రజలకుకొన్నిముఖ్య సూచనలు చేశారు.

**చేయవలసినవి..**

–లైసెన్స్ పొందిన విక్రేతల వద్ద నాణ్యమైన పటాకులు కొనుగోలు చేయండి.
–బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే పటాకులు కాల్చండి
–భవనాలు, వాహనాలు, అగ్ని పదార్థాల నుండి దూరంగా ఉండాలి.
–చటాకులు కాల్చుతున్నప్పుడు పిల్లలను పర్యవేక్షించండి.
– నీటి బకెట్లు, ఇసుక, ఫైర్ ఎక్స్టింగ్విషర్లు దగ్గర ఉంచండి.
– దీపాలు, కొవ్వొత్తులు స్థిరమైన ప్రదేశాల్లో ఉంచండి.
–విద్యుత్ అలంకరణలు చెక్ చేసుకోవాలి. డ్యామేజ్ వైర్లను ఉపయోగించవద్దు.
–పర్యావరణ హితమైన దీపాలు, తక్కువ శబ్దం చేసే పటాకులు ఉపయోగించండి.
–పటాకులు కాల్చేటప్పుడు కాటన్ లేదా అగ్ని నిరోధక వస్త్రాలు ధరించండి.
– పిల్లలు, వృద్ధులు పెంపుడు జంతువులు పటాకుల కాల్చే సమయంలో ఇంట్లోనే ఉండేలా చూడండి.

**చేయకూడనివి..**

–విద్యుత్ పరికరాలు, గ్యాస్ సిలిండర్ల దగ్గర పటాకులు కాల్చవద్దు.
–సింథటిక్ లేదా లూజ్ వస్త్రాలు ధరించి పటాకులు కాల్చవద్దు
–దీపాలు, కొవ్వొత్తులను పర్యవేక్షణ లేకుండా వదలవద్దు.
–పటాకులను ఇంట్లో లేదా వేడి వస్తువుల దగ్గర నిల్వ చేయవద్దు.
–పనిచేయని పటాకులను మళ్ళీ వెలిగించేందుకు ప్రయత్నించవద్దు.
–అలంకరణలతో అత్యవసర నిష్క్రమణ మార్గాలను అడ్డుకోవద్దు.

**అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు..**

–స్టాప్, డ్రాప్, రోల్: వస్త్రాలు అగ్నిప్రమాదానికి గురైతే, వెంటనే ఆగండి, నేలపై పడండి, చుట్టూ తిరుగుతూ మంటలను ఆర్పండి.
–పొగతో నిండిన గదిలో నుండి బయటపడే విధానం:నేల దగ్గరగా ఉండి క్రాల్ చేయండి పొగను పీల్చకుండా ఉండేందుకు.తడిన గుడ్డతో ముక్కు, నోరు కప్పుకోండి.
–తక్షణమే బయటకు వెళ్లండి; మంటలు వ్యాపించకుండా తలుపులు మూసేయండి.
**గాయాలైనప్పుడు ప్రాథమిక చికిత్స:** గాయాన్ని 1015నిమిషాలు శుభ్రమైన నీటితో చల్లగా ఉంచండి. ఐస్, వెన్న, ఆయింట్మెంట్ వంటివి రాయవద్దు.

## దొడ్డ వారు బహుదొడ్డవారు

**సురేష్ చిత్రపటానికి నివాళుర్పించిన**

**సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి**



**ప్రజాపక్షం/కోదాడ:** దొడ్డ వారి కుటుంబం బహుదొడ్డవారు, పేదల పక్షాన నిలబడి పోరాడిన చరిత్ర వారిదని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలో ఇటీవల మృతి చెందిన దొడ్డ సురేష్ సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సురేష్ వ్యక్తిత్వం ఎంతో గొప్పదని పార్టీలకు అతీతంగా అందరిని కలపుకుని ప్రయాణించడం ఆయన నైజమని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర కలిగిన కుటుంబం దొడ్డ కుటుంబమని దొడ్డ వారంటేనే కమ్యూనిస్టులన్నారు. తొలుత సురేష్ ఇంటి వద్ద చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెలికంటి సత్యం, సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి, సహాయకార్యదర్శి మండల మండవ వెంకటేశ్వర్లు, సాహెబ్‌అలీ, మండల నాయకులు కండాల శ్రీను, గుండు వెంకటేశ్వర్లు, చిలువేరు ఆంజనేయులు, దొడ్డ వెంకటయ్య, నాగేశ్వరావు, శ్రీనివాస రావు పాల్గొన్నారు.

## నిరంతర అప్రమత్తతే సరైన మార్గం

**సైబర్ క్రైమ్ డిసిపి కవిత**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రోజు రోజుకు పెరుగుతున్న క్రెడిట్ కార్డ్ మోసాలకు ప్రజలు అప్రమత్తంగాఉండాలని హైదరాబాద్ సైబర్ క్రైమ్ డిసిపి దారా కవిత హెచ్చరించారు. సైబర్ మోసగాళ్లు ఫిషింగ్, నకిలీ మర్చెంట్ వెబ్‌సైట్లు, యుపిఐ, క్యూడ్ స్కాములకు పాల్పడుతున్నారని తెలిపారు. రివార్డ్ పాయింట్ స్కాములు, క్రెడిట్ లిమిట్ ఎన్‌హాన్స్‌మెంట్ ఆఫర్లు, నకిలీ కస్టమర్ కేర్ నంబర్లు , మొబైల్ యాప్ మాల్వేర్ ద్వారా బాధితులను లక్ష్యంగా చేసుకుని దోచుకుంటున్నారని ఇలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉంటే వారి ఆటలు కట్టించవచ్చన్నారు. ప్రజలకు ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.

**సైబర్ నేరగాళ్ల తీరు ఇలా..**

ఫిషింగ్ లింకులు, నకిలీ వెబ్‌పేజీలు, ఇమెయిల్, ఎస్ఎంఎస్ లేదా సోషల్ మీడియా ప్రకటనల ద్వారా నకిలీ పేమెంట్ పేజీలకు లింకులు పంపించి, కార్డ్, ఒటిపి వివరాలను మోసగాళ్లు సేకరిస్తారు. నకిలీ కస్టమర్ కేర్ నంబర్లు, నకిలీ వెబ్సైట్లు, సోషల్ మీడియా లేదా క్లాసిఫైడ్ సైట్లలో ఫేక్ హెల్ప్‌లైన్ నంబర్లు ప్రచురిస్తారు. వీటికి కాల్ చేసినవారు నేరుగా మోసగాళ్లను కలుస్తారు. క్రెడిట్ లిమిట్ పెంపు మోసాలు ఇలా ఉన్నాయి. బ్యాంక్ క్రెడిట్ కార్డ్ విభాగం నుంచి ఫోన్ చేస్తున్నట్లు మోసగాళ్లు కాల్ చేసి, లిమిట్ పెంచుతామని చెప్పి, కార్డ్ డిటైల్స్, ఒటిపి అడుగుతారు లేదా రిమోట్ యా క్సెస్ యాప్ డౌన్లోడ చేయమంటారు. మాల్వేర్ యాప్‌లు ఎపికెలు అనధికారిక లేదా మార్చబడిన యాప్లు అనవసరమైన అనుమతులు అడిగి, కార్డ్ 'ఒటిపి' సమాచారాన్ని చోరీ చేస్తాయి. విషింగ్ కాల్ సెంటర్ మోసాలు..బ్యాంక్ లేదా మర్చెంట్ ఉద్యోగులుగా తేల్చుకొని, కార్డ్ వివరాలు, ఒటిపి, సివివి అడుగుతారు. నకిలీ కస్టమర్ కేర్ నంబర్లు ఇవ్వడం లేదా యాప్ డౌన్లోడ చేయమని చెప్పడం జరుగుతుంది. కార్డ్ స్కిమ్మింగ్ క్లోనింగ్..ఎటిఎంలు లేదా POS పాయింట్లలో కార్డ్ సమాచారం కాపీ చేసి మోసపూరిత లావాదేవీలకు వాడతారు.సిమ్ స్వాప్ మోసాలు.. బాధితుడి మొబైల్ నంబర్‌ను అధీనంలోకి తీసుకొని, ఒటిపిలను తమకు అందేలా చేసి అకౌంట్‌ను హ్యాక్ చేస్తారు.

**ప్రజలకు సూచనలు:**

–కార్డ్ మోసమైతే వెంటనే బ్యాంకునుసంప్రదించి కార్డ్ను బ్లాక్ చేయండి. వెబ్సైట్లో గానీ, సోషల్ మీడియాలో గానీ కనిపించే నకిలీ నంబర్లకు కాల్ చేయకండి. మీ కార్డ్ వెనుక ఉన్న అధికారిక నంబర్ లేదా బ్యాంకు అధికారిక యాప్, వెబ్ సైట్ ఉపయోగించండి.
–ఒటిపి, పిన్, సివివి ఫుల్ కార్డ్ నంబర్ లాంటి వివరాలు ఎవరితోనూ ఫోన్, ఇమెయిల్, మెసేజ్ లేదా సోషల్ మీడియాలో పంచుకోవద్దు. బ్యాంకులు వీటిని అడగవు.
–రీఫండ లేదా ట్రాన్సాక్షన్ ఫిక్స్ చేసేందుకు యాప్ డౌన్లోడ చేయమని ఎవరు కాల్ చేస్తే వెంటనే కాల్ కట్ చేయండి. లింకులు క్లిక్ చేయవద్దు.
–బ్యాంకింగ్, యుపిఐ, ఇమెయిల్ పాస్వర్డ్లు మార్చండి. మల్టీ ఫ్యాక్టర్ ఆథెంటికేషన్ ప్రారంభించండి.
–సిమ్ స్వాప్ అనుమానం ఉంటే, వెంటనే మీ మొబైల్ ఆపరేటర్ను సంప్రదించి సిమ్ బ్లాక్ చేయించండి.
–మీ అకౌంట్ స్టేట్‌మెంట్‌ను తరచూ చెక్ చేయండి. అనుమానాస్పద లావాదేవీలపై వెంటనే డిస్ప్యూట్ రైజ్ చేయండి.
– మోసాలకు గురైనట్లయితే తక్షణమే నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 కు కాల్ చేయండి లేదా cybercrime.gov.in వెబ్సైట్లో కంప్లయింట్ పెట్టండి.

## ప్రణాళికాబద్ధ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

**సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** అమృత్ 2.0 పథకానికి ఎంపికైన కోదాడ పట్టణాన్ని ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ అవసరమని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శనివారం మొదటి స్టైక్ హోల్డర్ సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రోడ్లు, డ్రింకింగ్ వాటర్, ఎలక్ట్రిసిటి, డ్రైనేజీ, ఇరిగేషన్, విద్య వ్యవస్థ కూడా అభివృద్ధి చెందాలని అన్నారు. అర్బన్ డెవలప్‌మెంట్ ప్లాన్ సరిగా లేకపోతే చాలా ఇబ్బందులు ఎదుర్కోవల్సి రావచ్చన్నారు. పురపాలిక, ప్రజారోగ్య, రెవెన్యూ, నీటిపారుదల, పంచాయితీరాజ్, మార్కెటింగ్, రోడ్లు భవనాలు, అటవీశాఖ, పోలీస్, ఎలక్ట్రిసిటి, విద్య, ఆర్‌టిసి, ముఖ్యప్రణాళిక, హౌజింగ్ ప్రతిశాఖ వారి శాఖకు సంబంధించిన ఖచ్చితమైన సమాచారాన్ని ప్రొఫార్మాలో పొందుపరిచి వచ్చే శనివారం కల్లా కోదాడ మున్సిపాలిటి వారికి అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, డిటిసిపి ప్రాజెక్ట్ డైరెక్టర్ అశ్విని, కోదాడ మున్సిపల్ కమీషనర్ రమాదేవి, ఆర్‌డిఓ సూర్యనారాయణ, సిపిఓ కిషన్, జిల్లా అటవీ అధికారి సతీష్, ఇండస్ట్రీస్ అధికారి సీతారాం నాయక్, మున్సిపల్ డిఈ సాయి, టిపిఓ ప్రసాద్ పాల్గొన్నారు.

## బెస్ట్ అవార్డుకు ఎంపికైన ఐటిడిఎ

**ఢిల్లీలో ప్రకటించిన రాష్ట్రపతి ముర్ము**



**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచలం ఐటిడిఏ మరోసారి బెస్ట్ అవార్డుకు ఎంపికైంది. భారత రాష్ట్రపతి ఈ అవార్డును ప్రధానం చేశారు. ఐటిడిఏ పరిధిలోని మారుమూల గ్రామాలను విజన్ 2030 నాటికి అభివృద్ధిలోనికి తీసుకొచ్చేందుకు దర్తీ అభాజాన్ జాతీయ గౌరవ అభియాన్, ఆదికర్మయోగి అభియాన్ గ్రామాలాభివృద్ధికి అధికారులు చూపిన ప్రతిభకు న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్లో ఈనెల 17న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తమ అవార్డును ప్రకటించినట్లు ఐటిడిఏ పిఓ రాహుల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దర్తీ అభాజాన్ జాతీయ అభియాన్ కార్యక్రమంలో భఆగంగా ఐటిడిఏ పరిధిలోని మారుమూల 19 మండలాల్లోని 130 గ్రామాల్లో ఆదికర్మ అభియాన్ ప్రారంభించారు.విజయ వంతం చేసేందుకు సిబ్బంది ఐదు దశాల్లో శిక్షణ కూడా ఇచ్చారు. ప్రతీ గ్రామంలో నెలకొన్న సమస్యలు వారికి కావాల్సిన మౌళిక వసతులు 65 అంశాల్లో 1341 కోట్ల ప్రతిపాదనలను తయారు చేసి పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు. సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా మెలిగి విధులు నిర్వహించి ప్రతిపాదనలు తయారు చేసి సకాలంలో పంపినందుకు ఐటిడిఏకు అవార్డు దక్కడం గర్వకారణంగా ఉందని పిఓ తెలిపారు. ఆదిఖర్మయోగి అభియాన్ బాధ్యతతో ప్రతిభ చూపిన ప్రతీ ఒక్కరినీ పిఓ అభినందించారు.

## ఐటిఐ విద్యార్థి మోరె రిషి ఆత్మహత్య

**ప్రజాపక్షం/హుజురాబాద్:** కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని ఇందిరానగర్ కాలనీలో ఐటిఐ చదువుతున్న ఓ యువకుడు ఇంట్లో ఫ్యాన్ కి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోవడంతో గ్రామంలో తీవ్ర విషాధాన్ని నింపింది. పట్టణంలోని కొత్తపల్లి ఇందిరా నగర్‌కాలనీకి చెందిన ఐటీఐ విద్యార్థి మోరె రిషి(20) తన కిరాయి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి. హుజురాబాద్ మండలం కొత్తపల్లి ఇందిరా నగర్ కాలనీకి చెందిన మోరె నాగరాజు కుమారుడు మోరె రిషి జమ్మికుంటలోని గాయత్రి ఐటిఐ కళాశాలలో ఐటిఐ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. నిరుపేద మాదిగ కులానికి చెందిన ఈ యువకుడు, ఇటీవల కాలంలో ఏదో కారణం చేత మనస్థాపానికి గురైనట్లుగా తెలుస్తుంది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం రిషి తాను నివాసముంటున్న కిరాయి ఇంట్లో ఫ్యాన్‌కు తాడుతో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ దారుణాన్ని గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే అతడిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు అతడిని పరీక్షించిన అనంతరం రిషి అప్పటికే మృతి చెందినట్లుగా నిర్ధారించారు.

**ఆత్మహత్యకు గల కారణాలు ఏంటి...?**

చిన్న వయస్సులోనే రిషి అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడటానికి గల కారణాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. రిషి తండ్రి నాగరాజు పక్షవాతంతో బాధపడుతుండగా ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో నూతనంగా ఇల్లు నిర్మించుకోవడం జరుగుతుంది. అయితే మానసిక ఒత్తిడా లేక ప్రేమ వ్యవహారాలుఅయిఉంటాయా, ఇతర కారణాలుఉ ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. మృతుని తండ్రి మోరె నాగరాజు పక్షవాతంతో ఇంట్లో ఉంటున్నారు. చేతికొచ్చిన కొడుకు మరణంతో తీరని లోటును మిగిల్చింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు విచారణ చేపట్టారు.

## 42 శాతం రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించాలి

**సిపిఐ రాష్ట్ర మాజీ కంట్రోల్ కమిషన్ సభ్యుడు**

**తమ్మెర విశ్వేశ్వర్‌రావు**

**ప్రజాపక్షం/ తొర్రూరు :** తెలంగాణ రాష్ట్రంలో బిసి కులాలకు 42 శాతం రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించాలని సిపిఐ రాష్ట్ర మాజీ కం ట్రోల్ కమిషన్ సభ్యుడు తమ్మెర విశ్వేశ్వర్‌రావు అన్నారు. శనివారం డివిజన్ కేంద్రంలో బిసి పోరాట సంఘాల రాష్ట్ర బంద్‌కు పిలుపునివ్వ గా మద్దతుగా వామపక్ష పార్టీల నేతలు విశ్రాంతి భవనం నుండి ఆర్‌టిసి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహిస్తూ నిరసన, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర నాయకులు తమ్మెర విశ్వేశ్వర్‌రావు, సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీ రన్న, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఆలకుంట్ల సా యిలు, ఊడుగుల చిన్న లింగయ్య, హెచ్.యాకయ్య, సిపిఎం నాయకులు సోమిరెడ్డిలు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రా జ్యాంగ తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చి పార్లమెంట్ ఆమోదాన్ని తీసుకోవాలని డిమాండ్ చేశారు. బిల్లుకు చట్టబద్ధత కల్పించాల్సిన కేంద్ర ప్ర భుత్వం నిర్లక్ష్యం వహిస్తుంటే ఒక రాష్ట్రంలో బిజెపి పార్టీ బందుకు మ ద్దతు ఇవ్వడం సరికాదన్నారు. రాజకీయ ద్వంద వైఖరి కాకుండా చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నా రు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ తీర్మానం చేసి చేతులు దులుపుకోవడం కాదని, రాష్ట్రంలోని అన్ని పార్టీలు, కుల సంఘాలను కలుపుకొని కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన బాధ్యత ఉందన్నారు. సీపీఐ జిల్లా సీనియర్ నాయకులు ఓమ భిక్షపతి, సిపిఎం మండల నాయకులు వెంకటేశ్వర్లు, సిపిఐ మండల కార్యదర్శి బందు మహేందర్ ఉన్నారు.

## ఫైనాన్స్ వేధింపులతో యువకుడు ఆత్మహత్య

**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** ఫైనాన్స్ వేధింపులు తట్టుకోలేక ఒక యువకుడి నిండు ప్రాణాన్ని బలిగొన్న సంఘటన సిద్దిపేట అర్బన్ మండలంలోని ఎల్లుపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. మృతుడి బంధువులు,సిద్దిపేట పట్టణ మూడవ పోలీస్ స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎల్లుపల్లి గ్రామానికి చెందిన ఐరేని మల్లేశం(30) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. 2023లో నూతనంగా నిర్మించుకున్న ఇంటి అవసర నిమిత్తం సిద్దిపేటలోని చోళ మండలం ఫైనాన్స్ కంపనీలో 7లక్షల 12వేల రూపాయలు లోన్ తీసుకున్నాడని,గత కొంత కాలంగా నెల నెలా ఈఎంఐలు చెల్లిస్తూ వస్తున్నాడు. ఇటీవల రెండు నెలల ఈఎంఐలు చెల్లించక పెండింగ్ అవడంతో గత 5రోజుల నుండి ఫైనాన్స్ వారు ఫోన్ చేయడం,ఇంటికి రావడం,ఎక్కడికైనా పనికి వెళ్తే అక్కడికి కూడా వచ్చి వేధించినట్లు మృతుడి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. డబ్బులకు కొంత ఇబ్బంది ఉంది రాగానే చెల్లిస్తానని చెప్పినప్పటికీ వినకుండా ఈ నెల 16న సాయంత్రం ఫైనాన్స్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు ఇంటికి వచ్చి డబ్బులు చెల్లిస్తేనే వెళ్తాం లేదంటే నువ్వు చచ్చినా వెళ్లం అని చెప్పడంతో మనస్తాపం చెందిన యువకుడు ఇంట్లో నుండి వెళ్లిపోయి తమ వ్యవసాయ బావి శివారులో ఉరివేసుకోని ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి తండ్రి దుర్గయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమారుడిని ఫైనాన్స్ వారు మానసికంగా హింస పెట్టడంతోనే మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడని,తన కుమారుడి మరణానికి కారణమైన ఫైనాన్స్‌పై చర్యలు తీసుకోవాలని తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు సిద్దిపేట త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

## త్వరలో బుడాపెస్ట్‌లో ట్రంప్–పుతిన్ సమావేశం

**మాస్కో:**ఉక్రేన్‌లో యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో శుక్రవారం రెండుగంటలసేపు ఫోన్ సంభాషణ చేశారు. ఈ సంభాషణ చాలా వాడీవేడీగా జరిగింది. యుద్ధం వెంటనే ఆపాలని, లేకపోతే ఉక్రేన్‌కు తోమాహక్ క్షిపణులను సరఫరా చేస్తామని పుతిన్‌కు ట్రంప్ హెచ్చరిక చేయడంతో పుతిన్ కూడా తీవ్ర పరిణామాలు సంభవిస్తాయని చెప్పినట్లు సమాచారం. మధ్యయుగాలనాటి యూరప్‌లో ఎంతో అభివృద్ధి చెందిన కివియన్ రస్ ఈనాడు ఉక్రేన్, బెలారస్, ఇతర ప్రాంతాలుగా విభజితమయ్యాయని, యూరప్, తూర్పు అరబ్ దేశాలతో వాణిజ్యంలో ఆనాడు ఈ ప్రాంతం ఎంతో ప్రసిద్ధ చెందిందంటూ గత చరిత్ర మూలాలను ట్రంప్‌కు పుతిన్ వివరించి తమ దాడులను సమర్థించుకున్నట్లు పాశ్చాత్య మీడియా సమాచారం. ఈ పరిస్థితులలో రెండు దేశాల నాయకులు మరోసారి ఉక్రేన్ సమస్యపై సవివరంగా చర్చలు జరిపేందుకు త్వరలో హంగేరీ రాజధాని బుడాపెస్ట్‌లో సమావేశం కానున్నారు. ఈ మేరకు హంగేరీ ప్రభుత్వం కూడా ఏర్పాట్లు ప్రారంభిస్తోంది. అమెరికాలోని అలాస్కా రాష్ట్రం యాంకొరేట్ మున్సిపల్ నగరంలో ఈ ఏడాది ఆగస్టు 15వ తేదీన ట్రంప్–పుతిన్ మధ్య శిఖరాగ్ర సమావేశం జరిగింది. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిసారి ఈ సమావేశం వారిద్దరి మధ్యా జరిగినప్పటికీ ఎలాంటి సానుకూల పరిష్కారం లేకుండానే చర్చలు ముగిశాయి. ఆ తర్వాత పుతిన్ ఉక్రేన్‌పై దాడులు ఉధృతం చేశారు. ట్రంప్ అసహనం ప్రకటించి జెలెన్‌స్కీవైపు మొగ్గుచూపించారు. 50 రోజుల్లో యుద్ధ పరిష్కారం చేసుకోకపోతే కఠినమైన ఆంక్షలు విధిస్తామని మరోసారి గతనెలలో రష్యాకు హెచ్చరిక చేశారు. ఇప్పుడు గాజా యుద్ధం ముగిసి శాంతి ఒప్పందం ఒక కొలిక్కి వచ్చిన తర్వాత ఉక్రేన్‌లో యుద్ధ పరిష్కారంపైనే ట్రంప్ పూర్తిగా తన దృష్టి కేంద్రీకరించారు. అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లో ఉక్రేన్‌లో యుద్ధం ఆపేస్తానని గత ఏడాది అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో అమెరికా ప్రజలకు పదే పదే చెప్పారు. కానీ అదే ఆయనకు అతిపెద్ద సమస్యగా మారింది. ఇప్పుడు మరోసారి బుడాపెస్ట్ వేదికగా రెండో విడత పుతిన్–ట్రంప్ మధ్య శిఖరాగ్ర సమావేశానికి రంగం సిద్ధం అవుతున్నది.

## ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయాన్ని సహించొద్దు

**కోర్టు భవన సముదాయ శంకుస్థాపనలో**

**హైకోర్టు న్యాయమూర్తి విజయసేన్‌రెడ్డి**




**ప్రజాపక్షం / జనగామ :**కోర్టులు అన్యాయాన్ని సహించొద్దని హైకోర్టు న్యాయమూర్తి, అడ్మినిస్ట్రేషన్ జడ్జి బి విజయ్‌సేన్ రెడ్డి అన్నారు. కోర్టుకు వచ్చే కక్షిదారులకు మెరుగైన న్యా య సేవలు అందించడానికి న్యాయమూర్తులతో పాటు న్యాయవాదులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. 80 కోట్లతో శామీర్‌పేట పరిసరాల్లోని చంపక్‌హిల్స్‌లో ని ర్మాణం చేయనున్న జిల్లా కోర్టు సముదాయ భవనానికి శనివారం హైకోర్టు జడ్జిలు నామవరపు రాజేశ్వర్‌రావు, బిఆర్ మధుసూదన్‌రావు, సుద్దాల చలపతి రావుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఉషోదయ పంక్షన్‌హాల్‌లో జరిగిన సభలో విజయ్‌సేన్‌రెడ్డి మాట్లాడారు. సొసైటీలో మంచి చెడు లు రెండు ఉంటాయని, 10శాతం మంది చెడు వ్యక్తుల వల న 90 శాతం మంచి వ్యక్తులకు నష్టం జరుగుతుందన్నారు. ఆ 10 శాతం మందిని మార్చడం కోసం, అవరమైతే శిక్షించ డం కోసం పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయవాదులు కక్షిదారులను ఇబ్బందులకు గురి చేయవద్దని, కక్షిదారులు సమస్యలు సాధ్యమైనంత వరకు పరిష్కరించాలన్నారు. అదే తరుణంలో సెటిల్‌మెంట్ దోరణి కూడా ఆసరియైంది కాదన్నారు. నూటికి 90 శాతం మంది కక్షిదారులు పేదరికానికి చెందివారేనన్నారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు కలిసి పనిచేస్తేనే సత్వర న్యాయ పరిష్కారం లభిస్తుందన్నారు. న్యాయమూర్తులు పర్మినెంట్ కాదని, న్యాయవాదులు పర్మినెంట్‌గా ఇక్కడే ఉంటామనే విషయాన్ని మరిచిపోవద్దు, న్యాయమూర్తులకు న్యాయవాదులు సమకరించాలన్నారు. ఎక్కువగా విభజించే కేలు వస్తున్నాయని, వీటిని త్వరగా తేల్చాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా కోర్టు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి బి ప్రతిమ, జిల్లా కలెక్టర్ రి జ్వాన్ బాష షేక్, ఆర్‌డిఓ గోపిరాం బారా అసోసియేషన్ అ ధ్యక్షులు హరిప్రసాద్ యాదవ్, జడ్జి విక్రంకుమార్, సీనియ ర్ న్యాయవాదులు జాన్‌రెడ్డి, ప్రసాదరావు, హరిచంద్రప్రసాద్‌తో పాటు పలువురు న్యాయమూర్తులు,పాల్గొన్నారు.

## క్రీడ

### మళ్లీ వరుణుడిదే విజయం..

**సెమీఫైనల్‌కు దూసుకెళ్లిన దక్షిణాఫ్రికా**



మహిళల ప్రపంచ కప్ మ్యాచ్‌లకు వేదికైన కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో మళ్లీ వరుణుడిదే పైచేయి అయింది. మహిళల వన్డే వరల్డ్ కప్‌లో ఇప్పటికే మూడు మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దుకాగా.. పాకిస్తాన్, న్యూజిలాండ్ పోరు కూడా సాధ్యపడలేదు. దాంతో.. అంపైర్లు మ్యాచ్ రద్దు చేయడంతో దక్షిణాఫ్రికా సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. హ్యాట్రిక్ విజయాలు సాధించిన లారా వొల్వార్డ్ బృందం 8 పాయింట్లతో రెండో బెర్తు దక్కించుకుంది. ఫలితంగా చివరి రెండు బెర్తుల కోసం ఇంగ్లండ్, భారత్, న్యూజిలాండ్ మధ్య పోటీ నెలకొంది. మహిళల ప్రపంచ కప్‌లో మరో మ్యాచ్ వరుణుడిఖాతాలో చేరింది. శనివారం కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో జరగాల్సిన పాకిస్తాన్, న్యూజిలాండ్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. మొదట 12.2 ఓవర్ వద్ద మొదలైన వాన.. ఆ తర్వాత 25వ ఓవర్ పూర్తికాగానే మరోసారి అంతరాయం కలిగించింది. వర్షం ఎంతకూ తగ్గకపోవడంతో.. అంపైర్లు మ్యాచ్ రద్దు చేసి పాక్, వైట్ ఫెరన్స్‌కు చెరొక పాయింట్ కేటాయించారు. దాంతో.. వరుసగా నాలుగు విజయాలతో 8 పాయింట్లు కలిగిన దక్షిణాఫ్రికా సెమీఫైనల్లో అడుగుపెట్టింది.

### ఆస్ట్రేలియాలో కోహ్లీ మేనియా..

**ఆటోగ్రాఫ్ కోసం అభిమానుల క్యూ..**



ప్రపంచంలోని అత్యుత్తమ బ్యాటర్ విరాట్ కోహ్లీకి ఫ్యాన్ ఫాలోయింగ్ మామూలుగా ఉండదు. ఈ స్టార్ క్రికెటర్ ఎక్కడ కనిపించినా అభిమానులు చుట్టుముట్టేసి సెల్ఫీల కోసం ఎగబడతారు. అలాంటిది ద్వైపాక్షిక సిరీస్ కోసం ఏ దేశమైనా వెళ్లాడనుకుకో.. విరాట్ ఆట చూసేందుకు స్టేడియాలకు పోటెత్తుతారు. ఇప్పుడు ఆస్ట్రేలియాలోనూ అదే పరిస్థితి కనిపిస్తోంది. అక్కడి ప్రవాస భారతీయులు, స్థానికులు వరల్డ్స్ బెస్ట్ క్రికెటర్ ఆటోగ్రాఫ్ కోసం పోటీపడుతున్నారు. ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత తొలిసారి భారత జెర్సీ వేసుకున్నాడు విరాట్ కోహ్లీ. టీ20లు, టెస్టులకు వీడ్కోలు పలికిన ఈ స్టార్ ఆటగాడు కెరీర్లో చివరిసారి ఆస్ట్రేలియా పర్యటనలో ఆడబోతున్నాడు. మూడు వన్డేల సిరీస్‌లో ఆదివారం తొలి మ్యాచ్ సన్నద్ధతలో ఉన్న విరాట్ అక్కడ తన మేనియా చూపిస్తున్నాడు. పెర్త్ వన్డే కోసం నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తున్న విరాట్‌ను చూసేందుకు అభిమానులు పోటెత్తారు. పెర్త్ స్టేడియానికి శనివారం భారీగా చేరుకున్న ఫ్యాన్స్ కోహ్లీ ఆటోగ్రాఫ్ కోసం క్యూలో నిలబడ్డారు. మాకు ఆటోగ్రాఫ్ ప్లీజ్.. మాకు ఓ ఆటోగ్రాఫ్ ప్లీజ్ అని తమ అభిమాన ఆటగాడి సంతకాన్ని సాధించారు. వారు తనపై చూపిస్తున్న అభిమానానికి ఫిదా అయిన కోహ్లీ.. ఏమాత్రం మొహమాటపడకుండా ఆటోగ్రాఫ్స్ ఇచ్చి అందరినీ ఖుషీ చేశాడు. ప్రస్తుతం క్రికెట్‌లో అభిమానులు అత్యంత విలువైనదిగా భావించేంది కోహ్లీ సంతకమే మరి. అందుకే.. తమ దేశానికి వచ్చిన అతడితో ఫొటోలు దిగడం కోసం, ఆటోగ్రాఫ్ తీసుకోవడం కోసం ఫ్యాన్స్ ఎగబడుతున్నారు.

## తొలి వన్డేకు వానగండం

**భారత్, ఆస్ట్రేలియా మ్యాచ్‌కు అంతరాయం తప్పదా!**



వన్డే ప్రపంచ కప్ సన్నద్ధతలో ఉన్న భారత జట్టు పెర్త్‌లో ఆదివారం ఆస్ట్రేలియాను ఢీకొట్టనుంది. సీనియర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు ఫామ్ చాటుకోవాలని ఆరాటపడుతుండగా.. కొత్త సారథి శుభ్‌మన్ గిల్ సిరీస్ గెలుపే లక్ష్యంగా పెట్టుకున్నాడు. మొదటి వన్డేలోనే దంచేసి తమపై నెలకొన్న అనుమానాల్ని పటాపంచలు చేయాలని 'రోకో' పట్టుదలతో ఉన్నారు. అయితే.. సిరీస్ ఓపెనింగ్ మ్యాచ్‌కు వాన ముప్పు పొంచి ఉంది. సరిగ్గా మ్యాచ్ ప్రారంభమయ్యే సరికే వాన పడే అవకాశముందని వాతావరణ శాఖ చెబుతోంది. పెర్త్‌లోని ఓప్టస్ మైదానంలో ఆదివారం ఉదయం 11:30 గంటలకు (భారత కాలమానం ప్రకారం 9:00 గంటలు) తొలి వన్డే జరుగనుంది. విజయంతో సిరీస్‌ను ఆరంభించాలని ఆతిథ్య జట్టు భావిస్తుండగా.. బోణీతో ఘనంగా పర్యటనను ప్రారంభించాలని శుభ్‌మన్ గిల్ సేన అనుకుంటోంది. అయితే.. ఇరుజట్లకు వరుణుడు షాకిచ్చేలా ఉన్నాడు. Accu Weather నివేదిక ప్రకారం.. మ్యాచ్ మొలయ్యే సమయానికే వాన పడనుంది. ఆట కొనసాగుతున్నప్పుడు వర్షం పడేందుకు 35 శాతం అవకాశాలు ఉన్నాయి. ఫలితంగా పలుమార్లు ఆటకు అంతరాయం కలగనుందని సమాచారం. దాంతో.. వరల్డ్ క్లాస్ బ్యాటింగ్ దళంతో కూడిన టీమిండియా, సొంతగడ్డపై చెలరేగే ఆసీసీ బౌలర్ల మధ్య నువ్వానేనా అన్నట్టు సాగే మ్యాచ్ పూర్తిగా సాగడంపై సందేహాలు నెలకొన్నాయి.

### టాస్ గెలిస్తే బౌలింగ్

అంతేకాదు టాస్‌పై కూడా వాతావరణ ప్రభావం పడనుంది. వర్షం పడే అవకాశాలున్నందున టాస్ గెలిచిన కెప్టెన్ బౌలింగ్‌కే ముగ్గు చూపుతారు. పిచ్ బౌలర్లకు అనుకూలించడం ఖాయం కాబట్టి .. స్వింగ్, బౌన్స్‌తో బ్యాటర్లను ఇరుకున పెట్టేందుకు పేసర్లు సిద్ధమవుతున్నారు. ఇప్పటివరకూ ఆప్టస్ మైదానంలో మూడు వన్డేలు మాత్రమే నిర్వహించారు. రెండు సందర్భాల్లో ఛేదనకు దిగిన జట్టే విజేతగా నిలిచింది. ఇక్కడ తొలి ఇన్నింగ్స్ సగటు మొత్తం.. 183కాగా.. విజయవంతంగా ఛేదించిన లక్ష్యం 153 పరుగులు మాత్రమే.

**భారత జట్టు అంచనా :** రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్(కెప్టెన్), విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, కేఎల్ రాహుల్(వికెట్ కీపర్), నితీశ్ కుమార్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రానా, అర్ష్‌దీప్ సింగ్, సిరాజ్.

**ఆస్ట్రేలియా జట్టు అంచనా :** మిచెల్ మార్ష్(కెప్టెన్), ట్రావిస్ హెడ్ మార్నస్ లబూషేన్, జోష్ ఇంగ్లిస్(వికెట్ కీపర్), మిచెల్ ఓవెన్, అలెక్స్ క్యారీ, కూపర్ కొన్నొలీ, హేజిల్‌వుడ్ మిచెల్ స్టార్క్, నాథన్ ఎల్లిస్, గ్జావియర్ బార్ట్‌లెట్.

## ఫోకస్ — బిజినెస్



### కొనసాగిన 'బుల్‌రన్'



భారత స్టాక్ మార్కెట్లు ఈవారం లాభాలు ఆర్జించాయి. 'బుల్‌రన్' కొనసాగడంతో, పలు కంపెనీల షేర్లు లాభపడ్డాయి. సోమవారం (అక్టోబర్ 13) బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ)లో 82,500.82 పాయింట్లతో ప్రారంభమైన సెన్సెక్స్ పాయింట్లు, లావాదేవీలు ముగిసే నాటికి (అక్టోబర్ 17) 83,952.19 పాయింట్లకు చేరాయి. మొత్తం మీద సెన్సెక్స్ 1,451.37 పాయింట్లు పోగు చేసుకోగా, జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ)లో నిఫ్టీ కూడా మెరుగైన ఫలితాలు నమోదు చేసింది. ఈవారం ప్రారంభంలో 25,285.35 పాయింట్లుగా ఉన్న నిఫ్టీ, 424.50 పాయింట్లు మెరుగుపడి, 25,709.85 పాయింట్ల వద్ద ముగిసింది. ప్రపంచ స్టాక్ మార్కెట్లు తీవ్రమైన ఒడిదుడుకులకు లోనైనప్పటికీ, మన దేశంలో మాత్రం స్థిరమైన పురోగతి కనిపించింది. దేశీయ మదుపరులు కొనుగోళ్లవైపు మొగ్గడం భారత మార్కెట్లకు కలిసొచ్చిన అంశం.

#### త్రైమాసిక ఫలితాలపై దృష్టి

మదుపరులు వివిధ కంపెనీల ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసిక ఫలితాలపై దృష్టి కేంద్రీకరించారు. టెక్ మహీంద్ర జులై నుంచి సెప్టెంబర్ వరకు గల త్రైమాసిక ఫలితాలను వెల్లడించిన మరుక్షణమే, స్టాక్ మార్కెట్‌లో ఆ కంపెనీ షేర్లు భారీగా పతనమయ్యాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) 16 శాతం లాభాన్ని కనబరచినప్పటికీ, చమురు ఎగుమతుల అంశం పెట్టుబడిదారులను నిరుత్సాహపరచే ప్రమాదం ఉందని అంటున్నారు. హిందుస్తాన్ జింక్, పాలీక్యాబ్, హావెల్స్ ఇండియా, జెఎస్‌డబ్ల్యూ స్టీల్, జెఎస్‌డబ్ల్యూ ఎనర్జీ, ఆర్ఇసి, ఇండియా మార్ట్, టాటా టెక్నాలజీస్, డిక్సన్ టెక్నాలజీస్,సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సియట్ టైర్స్, ఎల్‌టి టెక్నాలజీ సర్వీసెస్, తేజస్ నెట్‌వర్క్స్, దాల్మియా భారత్ వంటి 40కి పైగా ప్రముఖ కంపెనీలు తమ త్రైమాసిక ఫలితాలను ప్రకటించనున్నాయి. ఈ ఫలితాలు మార్కెట్ ధోరణిపై మరింత ప్రభావం చూప వచ్చు.

### ఈక్విటీగా విశాఖ ఉక్కు బకాయిలు



విశాఖ ఉక్కు కర్మాగారానికి ఉన్న రూ.2,400 కోట్ల విద్యుత్ బకాయిలను ఈక్విటీగా మార్చాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్లాంట్ ఆర్థిక పునరుద్ధరణకు అత్యంత కీలకమన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఈ ప్రణాళిక ద్వారా విశాఖ ఉక్కు కర్మాగారం ఆర్థిక స్థిరత్వం సాధించి, దీర్ఘకాలికంగా నిలదొక్కుకునే అవకాశాలు పెరుగుతాయని విశాఖ గాజువాక ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అంటున్నారు. ఆయన అభిప్రాయం ప్రకారం, ఈ నిర్ణయం వల్ల ప్లాంట్‌కు ఆర్థిక స్థిరత్వం లభిస్తుంది. కార్యాచరణ మరింత సులభతరం అవుతుంది. సంస్థతో పాటు దానిపై ఆధారపడిన వేలాది కుటుంబాల జీవనోపాధి భద్రంగా ఉంటుంది. అయితే ఈ నిర్ణయంపై కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. బకాయిలను ఈక్విటీలుగా మార్చినంత మాత్రాన సంస్థ బలోపేతం కాదని అభిప్రాయపడుతున్నాయి. తగినంత ఆర్థిక చేయూతతో, సంస్థను నిలబెట్టాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నాయి.

### బులియన్ మార్కెట్‌లో 'ధన్తేరస్' ఉత్సాహం..




దేశంలో అత్యంత శుభదినంగా భావించే ధన్తేరస్ సందర్భంగా శనివారం బంగారం, వెండి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. దేశవ్యాప్తంగా బంగారు దుకాణాలకు వినియోగదారులు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నప్పటికీ, బంగారం ధరలు రికార్డు స్థాయిలో ఉండటంతో గత సంవత్సరం కంటే ఈసారి వాల్యూమ్ పరంగా 15 శాతం వరకు తగ్గుదల వచ్చే అవకాశం ఉందని వాణిజ్య వర్గాలు అంచనా వేస్తున్నాయి. బంగారం, వెండి నుంచి గృహోపకరణాలు, వస్త్రాలు వరకు కొనుగోళ్లు శుభమని భావించే ఈ ధన్తేరస్ రెండు రోజుల పాటు, అంటే ఆదివారం మధ్యాహ్నం వరకు కొనసాగుతుంది. ఫలితంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ స్టోర్లలో కూడా కొనుగోళ్లు పెరుగుతాయని అంటున్నారు. ఈ ఏడాది ఢిల్లీ మార్కెట్‌లో 24 క్యారెట్ బంగారం ధర 10 గ్రాములకు పన్నులు కలుపుకుని రూ. 1,34,800కు చేరింది. గత ఏడాది అక్టోబర్ 29, 2024న జరిపిన ధన్తేరస్ సందర్భంగా ఇది రూ.81,400గా ఉంది. వెండి ప్రస్తుతం కిలోకు రూ. 1,77,000కు చేరింది. కాగా, ధన్తేరస్ ఉత్సాహం తదుపరి రోజుల్లోనూ కొనసాగుతుందని, బంగారం, వెండి అమ్మకాలు పెరుగుతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వివాహ ముహూర్తాలు ఎక్కువగా ఉన్నందువల్ల, ఈ ఏడాది చివరి నాటికి, బంగారం ధరలు రికార్డు స్థాయికి చేరినప్పటికీ, అమ్మకాలు గత ఏడాది కంటే 40 నుంచి 45 శాతం పెరిగే సూచనలు ఉన్నాయని అంటున్నారు.

ఏదిఏమైనా బంగారం ధరలు పరుగులు తీస్తునే ఉన్నాయి. బులియన్ మార్కెట్ గతంలో ఎన్నడూ లేని రీతిలో రికార్డు ధరలను నమోదు చేస్తున్నది. పండుగ సీజన్‌తోపాటు 2026 దీపావళి నాటికి 10 గ్రాముల బంగారం ధర రూ. 1.5 లక్షలకు చేరవచ్చన్న అంచనాలు వెల్లడికావడం కూడా డిమాండ్ పెరగడానికి కారణమైంది. బంగారంపై పెట్టుబడి పెట్టడానికి రెగ్యులర్ ఇన్వెస్టర్లు మాత్రమేగాక, ప్రజలు కూడా ఆసక్తి చూపడంతో ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. ప్రపంచ మార్కెట్ల పరిస్థితులు, అమెరికా రాబడులు తగ్గడం, సెంట్రల్ బ్యాంక్‌లు గోల్డ్ కొనడం, జియోపాలిటికల్ టెన్షన్లు ఇలా ఇవన్నీ గోల్డ్ భద్రమైన పెట్టుబడిగా మరింత ఆకర్షణీయంగా మార్చాయి. దేశంలో గోల్డ్ ధరలు ఇప్పటికే రికార్డు స్థాయికి చేరుకున్నప్పటికీ, యాక్సిస్ సెక్యూరిటీస్ అంచనాల ప్రకారం ఈ ర్యాలీ 2026 వరకు కొనసాగవచ్చు. అనిశ్చిత పరిస్థితులలో బంగారాన్ని అత్యంత భద్రమైన పెట్టుబడిగా భావించడమే ఇందుకు కారణం. మొత్తం ట్రెండ్ పాజిటివ్‌గా ఉన్నందున, ప్రస్తుత స్థాయిల నుంచి ఇంకో 30 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. దేశీయంగా బంగారం ధరలు 10 గ్రాములకు రూ. 1 లక్ష దాటాయి. సెంట్రల్ బ్యాంక్‌ల భారీ కొనుగోళ్లు, జియోపాలిటికల్ టెన్షన్లు పెరగడం, అలాగే అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపుపై ఉన్న అంచనాలు బంగారం, వెండి ధరల పెరగడానికి కారణమయ్యాయని అంటున్నారు. ఈ ఏడాది సెంట్రల్ బ్యాంక్‌లు సుమారు 1,000 టన్నులు గోల్డ్ కొనగలవని అంచనా. అంతర్జాతీయ ఇటిఎఫ్‌లలో గోల్డ్ ఇన్ఫ్లోలు రికార్డు స్థాయిలో ఉన్నాయి. ఇన్వెస్టర్ల ఆసక్తి పెరుగుతున్నదని అని చెప్పడానికి ఇదే నిదర్శనం. ఏ రకంగా చూసినా సమీప భవిష్యత్తులో బంగారం ధరలు తగ్గే సూచనలు కనిపించడం లేదు.

'బిజినెస్' శీర్షికన ఇస్తున్న సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. పెట్టుబడులు లేదా లాభనష్టాలపై 'ప్రజాపక్షం' ఎలాంటి బాధ్యత వహించదు. నిపుణులను సంప్రదించి, మార్కెట్ తీరును సమీక్షించుకొని, వ్యక్తిగత బాధ్యతపై నిర్ణయాలు తీసుకోవాలని సూచిస్తున్నాం.

## రీల్

### ప్రతాని రామకృష్ణ గౌడ్‌ను పరామర్శించిన హీరో సుమన్



తెలంగాణ ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు డాక్టర్ ప్రధాని రామకృష్ణ గౌడ్‌కు అనారోగ్యం చేసింది. దీంతో ఆయనకు ఆపరేషన్ చేయాల్సి వచ్చింది. స్పైన్, ఎల్ 3, ఎల్ 4, ఎల్ 5ఆపరేషన్ జరిగింది. బంజారాహిల్స్ లోని ఏషియన్ స్పైన్ హాస్పిటల్‌లో ఆయనకు ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్ విజయవంతమైంది. స్పైన్ స్పెషలిస్ట్ డాక్టర్ సుకుమార్ ఈ ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేశారు. దీంతో రామకృష్ణ ఆరోగ్యం ఇప్పుడు కుదుటపడింది. ఈ విషయాన్నీ తెలుసుకున్న ప్రముఖ హీరో సుమన్ ఆయన నివాసాయికి వెళ్లి రామకృష్ణ గౌడ్‌ను పరామర్శించారు. అలాగే తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా ప్రధాని రామకృష్ణ గౌడ్ నివాసానికి వెళ్లి ఆయన్ని పరామర్శించారు. ఆరోగ్య విషయాలపై మంత్రి ఆరా తీశారు. ప్రస్తుతం రామకృష్ణ గౌడ్ అనారోగ్యంగా తన నివాసంలో రెస్ట్ తీసుకుంటున్నారు. తన ఆరోగ్యం కుదుటపడిందని, ఇప్పుడు ఎలాంటి ఇబ్బంది లేదని ఈ సందర్భంగా ప్రధాని రామకృష్ణ గౌడ్ తెలిపారు. హీరో సుమన్, మంత్రి పొన్నం ప్రభాకర్ తన ఇంటికి వచ్చి పరామర్శించడంతో తనలో మరింత యాక్టివ్ నెస్ పెరిగిందని చెప్పారు.

### 24న బైసన్



నీలం స్టూడియోస్, అప్లాజ్ ఎంటర్టైన్మెంట్ నిర్మాణంలో, ప్రముఖ దర్శకుడు పా రంజిత్ సమర్పణలో మారి సెల్వరాజ్ దర్శకుడుగా ధృవ్ విక్రమ్ హీరోగా నటిస్తున్న చిత్రం బైసన్. ఈ చిత్రాన్ని అక్టోబర్ 24న జగదంబే ఫిలిమ్స్ ప్రొడ్యూసర్ బాలాజీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు. 1990 బ్యాక్ డ్రాప్ పీరియాడిక్ నేపథ్యంలో కబడ్డీ ఆట కథాంశంతో సాగే సినిమా ఇది. తమ గ్రామంలో ముందు కబడ్డీ పిచ్చి పుట్టాకే మనిషి పుడతాడు అని కాన్సెప్ట్ ను తెలియజేసేలా సినిమా ఉంటుంది. ఓ వైపు ఆట కోసం తను కన్న కల, మరోవైపు తీరని పగతో పాటు తండ్రీ కొడుకుల రిలేషన్‌తో సాగిన ట్రైలర్ ఆకట్టుకుంది.

### 'గోపి గాళ్ల గోవా ట్రిప్' ట్రైలర్ విడుదల



రాస్తా ఫిల్మ్స్, ఔరాఉలిస్ ఆర్ట్స్, అవ్వల్ నంబర్ ప్రొడక్షన్స్, అవంతి సినిమా సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'గోపి గాళ్ల గోవా ట్రిప్'. ఈ మూవీలో అజిత్ మోహన్, రాజు శివరాత్రి, క్యాంప్ శశి, సాయి కుమార్, పవోన్ రమేష్, మోనిక బుసం వంటి వారు నటించారు. సాయి కుమార్, సీతా రామరాజు, రమణా రెడ్డి నిర్మించిన ఈ సినిమాను రోహిత్ అండ్ శశి తెరకెక్కించారు. ఈ మూవీ ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సాయి రాజేష్, వెంకటేష్ మహా, రూపక్ ముఖ్య అతిథులుగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా సాయి రాజేష్ మాట్లాడుతూ 'రోహిత్, శశి చాలా మంచి ఫిల్మ్ మేకర్స్. వాళ్లు సినిమాను తీసిన తీరు చూసి నాకు మైండ్ బ్లాక్ అవుతూ ఉంటుంది. ఈ చిత్రానికి ఎలాంటి సహాయమైనా సరే చేసేందుకు నేను ముందుంటాను. ఇలాంటి మూవీని మీడియా కచ్చితంగా సపోర్ట్ చేయాలి. ఇలాంటి యూనిక్ కాన్సెప్ట్ చిత్రాలను అందరూ ఎంకరేజ్ చేయాలి. ఎప్పటికైనా సరే రోహిత్ అండ్ శశి పేరు చాలా గట్టిగా వినిపిస్తుంది' అని అన్నారు. ఈ కార్యక్రమంలో జగదీష్ భండారి ,దర్శకుడు రోహిత్, నిర్మాత సాయి కుమార్, డైరెక్టర్ శశి, దర్శకుడు రూపక్ తదితరులు పాల్గొన్నారు.

### అది పవర్ ఫుల్ రోల్




సుధీర్ బాబు హీరోగా నటిస్తున్న ఫాంటసీ థ్రిల్లర్ జటాధార నవంబర్ 7న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా సూపర్‌స్టార్ మహేష్ బాబు ఈ సినిమా ట్రైలర్‌ను లాంచ్ చేశారు. పురాతన కాలంలో సంపదను దాచడానికి పిశాచ బంధనం అనే ఘోర మంత్రాన్ని ఉపయోగించేవారు. ఇది ఆ సంపదను కాపాడేందుకు రాక్షసాత్మల్ని ఆహ్వానించే మంత్రం. భూతాలు లేవని నిరూపించాలనుకునే ఒక స్కెప్టిక్ ఘోస్ట్ హంటర్, ఒకరి లోభం కారణంగా ఈ బంధనాన్ని భంగం చేస్తాడు. దీంతో ధన పిశాచ అనే శాపగ్రస్త దయ్యం మేల్కొంటుంది. ఒక చిన్నారి బలి జరగబోతోందన్న భయంకర కలతో, ఆ హంటర్ ఒక దుష్ట శక్తిని అడ్డుకోవడానికి బయలుదేరుతాడు. ఈ అల్లకల్లోలానికి అర్థం కాని దశలో ప్రారంభమవుతుంది శివుడు, సృష్టి ,వినాశనానికి ప్రతిరూపమైన ఆ దివ్య శక్తి. ట్రైలర్‌లో భూతపిశాచాలు, శాపగ్రస్త ఆలయాలు, ఆధ్యాత్మిక యుద్ధాలు కళ్ళు తిప్పుకోలేని విధంగా చూపించారు. ముఖ్యంగా సుధీర్ బాబు నేలపై వున్న రక్తం త్రాగుతూ తపస్సులోకి వెళ్ళే సన్నివేశం గూస్ బంప్స్ తెప్పించింది. పాత్ర కోసం ఆయన చేసిన ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అద్భుతంగా వుంది. సోనాక్షి సిన్హా ధన పిశాచిగా అదరగొట్టింది. ట్రైలర్ రిలీజ్ సందర్భంగా హీరో సుధీర్ బాబు మాట్లాడుతూ. ట్రైలర్ లాంచ్ చేసిన మహేష్ బాబు గారికి థాంక్యూ. చిన్నప్పుడు విన్న ఓ స్త్రీ రేపు రా, లంకె బిందెలు కదలి విన్నప్పుడు చాలా థ్రిల్ ఫీల్ అవుతాం. వెంకట్ వచ్చి కథ చెప్పినప్పుడు అంతేగా థ్రిల్ అనిపించింది. ఆడియన్స్ కూడా థియేటర్స్‌లో అదే త్రిల్ ఫీల్ అవుతారు. ఈ సినిమాలో అద్భుతమైన కథ ఉంది. చాలా మంచి ఎమోషన్స్ ఉంటాయి. తప్పకుండా చాలా ఎంజాయ్ చేస్తారు. సినిమా అద్భుతంగా రావడానికి కారణమైన టీమ్ అందరికీ థాంక్యు. హీరోయిన్ సోనాక్షి సిన్హా మాట్లాడుతూ ఇది నా ఫస్ట్ తెలుగు సినిమా, చాలా స్పెషల్. ఇంత అద్భుతమైన టీంతో కలిసి పని చేయడం చాలా ఆనందంగా ఉంది. మీ అందరి సపోర్ట్ కు థాంక్యూ. జటాధర సినిమాని తప్పకుండా థియేటర్స్ చూడండి. మీ అందరికీ నచ్చుతుంది. సుదీర్ బాబు గారితో కలిసి నటించడం వండర్ఫుల్ ఎక్స్పీరియన్స్. ధన పిశాచి లాంటి రోల్ ఇప్పటివరకూ చేయలేదు. డైరెక్టర్స్‌కి థాంక్యూ. ఒక యాక్టర్‌గా ఇలాంటి క్యారెక్టర్ చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో శిల్పా శిరోద్కర్, నిర్మాత ఉమేష్ , నిర్మాత ప్రేరణ అరోరా, నిర్మాత శివిన్ నారంగ్ ,దర్శకులు వెంకట్ కళ్యాణ్ , అభిషేక్ జైస్వాల్ పాల్గొన్నారు.

### సినిమాగా వస్తున్న 'జుగారి క్రాస్' నవల



ఒకప్పుడు నవలల్ని సినిమాగా తెరపైకి తీసుకు వస్తుండేవారు. కానీ ఇప్పుడు వాటి సంఖ్య తగ్గిపోయింది. కానీ ప్రముఖ రచయిత పూర్ణచంద్ర తేజస్వి ప్రసిద్ధ నవల 'జుగారి క్రాస్'ను సినిమాగా రూపొందిస్తున్నారు. 'కరావళి'తో అందరినీ ఆకట్టుకోనున్న దర్శకుడు గురుదత్త గనిగ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. 'కరావళి' టైటిల్, టీజర్ అందరిలోనూ ఇంట్రెస్ట్ క్రియేట్ చేసిన సంగతి తెలిసిందే. 'కరావళి'లో రాజ్ బి. శెట్టి ప్రముఖ పాత్రను పోషిస్తున్నారు. ఇక ఈ మూవీ విడుదలకు ముందు గురుదత్త గనికి, రాజ్ బి. శెట్టి కాంబోలో మరో చిత్రం ప్రారంభమైంది. 'జుగారి క్రాస్'కు సంబంధించిన ప్రకటన కోసం రిలీజ్ చేసిన టైటిల్ ప్రోమో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఇందులో చూపించిన పుర్రెలు, పారే రక్తం, మారణాయుధాలు చూస్తుంటే భారీ యాక్షన్ చిత్రంగా రానున్నట్టు కనిపిస్తోంది.'సు ఫ్రమ్ సో'లో గురూజీగా ప్రేక్షకులను ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన చిత్రీకరణ త్వరలోనే ప్రారంభం కానుంది.'కరావళి' చిత్రీకరణ ఇప్పటికే పూర్తయింది. ప్రస్తుతం గురుదత్త ఇప్పుడు 'జుగారి క్రాస్' కోసం సిద్ధమవుతూనే 'కరావళి' పోస్ట్‌ప్రొడక్షన్ పనుల్లోనూ బిజీగా ఉన్నారు. 'గురుదత్త గనిగ ఫిల్మ్స్' బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కరావళి చిత్రానికి పనిచేసిన సినిమాటోగ్రాఫర్ అభిమన్యు సదానందన్ జుగారి క్రాస్‌కు కూడా విజువల్స్ అందిస్తున్నారు. ఈ చిత్రానికి సచిన్ బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. మిగిలిన నటీనటులు, సిబ్బంది వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.

### శ్రీరామ్‌గా శివాజీ ఫస్ట్ లుక్



శ్రీ శివాజీ ప్రొడక్షన్స్‌పై రెండవ ప్రాజెక్టుగా సుధీర్ శ్రీరామ్ రచన దర్శకత్వంలో నటుడు శివాజీ, లయ జంటగా నటిస్తూ ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా మరోసారి ఈటీవీ విన్‌తో కలిసి శివాజీ పనిచేస్తున్నారు. నైటీస్ వెబ్ సిరీస్‌లో శివాజీతో కలిసి నటించిన బాల నటుడు రోహన్, అలీ, ధనరాజ్ తదితరులు ఈ చిత్రంలో కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రంలో పంచాయతీ సెక్రెటరీ శ్రీరామ్‌గా కనిపించనున్న శివాజీ ఎంతో నిజాయితీపరుడైన వ్యక్తి. తప్పుని సమర్థించని మనస్తత్వం, అన్యాయాన్ని సహించలేని క్యారెక్టర్. తన వల్ల మాత్రమే కాదు, ఏ ఒక్కరి వల్ల కూడా జనం ఇబ్బంది పడకూడదు అని ఆలోచించే మనిషి. భార్య బిడ్డలే ఇతని ప్రపంచం. వాళ్ళని ప్రాణం కన్నా ఎక్కువగా ప్రేమిస్తాడు. వాళ్ళ దాకా వస్తే ప్రాణం ఇవ్వడానికైనా వెనుకాడని మనిషి. ఈ చిత్రం నుండి పోస్టర్ విడుదలైంది. గ్రామీణ వాతావరణంలో శ్రీరామ్ తన కుటుంబంతో కలిసి దీపావళి పండుగ చేసుకునేందుకుగాను దీపావళి పటాసులు తీసుకుని వెళుతున్నట్లు అర్థమవుతుంది. ఇక ఈ చిత్ర టైటిల్, చిత్రానికి సంబంధించిన ఇతర విశేషాలు త్వరలోనే వెల్లడించనున్నారు.

### క్షీణిస్తున్న పావలా శ్యామల ఆరోగ్యం

**ఆదుకోమ్మంటూ క్యారెక్టర్ ఆర్టిస్ట్ వేడుకోలు**



వెండితెరపై చిలిపి నవ్వులు పూయించిన ఆమె ముఖం ఇప్పుడు దుఃఖంతో నిండిపోయింది. ప్రేక్షకులను నవ్వించిన ఆ పెదవులు ఇప్పుడు సాయం కోసం అర్థిస్తున్నాయి. నిన్నటివరకు ప్రేక్షకులను అలరించిన సీనియర్ నటి పావలా శ్యామల ఇప్పుడు ఆస్పత్రిలో కన్నీళ్లు పెట్టుకుంటోంది. ఆమె జీవితపు చివరి దశ చిగురుటాకులా వణికిపోతోంది.తన నటనతో మల్టీ స్టార్ సినిమాల్లో చోటు సంపాదించింది. కామెడీ, భావోద్వేగం రెండింటినీ కలిపి చూపగలిగిన అరుదైన నటీమణులలో ఆమె ఒకరు. అమ్మ పాత్రల్లోనూ, అత్త పాత్రల్లోనూ, పక్కింటి అక్కగా కూడా ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేసింది. ఆంధ్రవాలా వంటి సినిమాల్లో ఆమె నటనకు ప్రేక్షకులు, విమర్శకులు సైతం శభాష్ అన్నారు. కానీ ఇప్పుడు ఆమె ఆరోగ్యం క్షీణించింది. ఆర్థికంగా కుదేలైన పరిస్థితిలో రోజులు గడపలేకపోతోంది. ఒకప్పుడు అద్దె ఇంట్లో ఉన్న ఆమె, జీవనాధారం లేక చివరకు అనాథాశ్రమంలో ఉంటోంది. అక్కడి నుంచి ఇప్పుడు ఆస్పత్రిలో చేరి సాయం కోసం ఎదురు చూస్తోంది. తన కూతురు కూడా తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో మంచానికే పరిమితమైపోయింది. ఇప్పుడైనా ఎవరో మనసున్నవాళ్లు నా కూతురికి, నాకు అండగా నిలుస్తారని ఆశిస్తున్నా అంటూ ఆమె ఆస్పత్రి బెడ్‌పై నుంచి చెప్పిన మాటలు కదిలిస్తాయి.శ్యామల కుమార్తె కూడా అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో తల్లి, కూతుళ్లను ఆదుకోవాలి ఆమె విజ్ఞప్తి చేస్తోంది. ఈ మేరకు ఓ వీడియో విడుదల చేసింది.



# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## పిడుగుపాటు.. త్రుటిలో తప్పిన ప్రమాదం



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** వీపనగండ్ల మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో ఆదర్శ కాలనీలో భయానక పరిస్థితులు నెలకొన్నాయి. బత్తుల బాలస్వామి నివాసం సమీపంలోని చెట్టుపై పిడుగు పడింది. ఈ ఘటనలో బాలస్వామి ఇంటికి పాక్షిక నష్టం ఏర్పడింది. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. పిడుగుపాటు తక్కువ దూరంలో జరగడంతో ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. పిడుగుపాటు కారణంగా ఇంటిలోని విద్యుత్ తీగలు, డిష్ వైర్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. పగలంతా ఉక్కపోతతో ఉలిక్కిపడ్డ ప్రజలకు సాయంకాలంలో చల్లని గాలులు, నల్ల మేఘాల నేపథ్యంలో ఉపశమనం లభించిన, ఆ వెంటనే వచ్చిన పిడుగుతో కలకలం రేగింది.



## అక్రమ ఇసుక డంపులు సీజ్

**ప్రజాపక్షం/పెబ్బేరు :** పెబ్బేరు మండల పరిధిలోని రాంపురం గ్రామంలో అక్రమంగా ఇసుక డంప్ చేశారని విశ్వసనీయమైన సమాచారం మేరకు పెబ్బేరు మండల తహశీల్దార్ శ్రీమంతుల మురళీధర్ దాడులు నిర్వహించి అక్రమ ఇసుకను సీజ్ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మురళి మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఇసుకను నిలువ చేయడం కానీ, అక్రమంగా రవాణా చేయటం గాని చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాఘవేంద్రరావు, పాల్గొన్నారు.

## ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత



**ప్రజాపక్షం/మాగనూర్ :** అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్టు ఎస్సై అశోక్ బాబు తెలిపారు. మండల పరిధిలో నేరెడగం వాగు నుంచి ఎలాంటి పర్మిషన్ లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌లను పోలీసులు పట్టుకొని విచారించగా అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు తెలియడంతో పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా 1.ట్రాక్టర్ నంబర్ టిజి 38 9173 డ్రైవర్ ఎర్ర బుజ్జప్ప తండ్రి ఎర్ర తాయప్ప వయస్సు (48), ఓనర్ ఎర్ర పద్మప్ప తండ్రి ఎర్ర బుజప్ప 40, 2.టిఎస్ 33 6419 బి.సురేష్ తండ్రి కుర్మప్ప వయస్సు (50), 3.టిఎస్ 06 ఇఎల్ 8807 అర్షద్ తండ్రి హాజి వయస్సు (22), ఓనర్ అజమై ఆకుల తండ్రి కతల్ సాబ్ వయస్సు (50). 4. ఎపి21 సిఎఫ్1622 కుర్మప్ప తండ్రి లక్ష్మప్ప వయస్సు (50), ఓనర్ డ్రైవర్లపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మాగనూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా ఎలాంటి పర్మిషన్ లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే అట్టి వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై అశోక్ బాబు హెచ్చరించారు.

## ట్రాక్టర్ ప్రమాదంలో మహిళ మృతి



**ప్రజాపక్షం/ఉట్కూర్ :** ఉట్కూర్ మండలం నిడుగుర్తి గ్రామంలో ట్రాక్టర్ ప్రమాదం జరగగా ఓ మహిళ మృతి చెందింది. ఎస్సై రమేష్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన అనంతమ్మ, కృష్ణారెడ్డి, మంజుల మాట్లాడుకుంటుండగా అదే సమయంలో ఆంజనేయులు అనే వ్యక్తి ట్రాక్టర్‌ను తీసే క్రమంలో అదుపుతప్పి వారి పైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలించే లోపే అనంతమ్మ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ విషయమై అనంతమ్మ మేనల్లుడు అయినా బీబక్ రామకృష్ణ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

## గ్రామస్థుల వినతి.. స్కూల్‌కు సెలవు

**ప్రజాపక్షం/దామరగిద్ద :** దామరగిద్ద మండల పరిధిలోని గడిమున్కన్‌పల్లి గ్రామంలో ''బిసి బంద్'' ప్రకటించారు. గ్రామస్థులు స్థానిక పాఠశాలకు చేరి, ప్రధానోపాధ్యాయులకి వినతిపత్రం అందజేశారు. దీంతో వెంటనే పాఠశాలకు సెలవు ముంజూరు చేశారు. కొద్ది రోజులుగా బీసీ నినాదం ఊపందుకుంది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వివిధ పార్టీ నేతలు, బిసి సంగం నాయకులు నింగం గోపాల్, తిప్పన్న, జి.మల్లికార్జున్, ఎస్. మొగులప్ప పాల్గొన్నారు.

## గోపూజ.. మాజీ ఎమ్మెల్యేకి ఆహ్వానం



**ప్రజాపక్షం/మక్తల్:** నారాయణపేట్ జిల్లా మక్తల్ మండలం పస్పుల గ్రామం సమీపంలో ఉండే గోశాల దగ్గర ఈనెల 22న జరిగే గోపూజా కార్యక్రమానికి మక్తల్ నియోజకవర్గ తొలి మాజీ శాసనసభ్యులు చిట్టెం రాంమోహన్ రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేసిన మక్తల్ మారుతి మెగా స్టోర్ యజమాని రఘుప్రసన్న భట్, బిఆర్ఎస్ పార్టీ మక్తల్ టౌన్ అధ్యక్షులు జె.చిన్న హన్మంతు, శరణప్ప, గుంటి రఘు పాల్గొన్నారు.

## జిల్లాలో ప్రశాంత వాతావరణం

### ఎస్పీ డి.జానకి పర్యవేక్షణలో సమర్థ భద్రతా ఏర్పాట్లు



**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ :** బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం వివిధ రాజకీయ పార్టీలు, బీసీ సంఘాలు, ప్రజా సంఘాలు ఇచ్చిన పిలుపుతో శనివారం మహబూబ్ నగర్ జిల్లాలో బంద్ నిర్వహించబడింది. బంద్ సందర్భంగా ప్రజలు ప్రశాంతంగా సహకరించడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. ప్రజా ఆస్తులకు లేదా ప్రభుత్వ ఆస్తులకు ఎటువంటి నష్టం జరగకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించారు. జిల్లా ఎస్పీ డి. జానకి స్వయంగా మహబూబ్ నగర్ పట్టణంలోని ప్రధాన రహదారులు, బస్ స్టాండ్ చౌరస్తా , వ్యాపార కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలను సందర్శించి పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్‌బి రత్నం, డిఎస్పీ వెంకటేశ్వర్లు, డిసిఆర్‌బి డిఎస్ పి రమణా రెడ్డి, డిటిసి డిఎస్‌పి గిరిబాబు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ వెంకటేష్, ఇతర అందరూ పోలీసు అధికారులు పాల్గొని బంద్ ను విజయవంతంగా నిర్వహించారు.

# జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు

### ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు డిమాండ్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** బిసిలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం కల్వకుర్తి పట్టణంలో ఆర్‌టిసిడిపో ముందు బిసి సబ్‌ప్లాన్ సాధనకమిటి అఖిలపక్షం ఆధ్వర్యంలో సామాజిక ప్రజాసంఘాలు నిర్వహించిన బంద్‌లో స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌తో కలిసి బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో కులగణన చేపట్టి రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు పాదయాత్రలో స్పష్టంగా తెలియజేశారని ఆ లక్ష్యసాధనలో భాగంగా తెలంగాణ రాష్ట్రం బిసి కమీషన్ ద్వారా సర్వేచేసి 42శాతం రిజర్వేషన్లకు చట్టసభల్లో తీర్మానించి గవర్నర్ ఆమోదానికి పంపించిందన్న విషయం ప్రతి ఒక్కరు గుర్తించాలని తెలియజేశారు. స్థానికసంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్ల సాధనకై బిసిసంఘాలు చేపట్టిన రాష్ట్ర బంద్‌కు అన్ని పార్టీలు తమమద్దతు తెలిపినందుకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మొదటగా రాష్ట్రంలో కులగణన చేయించి ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీల సర్వేచేయించి లెక్కలు తీసి చట్టపరంగా బిసి కమీషన్ ద్వారా బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని చట్టసభల్లో తీర్మానించి గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చి గవర్నర్ ఆమోదానికి పంపించడం జరిగిందని గుర్తు చేశారు. బిసి రిజర్వేషన్లకు కేంద్ర ప్రభుత్వం అడుగడుగునా అడ్డుపడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం వెనక్కి తీసుకోబోదని దానికి అనుగుణంగానే జాతీయస్థాయిలో రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దీనిపై వస్తున్న న్యాయపరమైన చిక్కులనుకూడా తొలగించడానికి హైకోర్టు, సుప్రీంకోర్టులో పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో జడ్పి వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజిసింగ్, మాజీసర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, మాజీమున్సిపల్ చైర్మన్లు ఎడ్మసత్యం, రాచోటిశ్రీశైలం, బిసి సబ్‌ప్లాన్ సాధనకమిటి అధ్యక్షులు మేకల రాజేందర్, అఖిలపక్ష నాయకులు కృష్ణగౌడ్, గోపాల్, అఖిలపక్ష నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సిపిఆర్ శిక్షణను సద్వినియోగం చేసుకుని ప్రాణాలు కాపాడాలి



ఎస్పీ డా.వినీత్

**ప్రజాపక్షం/నారాయణపేట్ జిల్లా :** ప్రాణ రక్షణలో సిపిఆర్ ప్రాముఖ్యత పోలీస్ సిబ్బందికి అవగాహన పోలీసు సిబ్బంది ఎల్లప్పుడు ప్రజలతో ప్రత్యక్షంగా పనిచేస్తారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించడానికి ప్రాథమిక సిపిఆర్ పద్ధతులు తెలుసుకోవడం ఎంతో అవసరం అని శిక్షణను సద్వినియోగం చేసుకుని మరింత సమర్ధవంతంగా గుండెపోటు బారిన పడిన వ్యక్తులను ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడాలని జిల్లా ఎస్పీ డా.వినీత్ పోలీసులకు సూచించారు. ఎస్పీ కార్యాలయంలో ని కాన్ఫరెన్సు హాల్లో లైఫ్ సేవర్ అసోసియేషన్ ఢిల్లీ వైద్య నిపుణులు డా.రాకేష్ సిపిఆర్ చేయు విధానంపై ప్రాక్టికల్ గా జిల్లా పోలీసులకు అవగాహన కల్పించి వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిపిఆర్ అనేది అత్యవసర సమయంలో హాస్పిటలికి వేళ్లే లోపు హార్ట్ ప్రాబ్లమ్ ఉన్న ఊపిరి పీల్చుకోవడానికి ఇబ్బందిగా ఉన్న వారికి సిపిఆర్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఎప్పుడు ఎక్కడ ఏవిధంగా ఉపయోగపడుతుందో చెప్పలేము, నిత్యం పోలీసు అధికారులు సిబ్బంది విధులు నిర్వర్తిస్తుంటారని ఎక్కడైనా ఆపద వస్తే వెంటనే వెళ్లేది పోలీసులు తర్వాత 108 డాక్టర్లని కావున ప్రతి ఒక్కరు సిపిఆర్ నేర్చుకుంటే తప్పకుండా ఒక ప్రాణాన్ని కాపాడిన వాలమవుతామని సూచించారు. నారాయణపేట జిల్లాలో హార్ట్ ఎటాక్‌తో ప్రాణాలు పోకుండా చూడాలని కావున సిపిఆర్ ప్రతి ఒక్కరు నేర్చుకుని పక్కవారికి నేర్పించాలని సూచించారు. అనంతరం డా.రాకేష్ మాట్లాడుతూ సిపిఆర్ అనేది ఛాతీ కుదింపులతో కూడిన అత్యవసర ప్రక్రియ, ఇది తరచుగా కృత్రిమ వెంటిలేషన్‌తో స్థానిక కలిపి లేదా నోటి నుండి నోటిని మాన్యువల్‌గా చెక్కు చెదరకుండా మెదడు పనితీరును మాన్యువల్‌గా కాపాడే ప్రయత్నంలో ఆకస్మిక రక్త ప్రసరణ, శ్వాసను పునరుద్దరించడానికి తదుపరి చర్యలు తీసుకోబడుతుందని అందరికి చూపించారు. ఈ కార్యక్రమంలో డియంహెచ్ఓ జయచంద్రమోహన్, స్టాఫ్ విజయ్‌కుమార్, ఆర్ఐ నరసింహ, ఎస్సైలు నరేష్, పురుషోత్తం, శివశంకర్, మద్దయ్య శ్వేత, శిరీష, జిల్లా పోలీసులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన ఉండాలి




### ఆత్మకూరు జూనియర్ సివిల్ జడ్జి జె.శిరీష

**ప్రజాపక్షం/ఆత్మకూరు :** విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆత్మకూరు జూనియర్ సివిల్ జడ్జి జె.శిరీష అన్నారు. ఈ సందర్భంగా క్షణికావేశంలో జరిగే సంఘటనలు తద్వారా పడే శిక్షణ గురించి వివరించారు. న్యాయవాదులు జీకె రాములు, డి.అశోక్ కుమార్, మక్తేశ్వర్ వివిధ చట్టాల గురించి విద్యార్థులకు వివరించారు. భారత రాజ్యాంగం ద్వారా ఏర్పడిన చట్టాల ఏర్పాటు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి, సిబ్బంది విద్యార్థినులు పాల్గొన్నారు.

## గురుకుల ఉపాధ్యాయుడికి డాక్టరేట్



**ప్రజాపక్షం/ ధన్వాడ :** ధన్వాడ మండలం కొండాపూర్ గిరిజన బాలుర గురుకుల కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్న రాజా శ్రీనాథ్ రెబ్బను శనివారం ప్రిన్సిపల్ ఎం.రాజారాం శాలువా, పూల బొకేతో సత్కరించారు. రాజా శ్రీ నాథ్ పాలమూరు యూనివర్సిటీలో సూక్ష్మ జీవ శాస్త్రంలో తన డాక్టరేట్‌ను పూర్తి చేశారు. పియూ స్నాతకోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కొండాపూర్ గురుకుల ప్రిన్సిపల్, అధ్యాపక బృందం డాక్టర్॥ రాజశ్రీనాథ్ ను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ రాజా శ్రీ నాథ్ తన వృత్తి జీవితంలో మరెన్నో అవార్డులు, రివార్డులు పొందాలని అభిలాషించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ వైస్ ప్రిన్సిపల్ సాంబయ్య నాయక్, అధ్యాపకులు లక్ష్మయ్య, పురుషోత్తం, ఉపాధ్యాయులు నరేంద్ర మూర్తి, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి ద్వంద్వ వైఖరి విడ్డూరం



ఎమ్మెల్యే మేఘారెడ్డి

**ప్రజాపక్షం/వనపర్తి న్యూ టౌన్ :** కేంద్రంలో ఉన్న బిజెపి పార్టీ రాష్ట్రంలో ఓ లాగా కేంద్రంలో మర లాగా వ్యవహరించడం తగదని రాష్ట్రంలో ఉన్న బిజెపి నాయకులు 42 శాతం బీసీ రిజర్వేషన్‌కు మద్దతు తెలుపుతూ కేంద్రంలో ఉన్న బిజెపి 42 శాతం రిజర్వేషన్లు అడ్డుకోవడం డబల్ ఇంజన్ సర్కార్ ద్వంద వైఖరి ఇట్టే అర్థమవుతుందని, 42 శాతం రిజర్వేషన్ బిల్లును ఆమోదింపచేయాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి డిమాండ్ చేశారు. వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చీర్ల విజయ్ చందర్ ఆధ్వర్యంలో చేపట్టిన బంధు కార్యక్రమంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు... వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. క్యాంపు కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా మీదుగా యూకో బ్యాంక్ చౌరస్తా గాంధీ చౌక్, డాక్టర్ బాలకష్టయ్య చౌరస్తా, శంకర్ గంజ్, ఇందిరా వివేకానంద చౌరస్తా పాలిటెక్నిక్ కొత్త బస్టాండ్ పొట్టి శ్రీరాములు చౌరస్తా రామాలయం పరుగు ర్యాలీని కొనసాగించి ఆర్టీసి డిపో మీదుగా రాజీవ్ కు చేరుకున్నారు. కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చీర్ల విజయ్ చందర్, పట్టణ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్లు, సమన్వయకర్త, లాక్కాకుల సతీష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మక్తల్:** బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు రామాంజనేయులు గౌడ్ అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష నాయకుల బంద్ సంపూర్ణంగా విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో సిపిఐ (యంఎల్) మాస్ లైన్ జిల్లా నాయకులు ఎస్ కిరణ్, ఎఐకెయుఎస్ జిల్లా నాయకులు భగవంతు, నాయకులు బండారు చంద్రశేఖర్, బీసీ రాష్ట్ర కోశాధికారి జి.రంగప్ప యాదవ్, నారాయణపేట జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ ముదిరాజ్, టియుసిఐ జిల్లా నాయకులు బుట్టో యూత్ కాంగ్రెస్ నాయకులు వేణు గౌడ్, బీసీ ఐక్యవేదిక మక్తల్ నియోజకవర్గం, యువత అధ్యక్షులు అశోక్ గౌడ్, మండల అధ్యక్షుడు రవికుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు గొలపల్లి జ్ఞానేశ్, బిసి, ఎస్సి, ఎస్టి జేఎస్ నాయకులు విరేశ్, యన్ఎస్‌యుఐ నాయకులు అప్రోజ్, కళ్యాణ్, రాజు, తదితర అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/జడ్చర్ల:** చట్టబద్ధతతో కూడిన రిజర్వేషన్లను అమలు చేశాకే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని డిమాండు చేస్తూ బీసీ, జేఏసీ కన్వీనర్ బూర్గుపల్లి కృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో బీసీ కుల, సంఘాలు, బిజెపి, బిఆర్ఎస్, సిపిఐ, సిపిఐఎం పార్టీల నాయకులు తెలంగాణ రాష్ట్ర బంద్‌లో భాగంగా జడ్చర్ల పట్టణంలో కొత్త బస్టాండ్ నుండి నిమ్మభావిగడ్డ, పాత బజార్, వరకు బైక్ ర్యాలీ, నిర్వహించారు. కొత్త బస్టాండు దగ్గర రాస్తారోకో, నేతాజీ చౌక్‌లో మానవహారం, సిగ్నల్ గడ్డ దగ్గర గల రైల్వే బ్రిడ్జి పై రాస్తారోకో కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు కళాశాలల ను వాణిజ్య వ్యాపార సంస్థలను బంద్ చేయించారు. కోడుగల్ యాదయ్య , బాలవర్ధన్ గౌడ్, నడిమింటి శ్రీనివాస్, ప్రణీల్ చందర్, మేనగ శ్రీకాంత్, తెలుగు సత్తయ్య, బాగి కృష్ణయ్య, జహంగీర్, మాజీ సర్పంచు రేణుకమ్మ, పిట్టల మురళి, జక్కా చంద్రమోహన్, పెద్ద ఆదిరాల రమేష్, శ్రీనివాస్ యాదవ్, వడ్లని శేఖర్ యాదవ్, బొల్లేమోని నిరంజన్, గౌడుగు నర్సిములు, విజయ్, యంఆర్‌పిఎస్ నాయకులు జంగయ్య, దగ్గుల బాలరాజు, లింగంపేట్ శేఖర్, జహంగీర్ పాషా, కరాటే శ్రీను, మాచారం శ్రీనివాస్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ఊట్కూర్:** ఊట్కూర్ మండలంలోని బిజ్వార్ గ్రామంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని పిడిఎస్‌యు పీవైఎల్ ఆధ్వర్యంలో బంద్‌ను జయప్రదం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐఎంఎల్ మాస్ లైన్ పీవైఎల్ నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్ధు, గ్రామ నాయకులు జి.గోవర్ధన్, ఎల్లప్ప, పిడిఎస్‌యు నాయకులు అనిల్, హనుమేష్, చింతలి రవి, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ధన్వాడ:** బీసీ, జేఏసీ పిలుపుమేరకు అఖిల పక్ష నాయకుల ఆధ్వర్యంలో ధన్వాడ మండల కేంద్రంలో అంతర్జాతీయ రహదారిపై తెలంగాణ రాష్ట్ర బంద్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సుంకు ఉమేష్ , అఖిలపక్ష నాయకులు బీసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/కృష్ణ/మాగనూర్ :** బీసీలకు 42% రిజర్వేషన్ల బిల్లులపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానానికి వ్యతిరేకంగా జేఏసీ బీసీ సంఘాల బంద్ పిలుపు మేరకు శనివారం జాతీయ రహదారి 167పై ఉమ్మడి మండలం టై రోడ్డు, మాగనూర్ చౌరస్తాలో కాంగ్రెస్, బీజేపీ, బిఆర్ఎస్, సిపిఐ, సిపిఎం, బీసీ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు, ప్రజా సంఘాలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/దామరగిద్ద :** బీసీలకు 42% రిజర్వేషన్ల బిల్లులపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానానికి వ్యతిరేకంగా జేఏసీ బీసీ సంఘాల బంద్ పిలుపు మేరకు శనివారం దామరగిద్ద మండల కేంద్రం అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. బీసీలకు న్యాయం జరిగేందుకు ప్రభుత్వం తక్షణమే రిజర్వేషన్ల అమలుకు చర్యలు తీసుకోవాలని బీసీ సంగం నేతలు డిమాండ్ చేశారు.

**ప్రజాపక్షం/బిజినేపల్లి :** మండలకేంద్రంలో బిసిబంధు విజయవంతమైంది. బిసిలకు 42శాతం రిజర్వేషన్ కల్పించేవరకు పోరాటం ఆగదని అఖిలపక్ష పార్టీలు ఏకమై బంద్‌ను విజయవంతం చేశారు. వాహనాలను, కిరాణషాపులను రాకపోకలను అడ్డుకున్నారు. అఖిల పక్ష బిసి జేఏసి, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేస్తూ బిసిలకు 42శాతం రిజర్వేషన్ అమలుచేయాలని డిమాండ్ చేస్తూ శనివారం బిజినేపల్లి మండలకేంద్రంలో నిరసన వ్యక్తంచేస్తూ వాణిజ్య వ్యాపారసంస్థలు, ప్రైవేట్ విద్యాలయాలు పూర్తిగా బంద్‌చేశారు.

**ప్రజాపక్షం/అచ్చంపేట :** బిసిలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వాలని తలపెట్టిన బిసిబంద్ పట్టణంలో సంపూర్ణంగా జరిగింది. బిసిఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం బంద్ నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీలకు అతీతంగా నియోజకవర్గంలోని అన్నిమండల గ్రామ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బిసిలకు జరుగుతున్న అన్యాయాన్ని ఎండగట్టారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ, బిఆర్ఎస్ పార్టీ నుండి మనోహర్, బిజెపి నుండి బాలాజీ, ఎస్‌టి సెల్ నుండి మంగ్యానాయక్, సిపిఐ తరపున గోపాల్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.


**ప్రజాపక్షం/వీపనగండ్ల :** కాంగ్రెస్, సిపిఎం, బీసీ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించకుండా అడ్డుకుంటున్న బిజెపి వైఖరికి నిరసనగా బిసి సంఘాలు ఇచ్చిన రాష్ట్ర బంద్ కు మద్దతుగా మండలంలో ప్రశాంతంగా బంద్ నిర్వహించి, మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. అనంతరం మండల కేంద్రంలో పాత బ్యాంక్ ముందు రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు బీరయ్య, సిపిఎం మండల కార్యదర్శి డి.బాల్‌రెడ్డి, రైతుబంధు మాజీ అధ్యక్షులు ఎత్తం కృష్ణయ్య, మండల నాయకులు రవీందర్ రెడ్డి మాట్లాడుతూ బీసీలకు రిజర్వేషన్లను ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నా బిజెపి మొండి వైఖరిని ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్ రెడ్డి, గోపి, మహేష్, బస్వరాజ్ గౌడ్, రాజశేఖర్, ఆశన్న, శ్రీను, రఘు తదితరులు ఉన్నారు.

**ప్రజాపక్షం/కొత్తకోట :** తెలంగాణ బీసీ బంద్ ఇచ్చిన పిలుపు మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ రాజకీయ, విద్యా, ఉద్యోగపరంగా ఇవ్వాలని బీసీ బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలిపిన కొత్తకోట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ సందర్భంగా మార్కెట్ కమిటి చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ 42 శాతం రాజకీయ, విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు అవకాశాలు కల్పిస్తామని చెప్పామన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నాగరపు బీచుపల్లి , టౌన్ అధ్యక్షుడు పోతులపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలనే ఆలోచనతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాపయ్య గారి కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ చర్లపల్లి శేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మాసన్నా, మాసన్న, మాజీ సర్పంచ్ శివరామ్, మాజీ ఉపసర్పంచ్ ఎన్ జే బోయేజ్, నరేందర్ సాగర్, మాజీ వార్డ్ సభ్యులు సుభాష్, అభిమన్యు, మాజీ ఎంపిటిసి సురేందర్ రెడ్డి, ఫిషర్ మ్యాన్ నంద వెంకటేష్, కురుమూర్తి నాయుడు, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/పానుగల్ :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కేటాయించాలని బీసీ సంఘాలు శనివారం తెలంగాణ బంద్‌కు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో పానుగల్ మండలంలోని కాంగ్రెస్, బిఆర్ఎస్, సిపిఎం పార్టీలు తెలంగాణ బంద్‌కు మద్దతు తెలిపి బంద్‌లో పాల్గొన్నారు. విద్యా, వ్యాపార సంస్థలను బంద్ చేయించారు. అంబేద్కర్ చౌక్ నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు ప్రజా డాక్టర్ పగిడాల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ వెంకటేష్ నాయుడు, మాజీ జెడ్పిటిసి రవికుమార్, సింగల్ విండో మాజీ వైస్ చైర్మన్ భాస్కర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెబ్బేటి విర సాగర్,బిఆర్ఎస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ నాయక్, సిపిఎం మండల కార్యదర్శి బాల్యనాయక్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు భగత్, వివిధ గ్రామాల కాంగ్రెస్, బిఆర్ఎస్, సిపిఎం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ఆత్మకూరు :** ఆత్మకూరు పట్టణంలో శనివారం బీసీ బంద్ ప్రశాంతంగా కొనసాగింది. ఉదయం మండల కేంద్రంలో అన్ని దుకాణాలు బందు నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు ఎవరికి వారు ర్యాలీ గాంధీ చౌరస్తా నందు రాస్తారోకో నిర్వహించారు. టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఎంపిడిఓ కార్యాలయం నుండి గాంధీ చౌక్ వరకు కాలినడకతో ర్యాలీగా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నుండి మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా మండల అధ్యక్షుడు పరమేష్, పట్టణ అధ్యక్షుడు నల్ల గొండ శ్రీనివాసులు నియోజకవర్గ యువజన నాయకులు తులసిరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. మండల అధ్యక్షుడు రవికుమార్ యాదవ్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. బిజెపి నుండి మండల అధ్యక్షుడు అశోక్ భూపాల్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దండు శ్రీనివాసులు నాయకులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/అమరచింత :** తెలంగాణలో బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచాలని డిమాండ్ చేస్తూ ఇచ్చిన రాష్ట్ర బంద్ ఆదివారం అమరచింతలో కాంగ్రెస్, వామపక్షాలు, బిఆర్ఎస్, బిజెపిలు విజయవంతం చేశారు. ఆరోజు ఉదయం నుంచి కాంగ్రెస్ వామపక్ష పార్టీలు పట్టణంలో ఊరేగింపు చేస్తూ బంద్‌లో పాల్గొన్నారు. అలాగే బిఆర్ఎస్, బిజెపి పార్టీలు వేరువేరుగా రాష్ట్ర బంద్‌కు మద్దతూ తెలుపుతూ ఊరేగింపు చేశారు. స్థానిక పాత బస్టాండ్‌లో కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీలు బీసీ బంద్‌కు మద్దతు తెలుపుతూ ఆయా పార్టీల నాయకులు ఆయూబ్ ఖాన్, అబ్రహం, జిఎస్ గోపి, సి.రాజులు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న బీసీ రిజర్వేషన్‌లపై ద్వంద వైఖరిని ఖండించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు అరుణ్ కుమార్, తిరుమలేష్, శ్యాంసుందర్, భాస్కర్, బి.వెంకటేష్, ఆర్ ఎన్ రమేష్, రాజు, భక్తరాజ్, బిఆర్ఎస్, బిజెపి నాయకులు నరసింహులు గౌడ్, బాలరాజు, అబ్రహం, రమేష్, నాగభూషణంగౌడ్, మేరువ రాజు, క్యామ భాస్కర్, అనిల్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.





# స్థానికం

REGIONAL NEWS

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## ప్రభుత్వవిప్‌కు వినతి పత్రం



**ప్రజాపక్షం/ఆత్మకూర్(యం) :** ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్యను వారి క్యాంప్ కార్యాలయంలో కలిసి అభివృద్ధి పనులకు రోడ్లు మంజూరు చేయాలని వినతి పత్రాన్ని మండల నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మకూర్ మార్కెట్ యార్డ్ నుంచి కామునిగూడెం వరకు తిమ్మాపురం ఎక్స్ రోడ్డు నుంచి బస్టాండ్ మీదుగా సబ్ స్టేషన్ వరకు బీటీ రోడ్లు తక్షణమే మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ అంశంపై స్పందించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తాజాగా మంజూరు చేసే రోడ్లలో వీటికే తొలి ప్రాధాన్యతగా తీసుకుంటాను' అని హామీ ఇచ్చారనీ వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్, మాజీ సర్పంచ్ యాస లక్ష్మారెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పోతగాని మల్లేశం, ఓబిసి సెల్ మండల అధ్యక్షులు బత్తిని ఉప్పలయ్య పాల్గొన్నారు.



## దొడ్డ వారు బహుదొడ్డవారు

### సురేష్ చిత్రపటానికి నివాళుర్పించిన సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/కోదాడ:** దొడ్డ వారి కుటుంబం బహుదొడ్డవారు, పేదల పక్షాన నిలబడి పోరాడిన చరిత్ర వారిదని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలో ఇటీవల మృతి చెందిన దొడ్డ సురేష్ సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సురేష్ వ్యక్తిత్వం ఎంతో గొప్పదని పార్టీలకు అతీతంగా అందరిని కలపుకుని ప్రయాణించడం ఆయన నైజమని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర కలిగిన కుటుంబం దొడ్డ కుటుంబమని దొడ్డ వారంటేనే కమ్యూనిస్టులన్నారు. తొలుత సురేష్ ఇంటి వద్ద చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెలికంటి సత్యం, సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి, సహాయకార్యదర్శి మండల మండవ వెంకటేశ్వర్లు, సాహెబ్‌అలీ, మండల నాయకులు కండాల శ్రీను, గుండు వెంకటేశ్వర్లు, చిలువేరు ఆంజనేయులు, దొడ్డ వెంకటయ్య, నాగేశ్వరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## మక్కా యాత్ర విజయవంతం కావాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మక్కా యాత్ర విజయవంతం కావాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం రాత్రి బంగారుగడ్డలోని మదర్సాలో ఉమ్రా యాత్రకు వెళ్లే ముఫ్తీ ఇమ్రాన్, మౌజం ఇషాక్, హఫీజ్ షాకీర్, అశ్వక్, ఇస్మాయిల్‌లకు ఆయన శాలువా కప్పి పూలదండలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లీం సాంప్రదాయాల్లో మక్కా యాత్ర చాలా పవిత్రమైందని ప్రతి ఒక్కరు యాత్ర చేయాలని ప్రయత్నిస్తారని, అందరికి అవకాశం దొరకదని అవకాశం వచ్చిన వారు మాత్రమే విజయవంతంగా యాత్ర చేసుకోని మిర్యాలగూడ నియోజకవర్గ ప్రజలు సంతోషాలతో ఉండే విధంగా ప్రార్థనలు చేయాలని కోరారు. దేవుడు అవకాశం ఇస్తే తాను కూడా మక్కా యాత్రను పూర్తి చేసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో ఖారీ నిజాముద్దీన్, మౌలానా యాసిర్, మౌలానా ఖదీర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు, షేక్ జావెద్, దేశిడి శేఖర్‌రెడ్డి, షేక్ అజారుద్దీన్, ఎండి.ఇలియాజ్, నాయకులు మోయిజ్, ముఫ్తీ ఇషాక్ సలీం తదితరులు పాల్గొన్నారు.

## బాక్సింగ్ పోటీల్లో లిటిల్ ఫ్లవర్ విద్యార్థుల ప్రతిభ




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** బిఎంఎస్ ఆర్ట్స్ అకాడమి మిర్యాలగూడ ఫౌండర్ కమ్ ఛైర్మన్ మాస్టర్ మధు ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే ప్రతిభా ప్రదర్శనలో స్థానిక హౌజింగ్‌బోర్డులోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థులు వివిధ విభాగాల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించి, చూపరులను ఆకట్టుకున్నారు. ఇందులో ఎ.భవిత్ ఫైటింగ్‌లో, కటాలో స్వర్ణ పథకం, బి.దేవాంశ్ కటాలో కాంస్య పతకం, బి.భవిష్య కటాలో స్వర్ణ పతకం, పి.శ్రవణ్‌కుమార్ ఫైటింగ్, కటాలో స్వర్ణ పతకాలను కైవసం చేసుకున్నారు. శనివారం స్కూల్ ఆవరణలో ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రిన్సిపాల్ కెకె.జయరాజన్ అభినందించి మాట్లాడారు. ఇటువంటి మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకోని మంచి మెడల్స్‌త సాధించడమే కాకుండా ఆత్మరక్షణకు, ఆత్మ విశ్వాసానికి ఎంతో ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కెకె.జిన్సీజయరాజన్, హెచ్‌ఎం సుజయ్‌కుమార్, పీఈటీలు రమేష్, శివశంకర్, సిబ్బంది ఉన్నారు.

## బహిరంగ వేలం ధర తగ్గింపు



**ప్రజాపక్షం/చిట్యాల :** నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలో వ్యవసాయ మార్కెట్ కమిటి స్థలంలో నిర్మించిన దుకాణ సముదాయాల బహిరంగ వేలం ధరను తగ్గించినట్లు మార్కెట్ కమిటి చైర్‌పర్సన్ నర్రా వినోద మోహన్ రెడ్డి తెలిపారు. శనివారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వేలం ధర మార్కెట్ శాఖ జాయింట్ డైరక్టర్ ఆదేశాల మేరకు రూ. 30వేలుగా, ధరఖాస్తు ఫారంకు రూ. 2000 నిర్ణయించడం జరిగిందని అన్నారు. కాగా ప్రజల అభ్యర్థన మేరకు తమ పాలకవర్గం స్థానిక శాసనసభ్యులు వేముల వీరేశం, జాయింట్ డైరక్టర్ల దృష్టికి తీసుకెళ్ళి వాటిని రూ. 20వేలు, రూ. 1000 వరకు తగ్గింపజేశామని అన్నారు. ఈ విషయాన్ని పట్టన ప్రజలు గమనంలోకి తీసుకుని ఈ నెల 25న 30 దుకాణాల కోసం జరిగే వేలం పాటలో అవసరమున్న వారు పాల్గొనగలరని వినోద సూచించారు. ఎంఎల్‌ఏ వీరేశానికి ఆమె ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి కార్యదర్శి జానయ్య, డైరక్టర్ బూరుగు కృష్ణ, కాంగ్రెస్ నాయకులు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

**ప్రజాపక్షం/డిండి:** ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డిండి ఎస్ఐ బాలకృష్ణ అన్నారు. శుక్రవారం రాత్రి తాటికోల్ వాగు నుండి అక్రమ ఇసుక రవాణా చేస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను మండల పరిధిలోని చెరుకుపల్లి స్టేజ్ వద్ద పట్టుకొని ఇసుక తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# ప్రజా కోర్టులో బిజెపిని నిలబెట్టాలి

### బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

### ఎమ్మెల్యే బాలునాయక్, పల్లా నర్సింహారెడ్డి

### ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా అఖిలపక్షం ఆధ్వర్యంలో బంద్ విజయవంతం

### బిసిలందరి సహకారంతో రిజర్వేషన్లు ప్రభుత్వ విప్ విప్ బీర్ల ఐలయ్య







మిర్యాలగూడలో...

**ప్రజాపక్షం/దేవరకొండ:** ప్రజాకోర్టులో బిజెపిని నిలబెట్టాలని అప్పుడే బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు సాధ్యమవుతాయని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు వడ్త్య రమేష్‌నాయక్‌లు అన్నారు. శనివారం బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకై తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బిసి జేఏసి బంద్ పిలుపు మేరకు దేవరకొండ పట్టణంలో వ్యాపార, ప్రజా రవాణా, విద్య, బ్యాంకింగ్ అన్ని రకాల సముదాయాలను సిపిఐ, కాంగ్రెస్, బిఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించి అనంతరం 167వ జాతీయ రహదారిపై జరిగిన బంద్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిసి రిజర్వేన్లను కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్‌లో చేర్చాలని, బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని బిసి రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ ఉద్యమ తరహాలోనే ఒక సామాజిక ఉద్యమంగ్గా ముందుకు సాగాలని సూచించారు. బిసి బిల్లులను ఆమోదించి, రిజర్వేషన్లను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపైన ఉందని స్పష్టం చేశారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు జీవోతో పాటు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ మీద హైకోర్టు స్టే విధించడంతో, రిజర్వేషన్ల అమలు, స్థానిక సంస్థల ఎన్నికలు నిలిచిపోయాయి. ఈకార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి నూనె రామస్వామి, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు, యూనుస్, వెంకటయ్య, ఎన్‌విటి, ఆంజనేయులు, రంగారెడ్డి, వెంకట్రాములు, యాదయ్య, వెంకటయ్య, శివకుమార్, గోపి, వెంకటయ్య, జ్యోతిబస్, నగేష్, మైనోద్దిన్, మల్లేష్, పుల్లయ్య, భూపాల్‌రెడ్డి, గోవర్ధన్, వెంకటయ్య, సతీష్, రమేష్, ప్రజా సంఘాలు, కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** బిసి రిజర్వేషన్లకు తెలంగాణలో ఉన్న వర్గాలపై పోరాటం నిరంతరంగా చేయాల్సిన అవసరం ఉందని వివిధ పార్టీల బీసీ నాయకులు అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీసీ సమన్వయకర్త మెరుగు మధు, మాటూరి అశోక్‌ల ఆధ్వర్యంలో బిసి జేఏసీ బంద్ సందర్భంగా బిజెపి, కాంగ్రెస్, టిఆర్‌ఎస్, సిపిఐ, సిపిఎం, బీఎస్పీ దలిత సంఘాలు, మైనార్టీ సంఘాలు, బంద్‌లో పాల్గొని విజయవంతం చేశారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గొట్టిపాముల బాబురావు కార్యక్రమానికి హాజరైన ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య బీసీలందరు సహకారంతో రిజర్వేషన్లు సాధించుకోవాల్సిన బాధ్యత మన సమాజంపైన ఉందని తెలిపారు. సంక్షేమ శాఖ, ఫైనాన్సు కమిషన్ కార్పొరేషన్ చైర్మన్ ఒంద్రు శోభారాణి మాట్లాడుతూ రిజర్వేషన్ సాధించేవరకు ఐక్యంగా నిలవాలి అన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి ఇమ్రాన్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పనిచేస్తున్న వారందరినీ హెచ్చరించారు.

## ప్రణాళికాబద్ధ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** అమృత్ 2.0 పథకానికి ఎంపికైన కోదాడ పట్టణాన్ని ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ అవసరమని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శనివారం మొదటి స్టైక్ హోల్డర్ సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రోడ్లు, డ్రింకింగ్ వాటర్, ఎలక్ట్రిసిటి, డ్రైనేజీ, ఇరిగేషన్, విద్య వ్యవస్థ కూడా అభివృద్ధి చెందాలని అన్నారు. అర్బన్ డెవలప్‌మెంట్ ప్లాన్ సరిగా లేకపోతే చాలా ఇబ్బందులు ఎదుర్కోవల్సి రావచ్చున్నారు. పురపాలిక, ప్రజారోగ్య, రెవెన్యూ, నీటిపారుదల, పంచాయితీ రాజ్, మార్కెటింగ్, రోడ్లు భవనాలు, అటవీశాఖ, పోలీస్, ఎలక్ట్రిసిటి, విద్య, ఆర్‌టిసి, ముఖ్యప్రణాళిక, హౌజింగ్ ప్రతిశాఖ వారి శాఖకు సంబంధించిన ఖచ్చితమైన సమాచారాన్ని ప్రొఫార్మాలో పొందుపరిచి వచ్చే శనివారం కల్లా కోదాడ మున్సిపాలిటి వారికి అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, డిటిసిపి ప్రాజెక్ట్ డైరెక్టర్ అశ్విని, కోదాడ మున్సిపల్ కమీషనర్ రమాదేవి, ఆర్‌డిఓ సూర్యానారాయణ, సిపిఓ కిషన్, జిల్లా అటవీ అధికారి సతీష్, ఇండస్ట్రీస్ అధికారి సీతారాం నాయక్, మున్సిపల్ డిఈ సాయి, టిపిఓ ప్రసాద్ పాల్గొన్నారు.



## సాగర్‌లో ఎపి గవర్నర్ పర్యటన

**ప్రజాపక్షం/నందికొండ:** ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ శనివారం కుటుంబ సమేతంగా నాగార్జునసాగర్ ను సందర్శించారు. వీరి రాక సందర్భంగా స్థానికంగా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ముందుగా వీరు స్థానికంగా ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల ప్లే గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు చేరుకోగానే వీరికి నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జాయింట్ కలెక్టర్ నారాయణ అమిత్‌లు గవర్నర్ దంపతులకు పుష్పగుచ్చం ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత వీరు పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం నేరుగా స్థానిక లాంచి స్టేషన్ కు బయలుదేరి నాగార్జున కొండను సందర్శించి అక్కడ పురావస్తు శాఖ మ్యూజియాన్ని సందర్శించి అక్కడి బుద్ధుని విశేషాలు తెలుసుకున్నారు. ఆ తర్వాత సాయంత్రం తెలంగాణ పర్యాటక శాఖ విజయ విహార్ గెస్ట్ హౌస్‌లో బస చేసి తిరిగి ఆదివారం ఉదయం నాగార్జునసాగర్ ప్రాజెక్టు, బుద్ధవనాన్ని సందర్శించి మధ్యాహ్నం మూడు గంటలకు ఆంధ్రప్రదేశ్ బయలుదేరనున్నారు.

## స్కూల్ పిల్లల బస్ డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలి

### నల్లగొండ డిఎస్‌పి కె. శివరాంరెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** స్కూల్ పిల్లల బస్ డ్రైవర్లు అన్ని జాగ్రత్తలు తీసుకొని బాధ్యతతో వాహనం నడపాలని నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి సూచించారు. జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ ఆదేశానుసారం శనివారం నల్లగొండ సబ్ డివిజన్ లోని ప్రైవేట్ స్కూల్ బస్సుల డ్రైవర్లతో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ఇటీవల ప్రైవేటు పాఠశాలలకు చెందిన బస్సులు ప్రమాదాలకు గురవుతున్న ఘటనలు గుర్తు చేస్తూ, ఈ ప్రమాదాలలో ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన విషాదకర సంఘటనలు మనందరినీ కలిచి వేశాయన్నారు.ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని విద్యార్థుల భద్రత కు సంబంధించి స్కూలు యాజమాన్యం డ్రైవర్ల ఎంపికలో సరైన రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, సీనియార్టీ ఉన్న డ్రైవర్లను నియమించాలని సూచించారు. డ్రైవర్ తో పాటు బస్సులో ఒకరు కేర్ ఉండే విధంగా చూసుకోవాలని కోరారు. తప్పనిసరిగా బస్ కు డాష్ బోర్డు కెమెరా ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఏదేని ప్రమాదం జరిగితే ఎవిడెన్స్ లాగా పనికి వస్తుందని సూచించారు. పిల్లలు బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు జాగ్రత్తలు ,సమయ పాలన పాటించాలని, డ్రైవర్ నిర్లక్ష్యం వహించవద్దన్నారు. అదేవిధంగా బస్సులకు అన్ని డాక్యుమెంట్లు విధిగా ఉండాలని, నియమాలను ఎవరు ఉల్లంఘించిన వారిపై చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.అనంతరం డ్రైవర్ లతో కలిసి రోడ్డు భద్రతా నియమాల ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఏమి రెడ్డి రాజశేఖర్ రెడ్డి , టూ టౌన్ ఇన్స్పెక్టర్ రాఘవరావు , టూ టూన్ ఎస్ఐ సైదులు, జయకర్, రూరల్ ఎస్ఐ సైదా బాబు, ప్రైవేటు పాఠశాలల యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ దవాఖాన నిర్లక్ష్యం

### ఎక్స్పైరీ మందులతో పేషెంట్ అస్వస్థత



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్లక్ష్యం వెలుగుచూసింది. కాలికి గాయం అయిన రోగికి ఎక్స్పైరీ అయిన మందులు ఇచ్చిన ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. తుర్కపల్లి మండలం వాసాలమరి గ్రామంనికి చెందిన తొలిచుక్క అంజయ్య రెండు రోజుల క్రితం తన కాలికి గాయం కావడంతో స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వెళ్లారు. అక్కడ వైద్య సిబ్బంది ఆయనకు చికిత్స చేస్తూ మందులు, ఇంజెక్షన్ అందించారు. అయితే శనివారం మధ్యాహ్నం అంజయ్య అకస్మాత్తుగా తీవ్ర అస్వస్థతకు గురికావడంతో సమీప ఆర్ఎంపి వైద్యుడిని సంప్రదించారు. ఆర్ఎంపి పరిశీలించగా ఇచ్చిన మందులు మరియు ఇంజెక్షన్ గడువు తీరిపోయినవని గుర్తించారు. ఈ విషయం తెలియడంతో అంజయ్య కుటుంబ సభ్యులు మరియు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇలాంటి నిర్లక్ష్యం ఎలా జరిగిందో అధికారులు విచారణ జరపాలని వారు డిమాండ్ చేస్తున్నారు. స్థానిక ప్రజలు వైద్య ఆరోగ్య శాఖపై నమ్మకం దెబ్బతిందని చెబుతూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## మహిళ మెడలోని బంగారాన్ని దొంగిలించేందుకు యత్నించిన వ్యక్తికి దేహశుద్ధి



**ప్రజాపక్షం /నార్కట్ పల్లి :** మహిళ ఒంటి మీద ఉన్న బంగారాన్ని దొంగిలించేందుకు ప్రయత్నించిన వ్యక్తి కి దేహశుద్ధి చేసిన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నార్కట్ పల్లి మండల పరిధిలోని దాసరిగూడెం గ్రామంలో ఉప్పల సునీత ఒంటరిగా బావి వద్దకు వెళుతుండగా, దారిలో కాపు కాసిన దొంగ ఆమెతో ఏదో అడుగుతున్నట్లు మాట్లాడుతూ ఆమె మెడలోని బంగారాన్ని లాక్కొని వెళ్లేందుకు ప్రయత్నించగా, ఆమె దొంగతనానికి వచ్చాడనే విషయాన్నీ పసిగట్టిన ఆ మహిళ అతన్ని పట్టుకొని బంగారాన్ని లాక్కెళ్ళకుండా కాపాడుకుంది.ఈ సమయంలో అతను ఆ బంగారాన్ని లాగేందుకు విపరీతంగా ప్రయత్నించిన ఆమె వదలక పోగా గట్టిగా కేకలు వేయడంతో గమనించిన స్థానికులు అటువైపుగా వెళ్లి దొంగను పట్టుకొని దేహశుద్ధి చేశారు.విషయాన్ని స్థానిక పోలీసులకు తెలపడంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ క్రాంతికుమార్ దొంగను తీసుకెళ్లి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇలా నిత్యం ఏదో ఒకచోట ఒంటరి మహిళలపై బంగారాన్ని ఎత్తుకెళ్లేందుకు దొంగల ముఠా ప్రయత్నించడంతో మహిళలు భయాందోళనలకు గురవుతున్నారు. బంగారం ధరలు విపరీతంగా పెరగడంతోనే ఇలాంటి సంఘటనలు చేసుకుంటున్నాయని పోలీసులు వెల్లడిస్తున్నారు.

## పనిలో నాణ్యత, పారదర్శకత

### కేసుల్లో నేరస్తులకు త్వరగా శిక్షలు పడేలా కృషి జిల్లా ఎస్‌పి

**ప్రజాపక్షం/సూర్యాపేట :** కోర్టు డ్యూటీ సిబ్బంది తమ పనిలో నాణ్యత, పారదర్శకత ఉండేలా, కేసుల్లో నేరస్తులకు త్వరగా శిక్షలు పడేలా కృషి చేయాలని జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయం నందు జిల్లా ఎస్‌పి ఆధ్వర్యంలో కోర్టు డ్యూటీ సిబ్బందికి ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పెండింగ్ ఉండకుండా పని చేయాలన్నారు. కోర్టు వారెంట్, సమన్‌లు సకాలంలో అందజేయాలని తెలిపారు. సిబ్బంది కోర్టులో సమన్వయంగా, సమయపాలనతో పనిచేయాలని, ఎప్పటికప్పుడు కేసుల స్థితిగతులను రికార్డులలో, అంతర్జాలంలో నమోదు చేసుకోవాలని సూచించారు. బాధితులను, సాక్షులను, నిందితులను సకాలంలో కోర్టులకు ప్రవేశపెట్టి కేసులు పరిష్కారం అయ్యేలా పనిచేయాలని సూచించారు. కేసుల్లో త్వరితగతిన నేరస్తులకు శిక్షలు అమలు అయితేనే క్షేత్రస్థాయిలో నేరాలను అదుపు చేయవచ్చన్నారు. ఒక లక్ష్యంతో పని చేయాలని కోర్టు అధికారులతో ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, డిసిఆర్‌బి డిఎస్‌పి రవి, ఇన్స్పెక్టర్ హరి బాబు, కోర్టు డ్యూటీ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.




## పర్యావరణకు గోవిజ్ఞాన పరీక్ష



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట జిల్లా కేంద్రంలో శ్రీసరస్వతి విద్యాలయంలో గోసేవా విభాగం ఆధ్వర్యంలో శనివారం జిల్లాస్థాయి గోవిజ్ఞాన పరీక్షలు 2025, లెవల్ 2లో దాదాపు 25 పాఠశాలలు, 150 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సరస్వతి విద్యాపీఠం నల్లగొండ విభాగ్ కార్యదర్శి యానాల వెంకట్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా గోమాత మూత్రం ఉపయోగాలు, గోమాత నుండి వచ్చే వ్యర్థాలను వర్మి కంపోస్ట్‌గా మార్చుకునే విధానం, గోమాత నుండి వచ్చే పాలు, పెరుగు, నెయ్యి మన ఆరోగ్యానికి ఎలా ఉపయోగపడతాయో వాటి గురించి వివిధ పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు చాలా చక్కగా రాసి విజేతలుగా నిలవడం అభినందనీయమన్నారు. మొదటి బహుమతి సిటి టాలెంట్ విద్యార్థులు, రెండవ బహుమతి సృజన పాఠశాల విద్యార్థి గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల రవి కుమార్, డాక్టర్ వి చంద్రశేఖర్ శాస్త్రి, పి పరిపూర్ణ చారి, సంధ్య, శ్రీధర్, హైమావతి పాల్గొన్నారు.

# బంద్‌లో ఆ నలుగురు ఎక్కడ?

## కనిపించని బిఆర్ఎస్ నేతలు కెటిఆర్, హరీష్‌రావు, బిజెపి నాయకులు రాంచందర్‌రావు, మహేశ్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలనే డిమాండ్‌తో యావత్ తెలంగాణ స్తంభించింది. అయితే తాము బిసి రిజర్వేషన్‌లకు వ్యతిరేకం కాదని చెబుతూ వస్తున్న పార్టీల అధినేతలు ఆందోళనల్లో మాత్రం పత్తా లేకుండా పోయారు. బిసి జెఎసి ప్రతినిధులు అన్ని పార్టీల ముఖ్యనాయకులను కలిసి బంద్‌కు మద్దతు కోరారు. అందరూ పూర్తి మద్దతు ప్రకటించారు. అయితే బంద్‌లో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు, మాజీ మంత్రి టి.హరీశ్ రావు హాజరుకాలేదు. ఆర్‌టిసి క్రాస్ రోడ్డులో నిర్వహించిన నిరసనలో మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, గంగుల కమలాకర్ తదితరులు పాల్గొన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, బిజెఎల్‌పి నాయకుడు మహేశ్వర్ రెడ్డిలు సైతం ధర్నాల వైపు కన్నెత్తిచూడలేదు. ఇదే సమయంలో టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ క్రియాశీలకంగా పలు ప్రాంతాల్లో జరిగిన ర్యాలీలు, నిరసన ప్రదర్శనలలో పాల్గొన్నారు. అంబర్‌పేట్‌లో ప్రదర్శనలో పాల్గొనగా, అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎంజిబిఎస్‌లో బిసి సంఘాలతో కలిసి, ట్యాంకు బండ్‌పై మంత్రులతో కలిసి బైఠాయించారు. ఇక వామపక్ష పార్టీలకు చెందిన అగ్రనాయకులు వైఎంసిఏ నుండి అబిడ్స్ వరకు నిర్వహించిన ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు, జాతీయ నాయకులు డాక్టర్ కె.నారాయణ, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, ప్రొఫెసర్ కోదండరామ్, ప్రజాసంఘాల నేతలు సంధ్య, విమలక్క తదితరులు పాల్గొన్నారు. పదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన పార్టీ వర్కింగ్ ప్రెసిండెంట్ కెటిఆర్, కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావులకు బిసి బంద్‌లో పాల్గొనకపోవడంపై సర్వత్ర చర్చనీయాంశంగా మారింది.

# బిసిల ఉద్యమానికి అండగా కవులు, రచయితలు

## పూలే విగ్రహం సాక్షిగా ప్రతిన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసిల న్యాయబద్ధమైన, రాజ్యాంగపరమైన హక్కుల సాధన కోసం కవులు రచయితలు బిసిల సామాజిక ఉద్యమం వెంట నిలుస్తారని పలువురు కవులు రచయితలు సాహిత్య సంస్థల నేతలు ప్రకటించారు. అన్ని ప్రజాస్వామిక ఉద్యమాల మాదిరిగానే బిసిల ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం కోసం సాహిత్య లోకం అగ్రభాగాన నిలుస్తుందన్నారు. బిసి జెఎసి చేపట్టిన బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన ఉద్యమానికి కవులు రచయితలు సాహిత్య సంస్థలు సంపూర్ణ మద్దతును ప్రకటించాయి. శనివారం జరిగిన 'బంద్ ఫర్ జస్టిస్'లో ఆ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ఓల్డ్ ఎంఎల్‌ఏ క్వార్టర్స్ ముందు మహాత్మ జ్యోతిబాపూలే, సావిత్రిబాపూలే విగ్రహాలకు కవులు, రచయితలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్, తెలంగాణ సాహితీ వ్యవస్థాపక అధ్యక్షులు కె.ఆనందచారి, అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి రాపోలు సుదర్శన్, ఉపాధ్యక్షులు బొమ్మగాని నాగభూషణం, ప్రముఖ కవి అనంతరాజు మోహన్ కృష్ణ, తెలంగాణ బుక్ ట్రస్ట్ కార్యదర్శి కె.చంద్రమోహన్, ప్రముఖ ముద్రపకుడు బోడ లక్ష్మీ నరసు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజెఐజెయు) నాయకులు ఇ.చంద్రశేఖర్, ఆర్.సౌజన్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.










# యాసంగికి విత్తనాలు సిద్ధం

## విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** యాసంగి 202526 సీజన్‌లో రైతులకు వరి, శనగ, వేరువనగ, పెసర, మినుము, నువ్వులు, కొర్రలు వంటి పంటల నాణ్యమైన విత్తనాలు విత్తనాభివృద్ధి సంస్థ వద్ద అందుబాటులో ఉన్నాయని విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ఆగ్రోస్ ఎండి రాములు ,సహకార సంఘ అధికారి చంద్రమోహన్ రెడ్డి, సెర్ప్ అధికారులతో శనివారం ఆయనతో పాటు ఎండి యాస్మిన్ భాషా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాబోయే యాసంగి సీజన్‌లో తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఉత్పత్తి చేసిన టిజి సీడ్స్ నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించే ప్రణాళికపై సవివరంగా చర్చించారు. సంస్థ విత్తనాలను వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతు వేదికల ద్వారా విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచే అంశం, అలాగే సహకార సంఘాలు, ఆగ్రోస్ మరియు మహిళా సంఘాల ద్వారా నాణ్యమైన విత్తనాల పంపిణీ అంశాలపై చర్చించారు. తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ పండించే నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించడంలో తమ శాఖల వంతు సహకారం అందిస్తామని రైతు వేదికల ద్వారా ,సహకార సంఘాల ద్వారా రైతులకు సంస్థ విత్తనాలను అందించేలా చర్యలు చేపట్టుతామని తెలిపారు. అలాగే రైతు సేవ కేంద్రాల ద్వారా కూడా రైతులకు అందిస్తామని చెప్పారు. ఇలా చేయడం వలన రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుతాయని అన్నారు.






# ఎసిబికి చిక్కిన ట్రాన్స్‌కో ఎఇ

## రూ.30 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత

**ప్రజాపక్షం/గండిపేట:** హిమాయత్సాగర్ కరెంట్ ఆఫీస్‌లో అధికారుల సోద రాష్ట్రంలో ఎసిబి అధికారుల దూకుడుతో అవినీతి అధికారులు రోజుకు ఒకరి కంటే ఎక్కువగానే పట్టుబడుతున్నారు. తాజాగా రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్ నగర శివారులో మరో ప్రభుత్వోద్యోగి ఎసిబికి చిక్కారు. గండిపేట మండలం బండ్లగూడ మున్సిపల్ పరిధిలో ఉన్న హిమాయత్సా గర్ విద్యుత్ కార్యాలయంలో శనివారం ఏసీబీ అధికారులు దాడులు చేశారు. ఓ బాధి తుడి నుంచి రూ.30వేలు లంచం తీసుకుంటుండగా ట్రాన్స్‌కో ఏఈ రాకేశ్ రెడ్ హ్యాండెడ్ పట్టు బడ్డారు. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.









# మంగోలికా ప్రధానమంత్రి రాజీనామా

## కేవలం నాలుగు నెలలు మాత్రమే పదవిలో కొనసాగింపు

**ఉలాన్‌బాటర్:** తూర్పు ఆసియా దేశం మంగోలియా ప్రధానమంత్రి గోంబొజావ్ జాన్ షాటర్ (55) పదవికి రాజీనామా చేశారు. కేవలం నాలుగు నెలలు మాత్రమే ఆయన ప్రధానమంత్రి పదవిలో కొనసాగారు. రాజ్యాంగాన్ని ఉల్లంఘించారని ఆరోపణలు రావడంతో దేశ అత్యున్నత చట్టసభలో అవిశ్వాస తీర్మానం పెట్టారు. తీర్మాన గెలవడంతో ఆయన రాజీనామా చేయాల్సి వచ్చింది. అతి తక్కువకాలం ఆయన ప్రధాని పదవి నిర్వహించారు. ఆయన స్థానంలో మరొకరిని నియమించేవరకూ తాత్కాలిక ప్రధానమంత్రిగా ఆయన బాధ్యతల్లో కొనసాగుతారు. 126 మంది సభ్యులున్న మంగోలియా పార్లమెంటులో 71 మంది ఆయన రాజీనామా చేయాలని కోరగా, 40 మంది పదవిలో కొనసాగాలని మద్దతు ఇచ్చారు. రాజ్యాంగ విరుద్ధంగా ప్రవర్తించారని, ఎవరినీ సంప్రదించకుండా పార్లమెంటును పరిగణనలోకి తీసుకోకుండా జస్టిస్,హోంమంత్రిని నియమించారని 50 మంది ఎంపీలు ఈనెల పదో తేదీన సభలో అవిశ్వాస తీర్మానం పెట్టారు.









Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com